# జనబలం

70 ఏళ్ల రిపబ్లిక్- సమాఖ్య వ్యవస్థ

ఫిబ్రవరి 2020 లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక రూ.10/-

ప్రజలే ప్రభువులు






## ఐడీఏడబ్ల్యూ 2020


## ధన రాజకీయాల కట్టడికి హైదరాబాద్‌లో జాతీయ సదస్సు - డిక్లరేషన్

# ఐడీఏడబ్ల్యూ 2020 కొన్ని చిత్రాలు














ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


సంపుటి 23 సంచిక 2

ఫిబ్రవరి 2020



సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్


## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

## చందాదారులకు విజ్ఞప్తి

చాలా మంది చందా గడువు ముగిసినా జనబలం పత్రికను మీకు ప్రతీనెలా పంపుతున్నాము.అట్టివారు తప్పక తమ చందాను వెంటనే పునరుద్ధరించుకోగోరుతున్నాము. చందా డబ్బును Foundation for democratic reforms పేరున జనబలం కార్యాలయంనకు పంపగలరు.

## లోపలి పేజీల్లో...


06 ఫ్యూడలిజం నుంచి రాజ్యాంగ ప్రజాస్వామ్యం వైపు..

15 ధన రాజకీయాలను ఇంకా ఉపేక్షిస్తే ఉపద్రవమే

25 ప్రత్యక్ష ఎన్నికే పరిష్కారం!

27 ఓట్ల కొనుగోలును చట్టంతో అరికట్టలేం



కార్యాలయ చిరునామా : తులిప్స్ అపార్ట్‌మెంట్స్ 6-3-655, ప్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక, సోమాజిగూడ, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288

Email: janabalam.loksatta@gmail.com, loksattaudyamasamstha@gmail.com


## కార్టూన్ కార్నర్




ఎన్నికల్లో నేనేనాడూ డబ్బివ్వను. బిర్యానీ పొట్లాలూ, సారా ప్యాకెట్లూ, పంచెలూ చీరలూ ఇస్తా. డబ్బుతో ఓటు కొనకూడదు!

## జనబలంలో ప్రకటన రేట్లు

| | |
|---|---|
| **కలర్‌పేజీ:** | **10,000** |
| **ఇన్‌సైడ్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ :** | **5,000** |
| **ఫుల్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ :** | **2,000** |
| **సగం పేజీ బ్లాక్ అండ్ వైట్:** | **1,000** |



ప్రకటన రుసుము, ప్రకటనకు సంబంధించిన ఫొటోలు, సమాచారం ప్రతినెలా 20వ తేదీ లోపుగా మాకు అందేలా పంపించగలరు. చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను

**చిరునామా: సంపాదకుడు, జనబలం, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక,**
*తులిప్స్ అపార్ట్‌మెంట్స్, 6-3-655, ఫ్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక,*
*సోమాజిగూడ, హైదరాబాద్-500 082*

సంపాదకీయం

# కాయకల్ప చికిత్సలతో ఆర్థిక మాంద్యం దూరమయ్యేనా?

2020-21 సంవత్సర బడ్జెట్ పోకడలను గమనిస్తే ప్రపంచ వ్యాప్తంగా మన దేశంలోనూ ఆర్థిక మాంద్యం అనే ఏనుగంత సమస్యను ముందుంచుకుని దానికి తగ్గట్టుగా అవసరమైన లక్ష్యంతో బడ్జెట్ను ప్రవేశపెట్టినట్టుగా లేదు. బడ్జెట్ అంతటిని ఒక సారి స్థూలంగా పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది . బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ఒకరోజు ముందు జాతీయ ప్రభుత్వమే విడుదల చేసిన ఆర్థిక సర్వే స్పష్టంగా ఆర్థిక మాంద్యానికి అవసరమైన పరిష్కారాలు చెప్పింది . వాటి పునాదిపైనే కేంద్ర బడ్జెట్ ఉంటుందని ఆర్థిక విశ్లేషకులు ఆశించారు . కానీ దేశ వ్యాప్తంగా ఎదుర్కొంటున్న ఆర్థిక మాంద్యాన్ని అరికట్టి ఐదు మిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ ను నిర్మిస్తామని చెబుతున్న దేశ ప్రధాని మోడీ మాటలు నిజమవుతాయా అన్న ప్రశ్న తలెత్తుతుంది .ఎన్డీయే కూటమికి దేశ ప్రజలు ఒక మంచి అవకాశాన్ని మరోసారి ఇచ్చారు. పార్లమెంటులో అఖండ మెజారిటీతో రెండోసారి అధికారంలోకి తెచ్చారు. ఇప్పటికైనా దేశ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి అవసరమైన సంస్కరణలు చేసే మెజార్టీని కూడా ప్రజలు ఇచ్చారు. కానీ ఈ బడ్జెట్లో చూస్తే అందుకు తగిన ఏర్పాట్లు కానీ ముందు చూపు గాని లేవు అనిపిస్తుంది .ప్రజాకర్షక పథకాల రద్దు విషయంలో కానీ క్షీణించిన ప్రజల కొనుగోలు శక్తి పెంచడం విషయంలో కానీ తగిన ఏర్పాట్లు బడ్జెట్లో లేవని పిస్తుంది. అలాగే ప్రణాళికేతర వ్యయం పెరిగి అభివృద్ధికి నిధులు సమకూర్చే లేని పరిస్థితి అధిగమించాలని కేంద్ర ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. ఉత్పత్తి రంగంలో మన దేశం ఇంకా ఎంతో వెనుకబడి ఉంది.

మేక్ ఇన్ ఇండియా మేడిన్ ఇండియాగత ఐదు సంవత్సరాలు గా కేవలం ఒక నినాదంగా మాత్రమే మిగిలిపోయింది. మౌలిక వసతుల కొరత తో పాటు విదేశీ పెట్టుబడులను ఆకర్షించటానికి అవసరమైన ఏర్పాట్లు ఏమి ఈ బడ్జెట్లో లేకపోవడం గమనార్హం . పైగా లాభాల్లో ఉన్న ఎల్ఐసి లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను కూడా ప్రైవేటు పరం చేయాలని చూడడం మరో విడ్డూరం. ఇప్పటిదాకా ఏ ప్రభుత్వమైనా ప్రభుత్వ రంగ సంస్థలు అమ్మడానికి కారణాలు అన్వేషించేది. అందులో ముఖ్యమైనవి నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకానికి కొన్ని కారణాలను చూపెట్టేది కుక్కను చంపాలంటే దాన్ని పిచ్చికుక్కగా ముద్రవేయాలనే సామెతను వాడేది. కానీ ఒకపక్క నష్టాల్లో ఉన్న ఎయిర్ ఇండియాను మరోపక్క లాభాల్లో ఉన్న ఎల్ఐసి తో పాటు ఇంధన చమురు ప్రభుత్వ రంగ సంస్థలను కూడా ప్రైవేటీకరణ వైపు లాగడం చూస్తే ఏ ప్రాతిపదికగా తీసుకొని ఈ పని చేస్తుందో కేంద్ర ప్రభుత్వానికి స్పష్టత లేదని పిస్తుంది. పరస్పర విరుద్ధమైన అంశాలను ఈ బడ్జెట్లో పొందుపరిచింది. లాభాల్లో ఉన్న ఎల్ఐసి అమ్ముదాం అంటే కూడా ప్రైవేటు రంగంలో ఉన్న మిగతా భీమా సంస్థల కంటే ఎల్ఐసి షేర్లు కొనడానికి ముందుకు రాని వైనం ఈ పదిహేను రోజుల్లోనే తేటతెల్లమైంది. ప్రభుత్వ రంగ సంస్థలలో కార్పొరేట్ నిర్వహణ సామర్థ్యం లేకపోతే ఎలా ఉంటుందో ఇలాంటి సంఘటనలు రుజువు చేస్తున్నాయి .

ఇక ఆదాయపన్ను స్లాబు ల విషయంలో మూడు నుంచి ఆరు కి పెంచడం ద్వారా ప్రభుత్వం పిల్లిమొగ్గలు వేసింది .పాత కొత్త స్లాబు లో దేనిలో ఉండాలనే విషయం పన్ను చెల్లింపుదారులకు విడిచిపెట్టడం వల్ల ఏది లాభమో నష్టమో తేల్చుకోలేని సందిగ్ధంలో పడిపోయేలా చేసింది. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చినప్పటినుండి గత ఐదేళ్లలో పెద్ద నోట్ల రద్దు నుండి జిఎస్టి అమలు దాకా అనేక తప్పులు చేస్తూ అయ్యగారు ఏం చేస్తున్నారంటే చేసిన తప్పులు దిద్దుకుంటూ ఉన్నారన్న పాత సామెత తిరగరాస్తూ చేసిన తప్పులే మళ్లీ మళ్లీ చేస్తున్నారన్న కొత్త సామెత లు సృష్టిస్తున్నారు .ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మేల్కొని అవసరమైన ఆర్థిక సంస్కరణలు తీసుకు వచ్చి దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక మాంద్యాన్ని నివారించే చర్యలు చేపట్టాలి . అంతా బాగుందని భేషజాలకు పోకుండా బాగు చేయాల్సిన ఆర్థిక వ్యవస్థను బాగుచేయడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. అప్పుడే మన దేశ ఆర్థిక వ్యవస్థ దృఢంగా ఉంటుంది.

- బండారు రామమోహనరావు

# ఫ్యూడలిజం నుంచి రాజ్యాంగ ప్రజాస్వామ్యం వైపు..

తెలుగువారంతా ఎంతో ఇష్టపడే హైదరాబాద్ మహానగరంలో జనవరి 9, 10 తేదీలలో ప్రతిష్ఠాత్మకంగా జరిగిన ప్రజాస్వామ్య సంస్కరణల జాతీయ సదస్సు అనుకున్నదాని కంటే ఎంతో ఫలప్రదంగా జరిగింది. ఈ విజయంతోపాటు ఇందులో జరిగిన చర్చలు, సభికులుగా పాల్గొన్న యువత స్పందన చూశాక.. మన రాజకీయం, సమాజంలో ఫ్యూడలిజం నుంచి రాజ్యాంగ సంస్కృతి వైపు బలమైన కదలిక మొదలైందన్న నమ్మకం బలపడింది. 'రాజకీయాల్లో డబ్బు ప్రాబల్యం'పై నిర్వహించిన ఈ సదస్సుకుఏర్పాటుకు, దీన్ని హైదరాబాద్‌లోనే నిర్వహించటానికీ చొరవ తీసుకున్నందుకు ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్‌ను పొదిలె, ప్రొఫెసర్ కె.సి సూరి వంటివారు సదస్సు నిర్వహణలో విలువైన సహాయసహకారాలను అందించారు.

మన దేశంలో ప్రజాస్వామ్యం నిలదొక్కుకున్నా.. ఇప్పటికీ ఓటు వేయటానికి, స్వేచ్ఛగా అరవటానికి మాత్రమే ఎందుకు పరిమితమైంది, ఏం చేస్తే అందరికీ ఎదిగే అవకాశాలున్న, సుస్థిరాభివృద్ధి గల ప్రజాస్వామ్య భారతం సాధ్యమవుతుంది.. అంశాలను చర్చించటానికి ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ)తో కలిసి 'ఆచరణలో భారత ప్రజాస్వామ్యం' (ఇండియన్ డెమొక్రసీ ఎట్ వర్క్-ఐడీఏడబ్ల్యూ) అనే పరిష్కార వేదికను ఎఫ్‌డీఆర్ ప్రారంభించింది. భారత ప్రజాస్వామ్యానికి సరైన చికిత్స, టీకాలను అందించేందుకు దేశవ్యాప్త




## MONEY POWER IN POLITICS

మొదట అభినందించాలి. ఎఫ్‌డీఆర్‌ను ఏర్పాటు చేసి ఇప్పటికి దాదాపు 23 ఏళ్లు. మన దేశం ఉన్న పరిస్థితుల్లో ఎఫ్‌డీఆర్‌ను హైదరాబాద్‌లో కాకుండా ఢిల్లీలో ఏర్పాటు చేస్తే అన్ని రకాలుగా మకుటాయమాన గుర్తింపు వస్తుందని పలువురు సూచించినా, ప్రజలు, మనం ఉండే హైదరాబాద్ ఢిల్లీకి ఏమీ తక్కువ కాదని జేపీ అప్పట్లోనే ఈ నగరాన్ని ఎంచుకున్నారు. అందుకే ఈ ప్రారంభ సదస్సుకు కూడా హైదరాబాద్‌నే ఎంచుకున్నారు. ఐఎస్‌బీ డీన్ రాజేంద్ర శ్రీవాస్తవ, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వైస్ ఛాన్సలర్ అప్పారావు ఏకాభిప్రాయాన్ని కూడగట్టే ప్రయత్నమిది. ఇందులో భాగంగా ఏటా ఒక కీలకాంశంపై సమగ్రంగా చర్చ చేసి దానికి సంబంధించిన పరిష్కారాల్ని ఆమోదయోగ్య కార్యాచరణ దిశగా రూపొందిస్తారు.

ఐడీఏడబ్ల్యూ (www.idaw.in) 2020 అంశంగా 'రాజకీయాల్లో డబ్బు ప్రాబల్యం' అనే అంశాన్ని తీసుకున్నారు. దేశవ్యాప్తంగా రాజకీయ, 2020 పరిష్కార చర్చా కార్యక్రమంగా జనవరి 9, 10 తేదీలలో హైదరాబాద్ ఐఎస్‌బీలో జరిగిన 'మనీ పవర్ ఇన్ పాలిటిక్స్' జాతీయ

సదస్సులో.. రాజకీయ నాయకులు, పౌర సమాజ బృందాలు, సామాజిక కార్యకర్తలు, మీడియా ప్రతినిధులు, సివిల్ సర్వెంట్లు, న్యాయకోవిదులు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు–అధ్యయనకారులు, ఇతర పలు రంగాలకు చెందిన వారూ దేశవిదేశాల నుంచి 30 మందికిపైగా పాల్గొన్నారు.

'భారత రాజకీయాల్లో చట్టబద్ధ వ్యయం, ఎన్నికల ప్రచార వ్యయం తగ్గించటానికి ఏర్పాట్లు', 'భారత్‌లో రాజకీయ ఫండింగ్‌లో పారదర్శకత–ప్రపంచ దేశాల అనుభవాల నుంచి నేర్చుకోదగ్గవి', 'ప్రచారవ్యయం తీరుతెన్నులు', 'రాజకీయ పార్టీల మీద సంస్థాగత నిర్వహణ భారం', 'భారత రాజకీయాల్లో చట్టవిరుద్ధ వ్యయం–నిరోధించే మార్గాలు', 'చట్టవిరుద్ధ వ్యయాన్ని ఎదుర్కోవటానికి ఎన్నికల సంస్కరణలు', 'ఇండియాలో ఓట్ల కొనుగోలుకు నిదర్శనాలు–ఇతర దేశాల్లోని పోల్చదగిన అనుభవాలు', 'భారత్: వేళ్లూనుకుంటున్న ప్రజాస్వామ్యమా లేక లోపభూయిష్ట ప్రజాస్వామ్యమా?', 'భారత్‌లో రాజకీయాల్లోకి ప్రవేశించటానికి అవరోధాలు', 'హక్కుగా పౌర సేవలు, వికేంద్రీకరణ ద్వారా పార్టీల నిర్వహణ భారాన్ని తగ్గించటం', 'ముగింపు సమావేశం' (హైదరాబాద్ డిక్లరేషన్) శీర్షికలతో సదస్సులో ప్లీనరీలు జరిగాయి. టి.ఎస్ కృష్ణమూర్తి (భారత మాజీ ఎన్నికల ప్రధానాధికారి), కాకి మాధవరావు (ఏపీ మాజీ ఎన్నికల కమిషనర్), ప్రొఫెసర్ కె.సి సూరి (యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్), అశ్విని ఛత్రె (ఐఎస్‌బీ అసోసియేట్ ప్రొఫెసర్), జస్టిస్ జాస్తి చలమేశ్వర్ (సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి), జయప్రకాష్ నారాయణ్ (ఎఫ్‌డీఆర్), అమిత్ వర్మ (రచయిత, జర్నలిస్టు, పోడ్‌కాస్టర్), కొండా విశ్వేశ్వరరెడ్డి (మాజీ ఎంపీ, కాంగ్రెస్), షరీన్ జోషి (జార్జి టౌన్ వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్), అశుతోష్ వర్షిణి (బ్రౌన్ యూనివర్సిటీ ప్రొఫెసర్), యామినీ అయ్యర్ (సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చి ప్రెసిడెంట్, సీఈవో), ప్రదీప్ ఛిబ్బర్ (యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బెర్కిలీ ప్రొఫెసర్) వీటికి అధ్యక్షత వహించారు.

ఇంటర్నెట్, ఫోన్ సౌకర్యం ూడా సరిగా లేని రోజుల నుంచి మొదలుపెట్టి ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా, లోక్‌సత్తా పార్టీ, ఎన్ఏపీ, రెండవ ఎస్ఆర్సీ, పలు పౌర, యువ వేదికల ద్వారా కృషి చేస్తున్న జేపీ విశేషానుభవాన్ని, నిత్య అధ్యయనాన్ని అడుగడుగునా ప్రతిఫలింప చేస్తూ.. హైదరాబాద్ సదస్సు ఎజెండా, ఉప అంశాలలో ఎటువంటి గందరగోళం లేకుండా తాజా పరిస్థితులకనుగుణమైన స్పష్టత కనిపించింది. ఎక్కడా 'సెన్స్ ఆఫ్ పర్పస్'ను కోల్పోకుండా సాగింది. అలాగే క్షేత్రస్థాయిలో, బ్యాక్‌గ్రౌండ్‌లో ఎఫ్‌డీఆర్ యువఅధ్యయన బృందం రోజుల తరబడి  కృషి చేసింది. గణనీయమైన మొత్తంలో డబ్బులు చెల్లించి మరీ యువత రిజిస్టర్ చేసుకుని సదస్సుకు హాజరయ్యారు.

పార్టీలకతీతంగా ఈ సదస్సును ఏర్పాటు చేశామని, ఇది రాజకీయాన్ని నిందించటం కోసం కాక, సమస్యని లోతుగా అర్థం చేసుకుని సమగ్ర చర్చల ద్వారా, ఏకాభిప్రాయ సాధన ద్వారా పరిష్కారసాధనలో నిర్మాణాత్మకంగా భాగస్వాములు కావటం కోసమని, అందుకే రాజ్యాంగ పదవిలో ఉన్న ఉప రాష్ట్రపతితో పాటు పలు పార్టీల నాయకులు కూడా వచ్చారని సదస్సుకు స్వాగతోపన్యాసం చేస్తూ జేపీ తెలిపారు. దేశవ్యాప్త ఎన్నికల్లో రాజకీయ పార్టీలు చేస్తున్న వ్యయం రూ.లక్ష కోట్ల మార్కును చేరుకుందన్న అంచనాపై భిన్నాభిప్రాయాలున్నా.. భారీగా డబ్బు చుట్టూనే రాజకీయం, ఎన్నికలు తిరుగుతున్నాయనేది వాస్తవమని సదస్సును ప్రారంభిస్తూ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. ప్రస్తుత లోక్‌సభలోని 533 మంది సభ్యుల్లో 475 మంది కోటీశ్వరులన్నారు. ఎన్నికల్లో రకరకాలుగా డబ్బు ఖర్చు చేయటంతోపాటు ప్రలోభపెట్టేందుకు 'బహుమతులుగా' ఇస్తున్న ఎన్నికల తాత్కాలిక తాయిలాల హామీలపై కూడా చర్చ జరగాలన్నారు. ఎఫ్ఆర్‌బీఎం చట్టం తరహాలో ఎన్నికల హామీలను కూడా ఒక పరిధి దాటి ఇవ్వకుండా రాష్ట్రాలను కట్టడి చేసే చట్టం తేవాల్సి ఉందని, ఫిరాయింపుల చట్టాన్ని బలోపేతం చేయటంతోపాటు జమిలి ఎన్నికలు జరగాలని అన్నారు. ఎన్నికల్లో భారీగా వ్యయం లెక్కలపై ఉప రాష్ట్రపతి కొంత సంశయాన్ని వ్యక్తం చేసినా.. ఆ తర్వాత ప్యానల్ చర్చల్లో పాల్గొన్న కేంద్ర మాజీ ఎన్నికల ప్రధానాధికారి టి.ఎస్ కృష్ణమూర్తి, తెలంగాణ ప్రస్తుత ఎన్నికల ప్రధానాధికారి రజత్ కుమార్ చెప్పిన వివరాలు వింటే, భారీ వ్యయాల అంచనాను సందేహించాల్సిన పన్లేదని స్పష్టమవుతుంది. ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థి రూ.10 కోట్లు ఖర్చు పెట్టటం మామూలుగా మారిందని, పలుచోట్ల అది పదుల కోట్లకు చేరుతోందని, మద్యం పంపకం షరా మామూలైందని ఏపీ మాజీ ఎన్నికల కమిషనర్ కాకి మాధవరావు అధ్యక్షతన జరిగిన ప్యానల్ చర్చలో రజత్ కుమార్ అన్నారు. తాను పదవిలో ఉన్నాను కాబట్టి.. తన మాటల్ని వ్యక్తిగత అభిప్రాయంగా పరిగణించాలని కోరారు. ఎన్నికల్లో అంత డబ్బు ఖర్చవుతుందని తెలుస్తున్నా, ఎందుకు పట్టించుకోవటం లేదని అడిగిన ప్రశ్నకు.. సాక్ష్యాలు దొరకకపోవటం, ఈసీకున్న కొద్దిసమయంలో పాలనా యంత్రాంగంపై పట్టులభించకపోవటం వంటి కారణాలను ఆయన చెప్పారు. ఎన్నికల్ని సజావుగా జరపటం ఈసీ బాధ్యతని, మిగిలిన సంస్కరణల భారం ప్రధానంగా రాజకీయ వ్యవస్థదని అన్నారు. ఎన్నికల్లో డబ్బు ప్రభావం వల్లే జేపీ ఓడిపోయారని కృష్ణమూర్తి వ్యాఖ్యానించగా, ఆ జాబితాలో తాను కూడా ఉన్నానని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కె. లక్ష్మణ్ అన్నారు. ఎన్ని మంచిపనులు చేసినా మళ్లీ ఎన్నికలు వచ్చే సరికి ఓటర్లు ఇతర పార్టీలు, అభ్యర్థుల వైపు చూసే ధోరణికి డబ్బు ప్రభావం కూడా పెద్దకారణమన్నారు. గత ఎన్నికల్లో ఏపీలో రూ.10,000 కోట్లు, తెలంగాణలో రూ.6,000 కోట్లు ఖర్చు

పెట్టారన్నారు. కాంగ్రెస్ నేత కొండా విశ్వేశ్వర రెడ్డి, తెలుగుదేశం నాయకుడు జేసీ దివాకర్ రెడ్డి కూడా ఎన్నికల్లో విపరీత డబ్బు ప్రభావాన్ని తమ అనుభవాల నుంచి నిర్మొహమాటంగా వివరించారు.

అయితే ఆర్థిక వ్యవస్థతోపాటు బడ్జెట్లు పెరిగినట్లే ఎన్నికల్లో ఖర్చు పెరుగుతోందని, ఎన్నికల్లో చేస్తున్న ఖర్చంతటినీ చట్టవిరుద్ధమని చెప్పటం సరికాదని చర్చల్లో పాల్గొన్న కొందరు వాదించారు. చట్టబద్ధంగానే చట్టవిరుద్ధ ఖర్చు చేస్తుంటే దాన్ని చట్టవిరుద్ధమని ఎలా చెప్పగలమని ఇంకొందరు ప్రశ్నించారు. ఏది అనుచిత వ్యయం, ఏది చట్టబద్ధ వ్యయం, ఏది చట్టవ్యతిరేక వ్యయం.. అనే అంశాల మీద నిర్వచనం సరిగా లేదని కార్నెజీ ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్‌కు చెందిన మిలన్ వైష్ణవ్ అన్నారు. ఇదేసమయంలో రాజకీయాల్లో డబ్బు ఖర్చుకు సంబంధించిన మరో కీలక కోణం చర్చలోకి వచ్చింది.

ఎన్నికల మధ్యకాలంలో ప్రధాన పార్టీలు ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో వందలాది కార్యకర్తలను పోషిస్తుండటం వల్ల పార్టీల నిర్వహణ మీద ఎలా విపరీత ఆర్థిక భారం పడుతోందో తెలియజేస్తూ క్షేత్రస్థాయి శాంపిల్ సర్వేతో ఎఫ్‌డీఆర్ రూపొందించిన నోట్ చర్చనీయాంశమైంది. ఇది తెలంగాణ రాష్ట్రంలోని నియోజకవర్గాలలో చేసిన సర్వే. ఈ నోట్‌లోని వివరాలను తాను ఒప్పుకుంటానుగానీ, దీన్ని ధనరాజకీయంలో భాగంగా చూపటాన్ని అంగీకరించలేమని తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, టీఆర్ఎస్ నేత బి. వినోద్ కుమార్ అన్నారు. కార్యకర్తలు ప్రజలకు పనులు చేసిపెట్టటం ప్రజాస్వామ్యంలో భాగమేనన్నారు.

ఎఫ్‌డీఆర్ యువబృందం సమర్పించిన నోట్‌లో ఏముందంటే: "తెలంగాణలో ఒక్కో ప్రధాన పార్టీకి చెందిన ఎమ్మెల్యే లేదా అభ్యర్థి ఎన్నికలు లేని సమయంలో ఏడాదికి దాదాపు రూ. 4.5 కోట్లు ఏదోకరూపంలో కార్యకర్తల మీద ఖర్చు చేస్తున్నారు. ఈ కార్యకర్తల సంఖ్య ఒక్కో నియోజకవర్గానికి సరాసరిన 200 వరకూ ఉంటుంది. వీరు చేసే పనేంటంటే.. ఎన్నికల మధ్యకాలంలో నిరంతరం ప్రజల మధ్య అందుబాటులో ఉండటం, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసి పెట్టటం! కార్యకర్తల్లో ఎక్కువమంది సామాన్యులు, అల్పాదాయ కుటుంబాలవారే. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులవ్వాలంటే సామాన్య ప్రజలకు ఈ కార్యకర్తలే శరణ్యం. రాష్ట్రంలో పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి రిలీఫ్‌ఫండ్ వగైరాలపై 62 శాతం కార్యకర్తలు పనిచేస్తుండగా, 48 శాతం మంది పోలీసు కేసులు, 46 శాతం మునిసిపల్ కార్యాలయ పనులు (ఆధార్ కార్డు, రేషన్ కార్డు మొదలైనవి), 37 శాతం మంది రెవెన్యూ పనులు, 59.4 శాతం ఇతరత్రా (విద్యుత్తు, నీటి సరఫరా వగైరాలు), 2.7 శాతం మంది కాంట్రాక్టులు, టెండర్లు మీద పనిచేస్తున్నారని ఎఫ్‌డీఆర్ సర్వేలో తేలింది. కార్యకర్తల్లో అనేకమందికి జీవనోపాధిని అందించే వృత్తి, ఉద్యోగాలు ఉండవు. డబ్బున్న స్థానిక బృంద నాయకుడు/నాయకురాలి మీద ఆధారపడటం ద్వారానో లేదా చిన్న కాంట్రాక్టులు, ట్రాన్స్‌ఫర్లు, పోస్టింగులు వంటి పనులు చేసి పెట్టి కొంత డబ్బు తీసుకోవటం, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసిపెట్టినందుకు కొంత ఫీజు వసూలు చేయటం వంటి పద్ధతుల్లోనో వీరు డబ్బు సంపాదిస్తుంటారు. ఈ రకంగా ఒక్కో ప్రధాన పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎన్నికల మధ్య ఐదేళ్లకాలంలో ప్రత్యక్షంగాను, పరోక్షంగాను రూ. 2,675 కోట్లు ఖర్చు చేస్తుండగా, తెలంగాణలో అన్ని ప్రధాన పార్టీలూ కలిపి రూ. 6,600 కోట్లు ఖర్చు చేస్తున్నాయని తేలుతుంది. ఇదికాక ఎన్నికలు వచ్చాయంటే, ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికీ కనీసం రూ. 10 కోట్లు ఖర్చు చేస్తారు. ఈ రకంగా తక్కువలో తక్కువ మరో రూ. 3,000 కోట్లు తెలంగాణలో పార్టీల ద్వారా ఖర్చవుతాయి". ఇలా అసంబద్ధమైనరీతిలో కార్యకర్తలను పోషించే వ్యవస్థ వల్ల ప్రపంచంలోని అన్ని ప్రజాస్వామ్యాల్లోకీ సంస్థాగత నిర్వహణ వ్యయభారాన్ని అత్యధికంగా మోస్తున్నది భారతదేశంలోని రాజకీయ పార్టీలేనని ఎఫ్‌డీఆర్ సర్వే పేర్కొంది. ఎఫ్‌డీఆర్ సర్వే శాంపిల్ పరిమితమైనదే అయినా, తెలంగాణలోని కొందరు ఎమ్మెల్యేలు, ప్రధాన పార్టీల నేతల కార్యాలయాల్లో ఉండే కార్యకర్తలతో సవివరంగా మాట్లాడి లోతుగా విశ్లేషించి ఈ రిపోర్టును తయారు చేశారు.

పార్టీల మీద ఇంత భారం పడటానికి కారణం క్షేత్రస్థాయిలో సామాన్య ప్రజలకి కనీస సేవలు సరిగ్గా అందక పోవటం. పార్టీల కార్యకర్తల అండలేకుండా ప్రభుత్వ ఆఫీసులలో పని చేయించుకోవటమే అత్యధికులకి అసాధ్యం. అందుకోసం పార్టీ కార్యకర్తలు తమకి నిరంతరం అందుబాటులో ఉండాలని ఓటర్లు కోరుకుంటున్నారు. ఓట్లు కోరుతున్న పార్టీలకి ఓటర్ల అవసరాలని తీర్చటానికి వేలాదిమంది కార్యకర్తలతో కూడిన యంత్రాంగాన్ని అందుబాటులో ఉంచటం తమ మనుగడకి అవసరమయింది. అలా కార్యకర్తలు గ్రామగ్రామాన, ప్రతి కాలనీలో, వార్డులో ప్రజలకి అందుబాటులో లేకుంటే ఆ పార్టీ ప్రజల దృష్టిలో నిజంగా ఎన్నికల బరిలో పోటీలో ఉన్న పార్టీ కాదు. ఇలా పార్టీల మీద విపరీత భారం పరోక్షంగా పడుతోంది. ఇందుకు కారణం ప్రభుత్వ యంత్రాంగంతో పనులు సమర్థంగా చేయించే ఏర్పాట్లు లేకపోవటం. పరిణతి చెందిన ప్రజాస్వామ్యాలలో పార్టీల కార్యకర్తలు తమ స్వంత పనులన్నీ మానుకుని నిరంతరం ప్రజలకి అందుబాటులో ఉండటమన్న ప్రశ్నే తలెత్తదు. పార్టీల ప్రమేయం లేకుండా పౌరులందరికీ సకాలంలో, సమర్థంగా, నిజాయితీగా సేవలందించే ఏర్పాట్లు ఆ దేశాలలో ఉన్నాయి. పార్టీల మీద ఈ భారాన్ని తగ్గించనంతకాలం మన వ్యవస్థలో అవినీతి అనివార్యం. ఈ సమస్యని పరిష్కరించకుండా పార్టీలని నిందించటం నిరర్థకం.

ఎఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ కూడా పార్టీ నిర్వహణలో రోజువారీ కార్యకర్తల వ్యయాన్ని భారంగా చూడక్కర్లేదనే అభిప్రాయపడ్డారు. అయితే వినోద్, అసద్ ఇద్దరూ కూడా ఎన్నికల వ్యయాన్ని పెద్దభారంగానే అంగీకరించారు. డబ్బు రావటానికి బాండ్ల రూపంలో ప్రవేశపెట్టిన ఎన్నికల విరాళాల పద్ధతి ప్రతిపక్ష, ప్రాంతీయ పార్టీలకు పెద్ద అవరోధంగా మారిందని అసద్ అన్నారు. అధికారంలో ఉన్న జాతీయ పార్టీకే నిధుల్లో ఎక్కువ భాగం వెళ్తున్నాయన్నారు. జాతీయ పార్టీల దెబ్బకు ప్రాంతీయ పార్టీలు కూడా ఎన్నికల్లో భారీగా ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. కొందరు వ్యక్తులకున్న తపన, బలమైన సంకల్పం, నాయకత్వ సామర్థ్యం వల్ల పార్టీలు నడుస్తున్నాయని.. ఇలాగే డబ్బు రాజకీయం కొనసాగితే కొన్నాళ్లకు లెటర్‌హెడ్ మీదే పార్టీలు నడిచే ప్రమాదకర పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. రాజకీయాల్లో పెద్దమార్పు ఈ ఏడాది నుంచైనా మొదలవ్వాలన్నారు. కార్పొరేట్, బహుళ జాతి సంస్థలు, ఎన్‌జీవోల నుంచి ఫండింగ్‌ను నిషేధించి ప్రజల నుంచి మాత్రమే విరాళాలు సేకరించే పద్ధతిని ప్రవేశపెట్టాలన్నారు. సామాన్యులు రాజకీయాల్లోకి రావటానికి అవరోధంగా ఉన్న ధనరాజకీయ ఎన్నికలు పోవటానికి దామాషా ఎన్నికల పద్ధతిని ప్రవేశపెట్టటంపై చర్చ జరగాలని వినోద్, అసద్ అన్నారు.

ఇంతకీ పార్టీ నిర్వహణలో భాగంగా కార్యకర్తలపై, పార్టీ నాయకులపై పడుతున్న భారం ధనరాజకీయంలో భాగమా, కాదా? ఎన్నికల్లో సెలబ్రిటీల ప్రచారం, కోడ్ అమలుకాక ముందు తాయిలాల్ని ప్రకటించటం, మీడియాలో వార్తలను ప్రభావితం చేయటం వంటి చట్టబద్ధంగా చేస్తున్న ఖర్చు చట్టవిరుద్ధమా, కాదా? కేవలం డబ్బుంటేనే ఎన్నికల్లో గెలవొచ్చంటే ఫైనాన్స్ కంపెనీలు, బడా కంపెనీలవారే ఎన్నికల్లో పోటీ చేయాలి గదా?.. ఈ ప్రశ్నలకు సమాధానం సదస్సు ప్రారంభంలో, రెండోరోజు ప్లీనరీలోనూ జేపీ వ్యక్తం చేసిన ఆలోచనల్లో కనిపిస్తుంది. "రాజకీయాల్లో డబ్బు ఖర్చుచేసినంత మాత్రాన గెలవకపోవచ్చు. కానీ డబ్బు ఖర్చు చేయకపోతే మాత్రం ఓటమి ఖాయం. నూటికి ఒకరిద్దరికి, ఢిల్లీ వంటి అధికాదాయం, స్థానికంగా అధికారాలు ఉన్న చోటా కొంత మినహాయింపు ఉండొచ్చు. అత్యధిక శాతం ఎన్నికలు డబ్బు చుట్టూ తిరుగుతుండటం వల్లే రాజకీయాల్లో డబ్బున్నవారి సంఖ్య పెరుగుతోంది. కాంట్రాక్టర్లు, విద్యాసంస్థల యజమానులు.. ఇలా సంపన్నులు స్వార్థ ప్రయోజనాల కోసం చట్టసభల్లోకి ప్రవేశిస్తుంటే, సమాజం పట్ల ఆర్తి, సేవాభావం, దేశం దశ-దిశ మార్చగల పరిజ్ఞానం ఉన్నవాళ్లు రాజకీయాలకు దూరమవుతున్నారు. రాజకీయాల నిర్వహణకు డబ్బు అవసరమనటంలో సందేహం లేదు. కానీ ప్రజల పన్నుల డబ్బును దుర్వినియోగం చేస్తూ, వారి ఎదిగే అవకాశాలను దెబ్బతీసే ప్రతి ఖర్చూ ప్రజాస్వామ్య వ్యతిరేకం. దాన్ని చట్టవిరుద్ధ ఖర్చుగానే భావించాలి. ప్రస్తుతం అన్ని ప్రధాన పార్టీలూ డబ్బును ప్రజల సాధికారతను దెబ్బతీసేలా ఖర్చు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నాయి కాబట్టే.. ధనరాజకీయంపై మనం ఈ సదస్సు పెట్టి పరిష్కారాలను చర్చిస్తున్నాం" అని జేపీ అన్నారు. ఎఫ్‌డీఆర్ సర్వే చేసిన తెలంగాణలో రాష్ట్ర వార్షిక బడ్జెట్‌నే తీసుకుంటే జేపీ వాదన వాస్తవికమైనదని స్పష్టంగా అర్థమవుతుంది. బడ్జెట్‌లో సింహభాగాన్ని ప్రజల పన్నుల డబ్బు నుంచి ప్రభుత్వోద్యోగులు జీతభత్యాలుగా తీసుకుంటున్నారు. ఈ ఉద్యోగులు ఉండగా, మళ్లీ కార్యకర్తలు ఆ పనుల్ని ఎందుకు చేయాలి? ఆ కార్యకర్తలకు ఏదోకరకంగా ఆదాయాన్ని సమకూర్చేందుకు పార్టీలు ఎందుకు విపరీత ఆర్థిక భారాన్ని మోయాలి? వనరుల కోసం అవినీతికి, ప్రజల సొమ్ము దోపిడీకి ఎందుకు లైసెన్సు ఇవ్వాలి? పార్టీల కార్యకర్తలు స్వచ్ఛందంగా ప్రజలకు సేవ చేయటం వేరు. కానీ మిగతా ప్రజలందరి కంటే అనేకరెట్లు ఎక్కువ జీతాలు తీసుకుంటూ, జీవనభద్రతలను కలిగిఉన్న ప్రభుత్వోద్యోగులు చేయాల్సిన పనులను.. ఆదాయం ఆశించి కార్యకర్తలు మళ్లీ తమ ద్వారా చేసి పెట్టటం, వారికి నెలవారీ ఆదాయం ఇవ్వటానికి ఇసుక, కాంట్రాక్టులు, పోలీసు కేసుల్లో జోక్యం వంటి పద్ధతుల్లో ప్రజాధనాన్ని దోచిపెట్టటం, కార్యకర్తల భారాన్ని లెక్కలు చూపని డబ్బుతో పరోక్షంగా భరిస్తున్నందుకు పార్టీలు డబ్బున్న వారికి టికెట్లు, పదవుల్ని కట్టబెట్టటం ప్రజాస్వామ్యానికి తీవ్ర హానికరం కాదా? చట్టసభల్లో చట్టాలు చేయాల్సిన ప్రజాప్రతినిధులు ప్రభుత్వంలో జోక్యం చేసుకోవటం, ఇందుకోసం అధికార పార్టీలోకి ఫిరాయించటం, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు నాణ్యమైన సేవలు అందకుండా లంచాలు, వేధింపులు పెరగటం, దళారీ వ్యవస్థతో వనరులు దోపిడీకి గురికావటం, నల్లడబ్బు విరాళాలు పెరగటం.. ఈ రకంగా భారతదేశంలో రాజకీయ, పాలనా సంక్షోభానికి ఓ పెద్ద మూలకారణంగా కార్యకర్తల వ్యవస్థ నిర్వహణ వ్యయభారం ఉంది. ప్రభుత్వ కార్యాలయాల్లో అందరూ కాకున్నా అనేకమంది అధికారులు ఎంత ప్రజావ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారో, ప్రజలకు చదువు, అవగాహన లేకపోవటం సమస్యను ఎంత పెంచుతోందో జస్టిస్ చలమేశ్వర్ తన కెరీర్ అనుభవాలతో సహా వివరించారు. సభికుల నుంచి కూడా ఇదే వాదన వినిపించింది. ఓ పక్క ప్రభుత్వోద్యోగులకు బడ్జెట్‌లో భారీ వాటాను అధికారికంగా జీతాలుగా ఇస్తూ, వారి జీతాలు పెంచటానికి పే కమిషన్లను నియమిస్తూ, మరోపక్క కార్యకర్తల ద్వారా మళ్లీ అనధికారికంగా పనులు చేసి పెట్టే పద్ధతిని ప్రవేశపెట్టటం వల్ల పార్టీల మీద కనిపించని భారం, డబ్బు ప్రాబల్యం పెరగటంతోపాటు అవినీతి పెరిగి ప్రజాస్వామ్యాన్నే దెబ్బతీస్తుందని కాలిఫోర్నియా యూనివర్సిటీకి చెందిన జెన్నిఫర్ బ్రస్సెల్ విశ్లేషిస్తున్నప్పుడు

వినోద్ ఖండించలేదు. సాలోచనగా, సానుకూలంగా ఆలకించారు. పాలనా యంత్రాంగంలో అవినీతి లేదని తాను బుకాయించటంలేదని ఆయన చర్చలో ముందే స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు, పార్టీ కార్యకర్తలకు కార్యనిర్వహణ విభాగానికి చెందిన ప్రభుత్వ కార్యాలయాలతో సంబంధం లేకుండా చేసేందుకు, లంచాలు, ఎవరి సిఫార్సూ లేకుండానే ప్రజలకు గవర్నమెంటు ఆఫీసుల్లో పనులు జరిగేందుకు, పార్టీ కోసం స్వచ్ఛందంగా కార్యకర్తలను తయారుచేసే పద్ధతిని రూపొందించేందుకు.. మున్ముందైనా వినోద్ లాంటి నిజాయతీ, హేతుబద్ధత, పరిజ్ఞానం ఉన్న నాయకులు చొరవ తీసుకుంటారనే విశ్వాసాన్ని చర్చ కలిగించింది.

స్వతంత్రం వచ్చినప్పుడు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఈ రకంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసిపెట్టటం మొదలుపెట్టారు. మంచి ఉద్దేశంతోనే! అప్పట్లో బ్రిటిష్ వలసపాలన వల్ల అధికారులంటే ప్రజలు వణికిపోయే వాతావరణం ఉండేది. కానీ స్వాతంత్ర్యం వచ్చి డెబ్భై ఏళ్లు దాటినా, సొంత దేశంలో ప్రజలు ప్రభుత్వాధికారుల ముందు ద్వితీయ శ్రేణి పౌరుల్లా చేయిజాచే పరిస్థితి ఉండటం ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తోంది. కాంగ్రెస్ మొదలుపెట్టిన సంస్కృతిని తమిళనాడులో డీఎంకే, ఆ తర్వాత దేశంలోని అన్ని పార్టీలూ అనుసరిస్తూ, ప్రజల సాధికారతను దెబ్బ తీస్తున్నాయి. లంచాలు, వేధింపులు లేకుండా నిర్దిష్ట వ్యవధిలో హక్కుగా ప్రజలకు సర్కారీ ఆఫీసుల్లో పనులు చేసిపెట్టటం, ఆలస్యమైన పరిహారం చెల్లించటం వంటి ఏర్పాట్లతో పౌర సేవల చట్టం వంటి మార్పుల్ని తీసుకొస్తే, పార్టీల మీద భారం తగ్గుతుందని ఎఫ్‌డీఆర్ పత్రం సూచించింది.

పార్టీలో వలంటీర్లుగా పనిచేస్తామంటూనే డబ్బులు కూడా కావాలంటున్నారని, దేశ సమస్యల్ని యువతకు అర్థమయ్యేలా చెప్పి స్వచ్ఛందంగా పనిచేసే వలంటీర్లుగా తయారుచేయాల్సిన అవసరం ఓ సవాలులా ఇప్పుడు ఇండియా ముందు ఉందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాం మాధవ్ అన్నారు. పరిజ్ఞానమున్న స్వచ్ఛంద యువ వలంటీర్లను తయారుచేస్తూ, పౌర సేవల చట్టం వంటి ఏర్పాట్లు చేస్తే, ఎన్నికల సంస్కరణల్ని జోడిస్తే పార్టీల నిర్వహణ భారం తగ్గుతుంది, ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చక్కగా జరుగుతాయి, ప్రజాస్వామ్యం గణనీయంగా మెరుగవుతుంది.

దేశంలో 30 ఏళ్ల తర్వాత ఏర్పడిన బలమైన ప్రభుత్వం, నాయకత్వం కలిగిన పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్నా, రాం మాధవ్ రాజకీయాల్లో విపరీతమైన అధికార కేంద్రీకరణను ఆక్షేపించారు. అధికారాన్ని కిందికి, ప్రజల వద్దకు వికేంద్రీకరించాలన్నారు. భారత రాజకీయాలు ఉన్నకొద్దీ డబ్బు చుట్టూ తిరుగుతుండటానికి కళ్లెం పడాల్సి ఉందని, దీనికి ప్రధాన కారణం రాజకీయాల పట్ల ఆకర్షణని, దీన్ని తగ్గించాలని అన్నారు. మేయర్లు, ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రికి ప్రత్యక్ష ఎన్నికలు, దామాషా ఎన్నికలపై చర్చించాలని అన్నారు. చిన్న నియోజకవర్గాలని ఏర్పాటు చేయాలన్నారు. దీనివల్ల ఎమ్మెల్యేలు, ఎంపీల గుత్తాధిపత్యం కొంత తగ్గుతుందన్నారు. ఇప్పుడు పోలీసు కానిస్టేబుల్, స్కూల్ టీచర్, గ్యాస్ కనెక్షన్.. ఇలా ఏ పనైనా రాజకీయ నాయకుల గుప్పెట్లోనే ఉందన్నారు. అధికారం చుట్టూ ఉన్న ఈ ఆకర్షణ వల్లే ఎన్నికల్లో విపరీతంగా డబ్బు వెదజల్లి ఎలాగోలా గెలవాలని భావిస్తున్నారన్నారు. ప్రధాన రాజకీయపార్టీల్లో ఉన్న నిజాయతీపరులు కూడా పదవి కోసం డబ్బు వెదజల్లుతున్నారన్నారు.

రచయిత, జర్నలిస్టు, పాడ్‌కాస్టర్ అమిత్‌వర్మ అధికార కేంద్రీకరణ వైఫల్యాన్ని చక్కగా చెప్పారు– 'మన ప్రభుత్వం ఎంతో బలమైనది, పాలన అత్యంత బలహీనమైనది. మన పాలకులు అన్నీ చేస్తామన్నట్లు నటిస్తుంటారు, కానీ అవసరమైన పనుల్ని ఏవీ చేయలేరు. ప్రభుత్వాల్ని బలహీనపరిచి, పాలనను బలోపేతం చేయటమే డబ్బు రాజకీయానికి విరుగుడు. మనకు కావలసింది బలమైన నాయకుడు కాదు, బలమైన పాలన' అన్నారు. ప్రజలు ప్రభుత్వం ఇచ్చే ఉచితాల కోసం ఎదురుచూడకుండా సొంతంగా ఎదిగేలా స్థానిక స్థాయికి అధికారాలను వికేంద్రీకరించటం భారతదేశ సమస్యలకు పెద్ద పరిష్కారమని ఇండియాలో సుదీర్ఘకాలం అధ్యయనం చేసిన యూనివర్సిటీ ఆఫ్ వెర్మాంట్ రిటైర్డ్ ప్రొఫెసర్ కారొలిన్ ఇలియట్ సైతం తెలిపారు.

సోషల్ మీడియాలో రాజకీయ క్యాంపైన్ వందల శాతం మేర పెరుగుతోందని ఫేస్‌బుక్ దక్షిణాసియా, ఇండియా విభాగం ఎలక్షన్ ఇంటిగ్రిటీ లీడ్‌కు చెందిన నటాషా జోగ్ తెలిపారు. (డబ్బుతోపాటు) తప్పుడు వార్తల సమస్య ఇందులో ఉందన్నారు.

చట్టవిరుద్ధ ఎన్నికల వ్యయాన్ని తగ్గించటానికి యంత్రాంగం పరంగా రిటైర్డ్ ఐపీఎస్ సి. ఆంజనేయరెడ్డి ముఖ్యమైన సూచనలు చేయగా, అభ్యర్థులు ఒకే వేదికను పంచుకోవాలని సీఎంఎస్‌కు చెందిన భాస్కరరావు అభిప్రాయపడ్డారు. భారీ సభల్ని కట్టడి చేసి సంస్కరణల్ని తేవాలని కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ అన్నారు. పార్టీలపై కార్యకర్తల నిర్వహణ భారమని అంగీకరిస్తానని, పార్టీల విరాళాల సేకరణ పద్ధతి కూడా మారాలని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు రాజీవ్ గౌడ అన్నారు.

మొత్తంగా కొన్ని అంశాల్లో ఇంకా ఫ్యూడల్ సంస్కృతి, ఆలోచనల ప్రభావం పలువురు నేతల్లో, కొద్దిమంది విశ్లేషకుల్లో, అక్కడక్కడా సభికుల్లోనూ కనపడినా, రాజకీయాల్లో మనుగడకు, నిజాయతీగా ఏదైనా సాధించటానికి డబ్బు పెద్దభారంగా మారిందని సదస్సులో పాల్గొన్న అందరూ అంగీకరించారు. దీన్నుంచి బైటపడటానికి స్థానిక ప్రభుత్వాల స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకూ ప్రత్యక్ష తరహా ఎన్నికలు, దామాషా ఎన్నికల పద్ధతి,

అధికారాల వికేంద్రీకరణ గురించి అర్థవంతమయిన చర్చ ప్రారంభించాలని అభిప్రాయపడ్డారు. సమానత్వ భావనకు పట్టం కట్టేలా రాజ్యాంగ ప్రజాస్వామ్యం వైపు బలమైన మొగ్గు చూపారు. హాజరైన యువతయితే, సదస్సులో ఈ అంశాలన్నిటికీ దాదాపుగా గట్టి మద్దతిచ్చారు. సంస్కరణలను అంతిమంగా అమలు చేయాల్సింది రాజకీయ నాయకులు. వారందరినీ ఒకచోట చేర్చటం, భిన్నాభిప్రాయాలను కలిపే ప్రయత్నం చేయటం చాలా ప్రాక్టికల్‌గా ఉంది. కేంద్ర ఎన్నికల అధికారి అశోక్ లావాసా కూడా స్పష్టం చేసినట్లు, ఎన్నికల సంఘం డబ్బు రాజకీయాన్ని కట్టడి చేయలేదు. రాజకీయ సంకల్పం, ఎన్నికల సంస్కరణలే పరిష్కార మార్గం.

ఈ రచయిత విన్న చర్చల్లో ఇవి కొన్ని అంశాలు మాత్రమే. అలాగే.. ఒకేసారి రెండు, మూడు సెషన్లు సమాంతరంగా జరగటం వల్ల కొన్ని ప్లీనరీ చర్చలను మాత్రమే వినగలిగాను. అందుకే ఇంకొందరి పెద్దల అభిప్రాయాలను రేఖామాత్రంగా కూడా ఇక్కడ ప్రస్తావించలేకపోయాను. ఆ హాల్‌లో చర్చ సుపర్బ్, ఈ చర్చలో ఫలానావారు అద్భుతంగా సమస్యల మూలాల్ని వివరించారు వంటివి.. టీ, లంచ్ బ్రేక్‌లలో ఎక్కువ విన్న కామెంట్లు! వెబ్‌కాస్టింగ్‌లో మిగిలిన నిష్ణాతుల, అనుభవజ్ఞుల మాటల్ని కూడా విని నోట్ చేసుకుంటాం. మొత్తం అన్ని ప్లీనరీల్లో చర్చలను సవివరంగా క్రోడీకరించి, ఒక సమగ్ర పుస్తకంగా తెస్తామని ఎఫ్‌డీఆర్, ఐఎస్‌బీ, హెచ్‌సీయూ ప్రతినిధులు ఇప్పటికే ప్రకటించారు. చర్చల్లోని అంశాల మధ్యలో గ్యాప్‌లేమైనా ఉంటే, మరోసారి పాల్గొన్న వక్తలతో మాట్లాడి, లిఖితపూర్వకంగా తీసుకుని సమగ్రంగా పుస్తకాన్ని రూపొందించాలని, అందులోని అంశాలను సామాన్య ప్రజల్లోకి కూడా తీసుకెళ్లాలని కోరుతున్నాం. ఇందులోని పరిష్కారాలకు రాజ్యాంగాన్ని సవరించటం అవసరమా, రాజ్యాంగ రచనా సంఘం ఛైర్మన్ అంబేద్కర్ తదితర పెద్దల ఆలోచనలకు ఇది విరుద్ధమా తదితర సందేహాలకు కూడా ఇందులో సమాధానాలుండాలి. ఇప్పుడు కూడా యువత రోడ్ల మీదకు వస్తున్న సందర్భాలున్నాయి, కానీ స్పష్టత కరవవుతోంది. అందువల్ల ఏ అంశాల్ని కదిలిస్తే వ్యవస్థ మారుతుందో, అలాంటి అంశాలపై జరుగుతున్న ఐడీఏడబ్ల్యూ గురించి, అందులోని అంశాల గురించి వారికి వివరంగా అర్థమయ్యేలా తెలియచెప్పటం, పారదర్శకంగా ఆలోచనను పెంచటం ఇప్పుడు అవసరం. రాజ్యాంగ ప్రజాస్వామ్యం పట్ల ఇటీవల పెద్దఎత్తున స్పందించిన యూనివర్సిటీల నుంచి ఎక్కువగా ఈ ఆలోచనల్ని జనంలోకి తీసుకెళ్లాలి. జిల్లాకు కొంతమంది చొప్పున యువతీయువకులను థాట్ లీడర్స్‌గా వార్డు స్థాయి వరకూ తయారుచేయాలి. ఉప రాష్ట్రపతి తన అనుభవాన్ని రంగరించి చెప్పినట్లు, తాత్కాలికంగా చిన్న బాధ్యతల్ని, కష్టాల్ని భరిస్తే.. దీర్ఘకాలంలో పెద్ద లాభాల్ని పొందగలుగుతాం. ప్రజల్లో, ముఖ్యంగా యువతలో ఆలోచనను పెంచాల్సిన బాధ్యతను పౌర సమాజం తీసుకోవాలని రాం మాధవ్.. రాజకీయం అంటే ప్రభుత్వం మాత్రమే కాదని, పౌర సమాజం నుంచి ఆలోచనల్ని తీసుకుంటూ ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు పాలనను మెరుగుపరచుకుంటుండాలని శివసేన నేత ప్రియాంక చతుర్వేది, పలువురు వక్తలు సూచించారు. అంతిమంగా ఐడీఏడబ్ల్యూ అంశాలు, పరిష్కారాలు కోట్లాదిమంది సామాన్యుల, ముఖ్యంగా యువత జీవితం!

'భారతదేశం ఏనుగు లాంటిది. ఏనుగు దారి మార్చాలంటే కొంత సమయం పడుతుంది. అలాగే భారతదేశంలో మార్పు నెమ్మదిగా వస్తుంది' అని ఒక రాజకీయ నాయకుడు సదస్సులో కొంత సరదాగానే అన్నారు. బ్రిటన్, అమెరికా దేశాలలాగా శతాబ్దాల పర్యంతం ప్రజాస్వామ్య పరిణతి కోసం భారత్ వేచి ఉండటం ఈ ఆధునిక యుగంలో అసాధ్యం, అందువల్ల భారత్ వీలైనంత వేగంగా మార్పుల్ని సాధించాలి అన్న జేపీ మాటలపై స్పందిస్తూ ఆయన అలా అన్నారు. కానీ సారూ! 'ఏనుగు.. భారతదేశమా? మన రాజకీయ పార్టీలా?' రాం మాధవ్ కూడా అంగీకరించినట్లు.. పైస్థాయిలోని నేతలు అధికారాన్ని వదులుకునేలా చేయటం అంత సులువు కాదు. కానీ పార్టీలు, నేతలు ఏకతాటిపైకి వచ్చి విషవలయం నుంచి బైటపడాలనే సంకల్పాన్ని ప్రదర్శించటం మొదలుపెడితే, ప్రజలు అద్భుతంగా స్పందించి మార్పులో భాగస్వాములవుతారు. జేపీ చెప్పినట్లు, భారత్‌లో ఇప్పటి వరకూ సాధించిన గర్వించదగ్గ విజయాలు, అభివృద్ధి ఘనత ప్రభుత్వాలకన్నా ప్రజలు, సమాజానికే ఎక్కువ చెందుతుంది. అధికార వికేంద్రీకరణ, పౌర సేవల చట్టం వంటి ఏర్పాట్లు, స్థానిక, రాష్ట్ర, జాతీయ స్థాయి వరకూ ప్రత్యక్ష ఎన్నికలు జరిపి అధికారాల విభజన చేస్తే డబ్బు ప్రభావం తగ్గి మంచి పాలన అందుతుందని జేపీ సూచిస్తున్నారు. ప్రత్యక్ష ఎన్నికలతో జమిలి ఎన్నికలు కూడా సహజంగానే జరుగుతాయంటున్నారు. ఆచరణసాధ్యమైన ఈ అంశాల మీద జాతీయస్థాయిలో ఏకాభిప్రాయసాధనకు వేదికే ఐడీఏడబ్ల్యూ. ఫ్యూడల్ స్వభావంతో మొదలైన భారత ప్రజాస్వామ్యాన్ని వివక్ష లేకుండా అందరికీ సమానావకాశాలున్న రాజ్యాంగ ప్రజాస్వామ్యంగా మార్చేందుకు ఎఫ్‌డీఆర్ సుదీర్ఘకాలంగా చేస్తున్న కృషి ఫలితాలనిస్తుందనే ఆశను 2020 సదస్సు బలోపేతం చేసింది. సదస్సు చర్చల్లో చట్టబద్ధపాలన, ఆరోగ్యం, విద్య, స్థానిక ప్రభుత్వాల సాధికారత, సత్వర న్యాయం.. ఇలా మరికొన్ని కీలకాంశాలు ముందుకొచ్చాయి. రాబోయే కాలంలో వీటిపైనా సమగ్ర సదస్సులు కావాలి. ఈ పరిష్కారాలే భారత ప్రజాస్వామ్యానికి సరైన చికిత్స, టీకాలు. మనీ పవర్ ఇన్ పాలిటిక్స్ సదస్సు తీర్మానంగా ప్రకటించిన 'హైదరాబాద్ డిక్లరేషన్' తర్వాతి కార్యాచరణ కోసం ఎదురుచూస్తున్నాం. ❖

కాన్సెప్ట్ నోట్

# 'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్'

(ఆచరణలో భారత ప్రజాస్వామ్యం)..

# 'మనీ పవర్ ఇన్ పాలిటిక్స్'

(ఈ ఏడాది చర్చనీయాంశం)

## సందర్భం

భారతదేశం త్వరలో 75 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోనుంది. కులవ్యవస్థ, నియంతృత్వ పాలన, పుట్టుకను బట్టి పెత్తందారీ సౌఖ్యాలు, మత విభజనలు, వలస పాలన.. శతాబ్దాలపాటు వీటన్నిటి మధ్యా నలిగిపోయిన ప్రజానీకానికి ఇన్నేళ్ల స్వతంత్ర భారత జీవనం ఓ సుదీర్ఘమైన, కఠినతరమైన ప్రస్థానమనటంలో సందేహం లేదు.

దేశాన్ని ఒకటిగా కలిపి ఉంచటం, ప్రజాస్వామ్యాన్ని పనిచేయించటం, ప్రజల స్వేచ్ఛలని గౌరవించటం, వివక్షలేని సమానత్వాన్ని సాధించటం, సామాజిక, ఆర్థిక పరివర్తనను సాధించటం.. ఈ ఉదాత్త లక్ష్యాలతో మనం స్వతంత్ర భారత నిర్మాణాన్ని మొదలుపెట్టాం. విజయవంతమైన ప్రజాస్వామ్యాలుగా పేరొందిన దేశాల్లో ఈ మార్పులన్నీ కాలక్రమేణా వచ్చాయి. గత 70 ఏళ్ల పైచిలుకు కాలంలో ప్రజాస్వామ్యాన్ని ప్రజల కోసం పనిచేయించటానికి భారతదేశం ఎన్నో ప్రయాసలు పడింది, ఒడిదుడుకులను ఎదుర్కొంది.. అయినా తట్టుకుని నిలిచింది! దేశ ఐక్యతని, స్వేచ్ఛని కాపాడుకోగలిగాం. కానీ మనం సాధించగలిగిన దానితో పోలిస్తే సాధించింది చాలా తక్కువ. లక్ష్యసాధనకు మనం ఇంకా చాలాదూరమే ప్రయాణించాల్సి ఉంది.

భారత ప్రజాస్వామ్యం ఈవేళ క్రియాశీలం, ఒక వాస్తవం! నిర్ణీత కాలవ్యవధిలో సాపేక్షంగా స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరిగే ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వ నాయకుల్ని ఎన్నుకుంటున్నారు లేదా తొలగిస్తున్నారు. ప్రభుత్వ నియంత్రణలేని మార్గాల నుంచి సమాచారం ప్రజలకు అందుబాటులో ఉంది. ప్రభుత్వం తమను శిక్షిస్తుందేమోనన్న భయం లేకుండా అభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛ వారికి ఉంది. ప్రజలు సంఘటితంగా ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేసేందుకు, రాజకీయ కలాపాల్ని నిర్వహించటానికి వారికి స్వేచ్ఛ ఉంది. తమ భావజాలాన్ని ప్రచారం చేసుకునేందుకు, ప్రజల మద్దతును అడిగేందుకు రాజకీయ పార్టీలకు హక్కు ఉంది. ఎన్నికైన ప్రభుత్వాల చేతిలో నిర్ణయాధికారం ఉంది. ఈ రకంగా.. సంక్లిష్ట, వైవిధ్యభరిత సమాజం, అశేష ప్రజానీకం, తక్కువ ఆదాయాలతో కూడిన భారత్ ఒక దేశంగా, స్థిరమైన ప్రజాస్వామ్యంగా నిలదొక్కుకోవటం మన దేశ ప్రజల, నాయకుల విజ్ఞత, ముందుచూపు, అంకితభావాలకు నిదర్శనం. భారతదేశ నేలలో ఓ బోధి చెట్టులా ప్రజాస్వామ్యం వేళ్లూనుకుంది.

ప్రపంచంలో ఏ ప్రజాస్వామ్యమూ పరిపూర్ణం కాదు. అన్ని ప్రజాస్వామ్యాలూ క్రమంగా వికసిస్తూనే పటిష్టమవుతుంటాయి. కానీ, ప్రపంచంలోని ఇతర ప్రజాస్వామ్యాలన్నిటిలో కంటే భారత ప్రజాస్వామ్యంలో లోపాలెక్కువ. భావప్రకటనా స్వేచ్ఛ, నచ్చినవారికి ఓటు వేసుకునే హక్కు మాత్రమే మనం ఆశపడుతున్న మంచి జీవితానికి సరిపోవు. వ్యక్తి ప్రయోజనాలకు – సమష్టి ఆనంద జీవనానికి, సంక్షేమ డిమాండ్లకు – అభివృద్ధి అవసరాలకు, చెల్లించే పన్నులకు – అందే సేవలకు, అన్నిటినీ మించి ప్రభుత్వాల అధికారానికి – జవాబుదారీతనానికి మధ్య సంబంధాలు ఉండేందుకు ప్రజాస్వామ్యంలో పలు రకాల పరస్పరపూరక ఏర్పాట్లు అవసరం.


స్వతంత్రం వచ్చిన దగ్గర్నుంచి అక్షరాస్యతా శాతాల్ని పెంచటంలో, తరతరాల సామాజిక ఎక్కువతక్కువలను తగ్గించటంలో, పేదరికాన్ని నియంత్రించటంలో భారత్ గణనీయ పురోగతిని సాధించింది. కానీ, సాధించింది చాలదు. భారతదేశం ఇప్పటికీ నిరక్షరాస్యులకు, పేదప్రజలకు నిలయంగానే కొనసాగుతోంది. 200 బిలియన్ డాలర్ల జాతీయాదాయం (జీడీపీ) గల 49 దేశాలను పోల్చి చూస్తే, తల సరి ఆదాయం, జీవితకాలం, శిశుమరణాల శాతం, ఆరోగ్యంపై ఖర్చు, నాణ్యమైన పాఠశాల విద్య వంటి అన్ని ప్రధాన సూచికల్లో.. భారత్ అట్టడుగు అయిదు స్థానాల్లో ఉంది. మనం సాధించాల్సింది ఇంకా చాలా ఉందని, భారతదేశ ప్రజాస్వామ్యం ఇంకా ఒక కొలిక్కిరాని నిర్మాణమేనని స్పష్టంగా అర్థమవుతోంది.

ఇండియా వంటి సువిశాలమైన, అభివృద్ధి చెందుతున్న దేశంలో ప్రజాస్వామ్యాన్ని సక్రమంగా పనిచేయించటం అంత తేలిక కాదు. అయినా, పౌరులందరి కోసం పనిచేసే అర్థవంతమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించుకునే సత్తా, సామాజిక వనరులు, జాతీయ భావన, సాంస్కృతిక, చారిత్రక పరంపర, నాగరికతా బలం, నైపుణ్యాలు, సామర్థ్యం భారత్‌కు ఉన్నాయి. మనం ఇంకా తలరాతల్ని, ఎవరో వచ్చి ఏదో చేయపోతారా, అదృష్టం కలిసిరాకపోతుందా అనే ధోరణిలోనే కాలక్షేపం చేస్తుంటే మన ప్రగతి విషాద మందగమనంగానే మిగిలిపోతుంది, నివారించదగ్గ కష్టాలు, కన్నీళ్లు పెరిగిపోతూనే

ఉంటాయి. తాత్కాలిక ధోరణితో ఓటు వేసి ఆ తర్వాత తూచ్ దిగిపోండి అనే 'ఓట్, షౌట్' సంస్కృతి నుంచి బయటపడి.. మన జీవితాలకు నిజంగా పనికొచ్చే అంశాల గురించి మాట్లాడుకోవటం, పనిచేయటం ఇంత ఆలస్యంగానైనా అవసరం.

## ఇండియన్ డెమోక్రసీ ఎట్‌వర్క్
## (ఆచరణలో భారత ప్రజాస్వామ్యం)

మన దేశ ప్రజాస్వామ్యం ప్రజలకు ఆశించిన ఫలితాలనివ్వటానికి ఎక్కడెక్కడ ఏ రకమైన కీలక మార్పుల్ని చేయాలో వివిధ కోణాల్లో, ప్రామాణికంగా, ఏకాభిప్రాయ దిశగా మాట్లాడుకునేందుకు ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)కి చెందిన భారతీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) రాజనీతి శాస్త్ర విభాగంతో కలిసి వరుసగా సమావేశాల్ని నిర్వహించాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) నిర్ణయించింది. రాజకీయ నాయకులు, పౌర సమాజ బృందాలు, సామాజిక కార్యకర్తలు, మీడియా ప్రతినిధులు, సివిల్ సర్వెంట్లు, న్యాయకోవిదులు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు- అధ్యయనకారులు, ఇతర పలు రంగాలకు చెందిన వారికి ఇదో వేదికగా పనిచేస్తుంది. ఈ వేదికను 'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' (ఆచరణలో భారత ప్రజాస్వామ్యం)గా పిలుస్తున్నాం. ఏటా జరిగే ఈ సమావేశాల్లో ప్రతి సమావేశానికీ ఓ కీలక విషయం చర్చనీయాంశమవుతుంది. దేశంలోనివారితోపాటు విదేశాల నుంచి కూడా వచ్చి ఇందులో తమ భావాల్ని వినిపిస్తారు.




## 2020 సమావేశంలో చర్చనీయాంశం (థీమ్)
## 'రాజకీయాల్లో డబ్బు ప్రాబల్యం'
## (మనీ పవర్ ఇన్ పాలిటిక్స్)

2020 జనవరి 9, 10 తేదీలలో రెండు రోజులపాటు హైదరాబాద్ ఐఎస్‌బీ (ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్)లో జరిగే ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్ మొదటి సమావేశంలో చర్చనీయాంశం 'రాజకీయాల్లో డబ్బు ప్రాబల్యం'. రోజువారీ పార్టీ కలాపాల నుంచి అభ్యర్థి ఎంపిక వరకు రాజకీయాల్లో డబ్బు ఆక్సిజన్‌లా మారిపోయింది. ప్రభుత్వ రోజువారీ నిర్వహణ, సొంతలాభం కోసం విధానాల్ని అడ్డగోలుగా రూపొందించటం, పార్టీ యంత్రాంగాన్ని పోషించటం, పార్టీ ఫిరాయింపుల్ని ప్రోత్సహించటం.. అన్నిటి వెనకా డబ్బు, డబ్బు, డబ్బు! ప్రస్తుత రాజకీయాల్లో డబ్బు సర్వాంతర్యామిగా మారింది.

రాజకీయ పార్టీల్లో, చట్టసభల్లో వ్యాపారవేత్తలు, ధనవంతుల సంఖ్య ఇటీవల నానాటికీ పెరిగిపోతూ రాజకీయ జీవితమంటే డబ్బు చుట్టూనే అన్న పరిస్థితి నెలకొంది. వారిలో చాలామందికి ప్రజాసేవ నేపథ్యం లేదు, కనీసం ఆ దృక్పథమూ కనిపించదు. సమాజం కోసం ఏదైనా చేద్దామని చిత్తశుద్ధితో, మంచి భావాలతో వచ్చిన రాజకీయ పార్టీలు, వ్యక్తులకు, రాజకీయాల్లోకి వద్దామని ఆశపడుతున్న ఉత్సాహవంతులైన యువతకు ఆదిలోనే హంసపాదు ఎదురవుతోంది. డబ్బు రాజకీయాల్లో వారు కనీసం ఉనికిని కూడా చాటుకోలేని పరిస్థితులు పెరుగుతున్నాయే తప్ప తగ్గటం లేదు.

రాజకీయ పార్టీలు నడపటానికి, ఎన్నికల్లో పోటీ చేయటానికి, ఎన్నికల ప్రచారం నడపటానికి డబ్బు అవసరమనటంలో సందేహం లేదు. అయితే, కాలక్రమేణా రాజకీయ కార్యకలాపాలకు డబ్బు అవసరం అనేకరెట్లు పెరిగిపోయింది. అదేసమయంలో, విచిత్రంగా, పాలనా వైఫల్యం కూడా ఆ ఖర్చు పెరగటానికి కారణమవుతోంది. చట్టవిరుద్ధంగా రకరకాల పద్ధతుల్లో ఓట్లు కొనుగోలు చేయడం కోసం కూడా పెద్దఎత్తున డబ్బును ఖర్చుపెడుతున్నారు. ఆర్థిక వనరులు అందరికీ సమానంగా అందుబాటులో లేకపోవటం, నానాటికీ పెరిగిపోతున్న డబ్బు పాత్ర.. ప్రజాస్వామ్య ఆరోగ్యానికి హానికరంగా తయారయ్యాయి. ప్రజాస్వామ్య రాజకీయం పట్ల విశ్వసనీయత, ఆమోదయోగ్యతలను తగ్గిస్తూ దిగజారుస్తున్నాయి.

### ధనరాజకీయం వెనక కారణాలు

**1. పార్టీ నిర్వహణ**

ప్రపంచంలోని అన్ని ప్రజాస్వామ్యాల్లోకీ సంస్థాగత నిర్వహణ వ్యయభారాన్ని అత్యధికంగా మోస్తున్నది భారతదేశంలోని రాజకీయ పార్టీలే! పెద్ద రాష్ట్రాలలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో, ప్రతి పెద్ద రాజకీయ పార్టీకి.. రాజకీయ కార్యకర్తలు పెద్దసంఖ్యలో ఉంటారు. వీరిలో ఎక్కువమంది సామాన్యులు, అల్పాదాయ కుటుంబాలవారే. రాజకీయ కార్యకర్తలు నిరంతరం ఎన్నికల మధ్యకాలమంతా ప్రజలకు అందుబాటులో ఉంటారు. సామాన్య ప్రజలకి ప్రభుత్వ కార్యాలయాలలో కనీస సేవలు కూడా అందటం కష్టం. ప్రతి చిన్న పనికి ప్రజలు పార్టీ కార్యకర్తల మీద ఆధారపడవలసి వస్తోంది. ఈ కార్యకర్తలు గ్రామగ్రామాన, ప్రతి బస్తీలో, వార్డులో ప్రజలకు నిరంతరం అందుబాటులో లేకుంటే ఆ పార్టీకి రాజకీయ మనుగడ ఉండదు. వీరిలో అనేకమందికి జీవనోపాధిని అందించే వృత్తి, ఉద్యోగాలు

ఉండవు, డబ్బున్న స్థానిక నాయకుడి మీద ఆధారపడటం ద్వారానో లేదా చిన్న కాంట్రాక్టులు, ట్రాన్స్‌ఫర్లు, పోస్టింగులు వంటి పనులు చేసి పెట్టటం, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసిపెట్టినందుకు కొంత ఫీజు వసూలు చేయటం వంటి రకరకాల పద్ధతుల్లోనో వీరు డబ్బు సంపాదిస్తుంటారు. ఈ కార్యకర్తల వ్యవస్థ నిర్వహణ వ్యయభారమే భారతదేశంలో రాజకీయ, పాలనా సంక్షోభానికి మూలంగా ఉంది.

**2. అభ్యర్థి ఎంపిక**

రాజకీయాల్లో ప్రతిభావంతుల్ని గుర్తించేందుకు, అవకాశాలనిచ్చేందుకు, ప్రోత్సహించేందుకు భారతదేశంలోని చాలా పార్టీలకు ఓ పద్ధతంటూ లేకుండా పోయింది. ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులుగా ప్రకటించటమే నాయకత్వాన్ని ప్రోత్సహించే ఏకైక పెద్ద మార్గంగా ఉంది. అభ్యర్థి ఎంపికకు విశ్వసనీయ పద్ధతి లేకపోవటంతో సీట్ల కేటాయింపునకు డబ్బే కీలక అర్హతగా మారింది. ఫలితంగా, మన ప్రజాస్వామ్యం చాలామేర ధనికస్వామ్యం స్థాయికి దిగజారింది. రాజకీయ అధికారం పొందటానికి 'సొమ్ములే' ప్రాథమిక అర్హత కావటంతో, డబ్బు వెదజల్లి ప్రధాన పార్టీల అభ్యర్థిత్వం కోసం వెంపర్లాడుతున్నారు. రాజకీయ నాయకత్వానికి, అభ్యర్థిత్వానికి సిద్ధాంతాలు, ఆదర్శాలు, దార్శనికత లేవు, అక్కర్లేదు కూడా అనే దుస్థితి ఏర్పడింది.

**3. రాజకీయ ప్రచార వ్యయం**

ఏ ప్రజాస్వామ్యంలోనైనా చట్టసమ్మతమైన రాజకీయ కార్యకలాపాలకు డబ్బు ఖర్చవుతుంది. పార్టీని నడపాలి, పరిశోధన చేయాలి, అంశాలను అధ్యయనం చేయాలి, ఆలోచనాపరుల బృందం ఉండాలి, ప్రయాణాలు, సాహిత్యం, ప్రచారం, ప్రజా సభలు వగైరా పనులన్నీ చేయాలి.. ఇవన్నీ ఊరికే జరగవు గదా! నగదు రూపంలో ఇచ్చే అలవాటుకు తోడు.. ప్రత్యర్థి పార్టీల నుంచి ప్రతీకారం, బలవంతపు వసూళ్లు వంటి భయంతో చాలామంది లెక్కచూపని పద్ధతిలో నగదునే విరాళం ఇవ్వటానికి మొగ్గు చూపుతుంటారు. పార్టీలు కూడా పాతకాలపు పద్ధతుల్లో, భారీ ఖర్చుతో షో చేయటానికే ప్రాధాన్యమిస్తూ ఏదోకరకంగా జనాల్ని పెద్దఎత్తున తరలించటం మీదే దృష్టి పెడుతున్నాయి. కాలం చెల్లిన ఈ రకమైన ప్రచారంతో ఫలితం లేకపోయినా.. అంత భారీ ఖర్చును పెట్టకపోతే 'బలహీన పార్టీ' అనుకుంటారేమోనని జంకు, మీడియా సీరియస్‌గా తీసుకోదేమోనన్న భయం వల్లే పార్టీలు అంత పెద్దఎత్తున డబ్బు వెదజల్లుతున్నాయి. పార్టీల్లోని ఈ రాజకీయ అభద్రతను ఆసరాగా చేసుకుని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా కూడా అభ్యర్థుల నుంచి భారీ మొత్తాల్ని పిండుకోవటం ఆనవాయితీగా మారింది.

**4. ఓట్ల కొనుగోలు**

ప్రభుత్వాలు తమకు అందించాల్సిన సేవల్లో విఫలమవుతుండటంతో ఏ పార్టీ గెలిచినా ప్రజలు నిరంతరం అసంతృప్తితోనే ఉంటున్నారు. ప్రజల్లో పేదలు పెద్దసంఖ్యలో ఉండటంతో పార్టీలు ఓట్లు కొనుగోలు చేయటాన్ని ఒక అలవాటుగా మార్చేశాయి. పెద్దఎత్తున ఓట్లను కొనుగోలు చేయటం ఎన్నికల్లో విజయానికి గ్యారంటీ ఇవ్వటం లేదుగానీ.. ఓట్ల కొనుగోలుకు డబ్బు ఖర్చు చేయకపోతే మాత్రం ఓటమి ఖాయం! ఈ రకమైన ఎన్నికల వల్ల చివరికి ఫలితం.. ఎన్నికల్లో సమర్థులు, నిజాయతీపరులు పోటీ చేయటానికి వీల్లేకుండా డబ్బు రూపంలో ఓ భారీ అవరోధం ఏర్పడటం, మరోవైపు చట్టవిరుద్ధంగా ఎన్నికల్లో పెద్దఎత్తున డబ్బు ఖర్చు చేయటం సాంప్రదాయంగా మారటం.

ఓట్ల కొనుగోలుదారు (అభ్యర్థి), ఓట్ల అమ్మకందారు (ఓటరు) కుమ్మక్కవుతున్నప్పుడు, ఓట్ల కొనుగోలు సమస్యకు తేలికైన పరిష్కా రాలుండవు. చట్టాన్ని అమలుచేయటం అవసరమేకానీ, అది సరిపోదు. దాని వల్ల పెద్ద ఫలితాలు వచ్చే పరిస్థితి కూడా లేదు. నిరాశను వీడి ఎంత వేగంగా ఈ సంక్షోభాన్ని పరిష్కరించగలిగితే దేశ ప్రజాస్వామ్యానికి అంత మేలు జరుగుతుంది. అందుకే ఈ సమావేశం. ఇది మేధావులు, రాజకీయ నేతలు, విధానకర్తలు, విద్యావేత్తలు, పుస్తకాలకు మాత్రమే పరిమితమైన కార్యక్రమం కాదు. ఈ సదస్సూ, ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్‌లోని ఇతర అంశాలూ.. కోట్లాది సామాన్య ప్రజల జీవితం!

రాజకీయ ప్రచారానికి, పార్టీ నిర్వహణకి పారదర్శకంగా వనరులు సమకూరే పద్ధతులు అవసరం. పార్టీల మీద భారాన్ని తగ్గించటానికి, నిరంతరం వేలాది కార్యకర్తలని పోషించాల్సిన అవసరం లేకుండా చేయటానికి ప్రజలకి పౌరసేవలు విధిగా, గడువులోపల అందే ఏర్పాట్లు చెయ్యాలి. ఓట్ల కోసం డబ్బులివ్వకపోతే ఓటమి ఖాయమనే పరిస్థితుల్ని మార్చాలి. అందుకు దామాషా ఎన్నికలని, ప్రత్యక్షంగా ప్రభుత్వ నాయకులని ఎన్నుకునే వ్యవస్థని మన సమాజానికి అనుగుణమైనరీతిలో ప్రవేశపెట్టాలి. ప్రజలకు ఓటు విలువ తెలిసి ప్రజాస్వామ్యం సార్థకం కావాలంటే, ప్రజలకి కళ్ళ ముందు ప్రభుత్వం నడవాలి, ఓటు వల్ల జీవితంలో జరిగే పరిణామాలు స్పష్టంగా అర్థమయ్యే రీతిలో అధికారాన్ని, బాధ్యతలని వీలున్నంత మేరకు స్థానిక ప్రభుత్వాలకి అప్పగించాలి. ప్రపంచమంతా పరిణతి చెందిన ప్రజాస్వామ్యాలలో ఒకప్పుడు అపశృతులు దొర్లాయి. ఆ దేశాలలో సమాజం, పత్రికలు, నాయకత్వం ఆ సమస్యలని లోతుగా విశ్లేషించి, అనుభవాన్ని రంగరించి, ప్రజాస్వామ్యాన్ని సార్థకం చేసేందుకు కావలసిన పద్ధతులని, సంస్కరణలని తెచ్చాయి.

ప్రస్తుతం మేం సమష్టిగా తలపెట్టిన ఈ సదస్సులు పార్టీలని, రాజకీయాన్ని నిందించటం కోసం కాక, సమస్యని లోతుగా అర్థం చేసుకుని సమగ్ర చర్చల ద్వారా, ఏకాభిప్రాయసాధన ద్వారా పరిష్కారసాధనలో నిర్మాణాత్మకంగా భాగస్వాములు కావటం కోసం. ఇందులో పాలుపంచుకొమ్మని, దీర్ఘకాలం చేపట్టే ఈ ప్రయత్నంలో కలసిరమ్మని, కావలసిన మార్పుల కోసం సంఘటితంగా గొంతు విప్పమని విజ్ఞప్తి చేస్తున్నాం.

www. idaw.in, fb/IDWConf

❖



# ధన రాజకీయాలను ఇంకా ఉపేక్షిస్తే ఉపద్రవమే

**రాజకీయ వ్యవస్థ, ప్రజలూ కదలాలి ✦ 'త్రీ బీ'ల తరహాలో 'ఫ్రీ బీ'లు**

**బాధ్యతారహిత పథకాల కట్టడికి ఎఫ్ఆర్‌బీఎం తరహా చట్టం తేవాలి**

**ఐడీఏడబ్ల్యూ 2020 సదస్సు ప్రారంభోత్సవంలో ఉప రాష్ట్రపతి**

రాజకీయాల్లో విపరీతంగా పెరుగుతున్న డబ్బు ప్రభావానికి అడ్డుకట్ట వేయాల్సిన తరుణం ఆసన్నమైందని, కోటీశ్వరులే ఎన్నికల్లో పోటీ చేసి గెలిచే పరిస్థితుంటే నిజమైన ప్రజాసేవ చేసేవారు రాజకీయాల్లోకి వచ్చే అవకాశం ఉండదని ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. ఎన్నికల్లో చట్టబద్ధ వ్యయం అవసరమని, కానీ ఓట్ల కొనుగోలు వంటి చట్టవిరుద్ధమైన ఖర్చు విపరీతమవటంతో ప్రజాసేవ చేయగలిగినవారి కంటే కరోడ్‌పతిలే ఎమ్మెల్యేలు, ఎంపీలుగా చట్టసభల్లోకి ప్రవేశిస్తున్నారన్నారు. ప్రస్తుత లోక్‌సభలో 533 మంది సభ్యుల్లో 475 మంది (88%) కోట్లకు పడగలెత్తినవారన్నారు. ధనబలం ఆధిపత్యం కారణంగానే ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం సన్నగిల్లుతోందన్నారు. ఎన్నికల్లో గెలిచేందుకు అభ్యర్థులు, పార్టీలు అనుసరిస్తున్న పద్ధతుల మీద లోతైన సమీక్ష అవసరమన్నారు.

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ), ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)–భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీతో కలిసి ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) ప్రారంభించిన 'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' (ఆచరణలో భారత ప్రజాస్వామ్యం) తొలి వార్షిక కార్యక్రమంగా జనవరి 9, 10 తేదీలలో హైదరాబాద్ ఐఎస్‌బీలో జరిగిన 'మనీ పవర్ ఇన్ పాలిటిక్స్' (రాజకీయాల్లో డబ్బు ప్రాబల్యం) సదస్సును ఉప రాష్ట్రపతి ప్రారంభించారు. ఎఫ్‌డీఆర్ వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ సభాధ్యక్షత వహించారు.

ఐడీఏడబ్ల్యూ 2020 సావనీర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్‌కు గౌరవం ఉందని, అతిపెద్ద ప్రజాస్వామ్యాన్ని ఆదర్శప్రాయ ప్రజాస్వామ్యంగా కూడా మార్చుకోవాలన్నారు. మన ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠం చేసుకోవాలంటే ఎన్నికల్లో ధన, అంగబలంపై నియంత్రణ అవసరమన్నారు. ఎన్నికల సంఘం మాత్రమే ధన రాజకీయాల్ని కట్టడి చేయలేదన్నారు. ఎన్నికల్లో భారీగా నల్లడబ్బుని, ప్రలోభాల్ని వెదజల్లుతుంటే.. ఈసీ పట్టుకున్న నగదు, మద్యం, డ్రగ్స్, బంగారం కేవలం రూ.3,500 కోట్లు మాత్రమేనన్నారు. ధనరాజకీయాల్ని నిరోధించటం రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు, ఓటర్ల

కలిసికట్టుగా చేయాల్సిన పని అన్నారు. చట్టపరమైన మార్పులు, ఎన్నికల సంస్కరణలతోపాటు ప్రజల్లో చైతన్యం వస్తేనే మార్పు సాధ్యమన్నారు. ధనరాజకీయాన్ని అదుపు చేయటానికి సంస్కరణలను తెచ్చేందుకు రాజకీయ వ్యవస్థ బాధ్యత తీసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణకే కాదు రాజకీయ పార్టీలను నడిపేందుకు కూడా చేస్తున్న ఖర్చులు కట్టు తప్పుతున్నాయని వెంకయ్య నాయుడు అన్నారు. పార్టీలు విరాళాల సేకరణలో జవాబుదారీగా వ్యవహరిస్తూ, ఆడిట్ చేసిన జమాఖర్చులను క్రమం తప్పకుండా వెల్లడిస్తూ ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుకోవాలన్నారు. రాజ్యాంగ పదవిలో ఉన్నందున ఇంతకంటే ఈ విషయాల్ని ఎక్కువ చెప్పలేనన్నారు.

నిరంతర ఎన్నికల వాతావరణం వల్ల రాజకీయ పార్టీలు ఉచితాల హామీల్ని, డబ్బుని వెదజల్లుతున్నాయని ఉప రాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. దేశంలో ప్రతి మూడు నెలలకో, ఆరు నెలలకో ఎక్కడోక చోట ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల మహారాష్ట్రలో, ఆ తర్వాత జార్ఖండ్‌లో, మళ్లీ ఢిల్లీలో.. ఇలా వరుస ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ఈ విధానం సరికాదన్నది తన అభిప్రాయమన్నారు. "దేశంలో పంచాయతీ నుంచి పార్లమెంటు దాకా ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలి. వారం వ్యవధిలో అన్నీ పూర్తి కావాలి. ఒకేసారి నిర్వహిస్తే ప్రతి ఎన్నికకు ఉచితాల ప్రకటనలుండవు. అయిదేళ్లపాటు ప్రజల సంక్షేమం మీద దృష్టి పెట్టవచ్చు. ప్రజలకు నచ్చితే మరోదఫా అవకాశం ఇస్తారు. 1967 నుంచి ఎన్నికలను చూసిన తర్వాత ఈ అభిప్రాయానికి వచ్చాను. పూర్తి స్థాయి మెజారిటీ ఉన్నా, ఈ మధ్య ఫిరాయింపులు జరుగుతున్న మాట వాస్తవం. ఫిరాయింపుల వ్యతిరేక చట్టంలోని లోపాలకు చెక్ పెట్టాలి" అని ఉప రాష్ట్రపతి అన్నారు. ఒకేసారి (జమిలి) ఎన్నికలు నిర్వహించాలని 2015లో ప్రభుత్వం నియమించిన కమిటీ నివేదిక ఇచ్చిందన్నారు. దీన్ని అమలు చేయాలంటే రాజకీయ పార్టీలను ఒకే తాటి మీదకు తీసుకురావాల్సుందన్నారు. ఎన్నికల నిర్వహణకు ఖర్చును ప్రభుత్వమే భరించాలన్న ఆలోచన ఆచరణాత్మకం కాదన్నారు. ఎన్నికల ఖర్చు తగ్గించటానికి, పార్టీల డబ్బు ఖర్చుకు కళ్లెం వేయటానికి జమిలి ఎన్నికలను అన్ని పార్టీలూ సీరియస్‌గా పరిశీలించాలని సూచించారు.

ప్రజలు కూడా ధనరాజకీయాల్ని తమకు సంబంధించిన సమస్యగా గుర్తించాలని వెంకయ్య నాయుడు కోరారు. ఓటుకు నోటు తీసుకుంటే ప్రశ్నించే గొంతును కోల్పోతామని అర్థం చేసుకోవాలన్నారు. ఎన్నికలప్పుడు బస్సు, బీరు, బిర్యానీ అనే 'త్రీ బీ'లు సర్వసాధారణమైపోయాయని, ప్రజలు వీటికి దూరంగా ఉండాలన్నారు. ఎన్నికల్లో గెలిపించేందుకు అభ్యర్థులు, పార్టీల విధానాలపై సమీక్ష అవసరమన్నారు. నిబద్ధత, సత్ప్రవర్తన, పనిచేయగలిగే సామర్థ్యం ఉన్న అభ్యర్థులను చట్టసభలకు పంపడం వల్లే ప్రజల సమస్యల పరిష్కారానికి అవకాశం ఉంటుందన్నారు. డబ్బులు తీసుకుని ఓటేయడం కంటే నిబద్ధత, సత్ప్రవర్తన, సామర్థ్యమున్న అభ్యర్థులను చట్టసభలకు పంపడం వల్లే మేలు జరుగుతుందన్నారు. డబ్బులు తీసుకోనప్పుడు, బహుమానాలకు ఆశ పడనప్పుడు మాత్రమే ఓటర్లు ప్రభుత్వాల్ని ప్రశ్నించగలరన్నారు.





ఓట్ల కొనుగోలు అనేది మహమ్మారి అని, ఓటును అమ్ముకుంటే హక్కుల్ని కోల్పోతారని ప్రజలకు తెలియజేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు ఎన్నికల సంఘంతో కలిసి పౌర సమాజం, చదువుకున్న యువత, మీడియా ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలకు చొరవ చూపాలని ఉప రాష్ట్రపతి విజ్ఞప్తి చేశారు. ఏ సంస్కరణనైనా తొలినాళ్లలో వ్యతిరేకించేవారు ఎక్కువగా ఉంటారని, దీర్ఘకాలంలో దాని ప్రయోజనాలు అర్థమైతే వారే పెద్దఎత్తున మద్దతిస్తారన్నారు. పెయిడ్ న్యూస్ కోసం పార్టీలను పొగడవద్దని మీడియాకు సూచించారు.

రాజకీయంలో విపరీత డబ్బు ప్రభావంతోపాటు ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్న మరో అంశం.. ఓట్ల కోసం బహుమతుల రూపంలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే ఉచితాలు, తాయిలాల పథకాలని ఉప రాష్ట్రపతి అన్నారు. 'త్రీ బీ'లతోపాటు ఫ్రీ బీ'ల పైనా దృష్టి సారించాల్సి ఉందన్నారు. ఎన్నికలంటే చాలు.. రాజకీయ పార్టీలు అన్ని రకాల ఉచితాలను పోటాపోటీగా ప్రకటిస్తున్నాయని, ఈ విధానానికి మంగళం

పాడాలన్నారు. రాష్ట్రాల్లో ఎడాపెడా పార్టీలు ఇస్తున్న హామీలను కట్టడి చేసేందుకు ఎఫ్ఆర్‌బీఎం చట్టం తరహాలో చట్టం తీసుకురావాల్సి ఉందన్నారు. బడ్జెట్‌లో ఎంత మేర హామీల వ్యయం ఉండాలో స్పష్టమైన గీత గీయాలన్నారు. పాలన దివాలా తీయకుండా ఆర్థిక పరిస్థితికి తగ్గట్లుగా హామీలు ఉండేలా చేయాలన్నారు. పార్టీల, వ్యక్తిగత ఎన్నికల ప్రయోజనాల కోసం ప్రజాదరణ పొందిన పథకాల రూపంలో ప్రభుత్వాలు అందించే స్వల్పకాలిక ప్రయోజనాలు పేదలు, మధ్యతరగతి ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయన్నారు. 70 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఇంకా 20 శాతం మంది పేదరికంలో, 20 శాతం మంది నిరక్షరాస్యులుగా ఉండటంపై పార్టీలు, ఆర్థిక వేత్తలు, సామాజిక వేత్తలు, మీడియా, పౌర సమాజం ఆలోచన చేయాలన్నారు. స్వల్పకాలిక ప్రయోజనాలు-దీర్ఘకాలిక అభివృద్ధి-పేదరిక నిర్మూలన లక్ష్యాల మధ్య సహేతుక సమతుల్యతకు కృషి చేయాలన్నారు. తాత్కాలిక కష్టాలను స్వీకరిస్తే దీర్ఘకాలికంగా ఎన్నో లాభాలు ఉంటాయని ప్రజలకు హితవు పలుకుతూ.. తన చిన్నప్పటి టీకా అనుభవాన్ని ఉప రాష్ట్రపతి ఈ సందర్భంగా ఉదహరించారు. ఆరోజున




తనకిష్టం లేకపోయినా టీకా నొప్పిని భరించటం వల్ల తర్వాత ఎన్నో రెట్లు మేలు జరిగిందన్నారు. 'ప్రజలకు చేపలను పంపిణీ చేయటం కాదు. చేపలను ఎలా పట్టాలో నేర్పించండి. కష్టం విలువ అర్థమై బాధ్యతతో వ్యవహరించగలుగుతారు' అన్నారు.

స్వచ్ఛ రాజకీయాల కోసం, ప్రజల సాధికారత కోసం జయప్రకాష్ నారాయణ్ చేస్తున్న సుదీర్ఘ కృషి పట్ల తనకు ఎప్పటి నుంచో గౌరవమని ఉప రాష్ట్రపతి అన్నారు. లోక్‌నాయక్ జేపీ స్ఫూర్తితో తనలాంటివాళ్లం ప్రజాజీవితంలో చురుగ్గా పాల్గొన్నామని, ప్రస్తుత జేపీ కూడా సంస్కరణల కోసం స్థిరంగా పనిచేస్తున్నారన్నారు. లోక్‌సత్తాను పార్టీగా కూడా చేసి రాజకీయాల్లోకి రావద్దని తాను అప్పట్లో జేపీకి సలహా ఇచ్చానని, రాజకీయాల్లోకి రావటం వల్ల ప్రజలు పక్షపాతాలు అంటగట్టి, అనుమానంతో చూస్తారని హెచ్చరించానన్నారు. అయితే సమర్థులు, నిజాయతీపరులు రాజకీయాల్లోకి రాకూడదనే సలహాగా దీన్ని యువత భావించవద్దని, యువత రాజకీయాలను ఎంత సీరియస్‌గా పట్టించుకుంటే దేశంలో అంత మంచి మార్పు వస్తుందన్నారు.

అంతకుముందు జయప్రకాష్ నారాయణ్ స్వాగత ప్రసంగం చేస్తూ, భారత ప్రజాస్వామ్యంలో అధికార మార్పిడి ఎన్నికల ద్వారా శాంతియుతంగా జరుగుతోందని, ప్రజలు స్వేచ్ఛగా వ్యవహరించగలుగుతున్నారని, కానీ ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి ఇవి సరిపోవన్నారు. రాజకీయాల్లో డబ్బు ప్రాబల్యం వంటి వైఫల్యాల్ని సరిచేస్తేనే మన ప్రజాస్వామ్యం ద్వారా మెరుగైన ఫలితాలు సాధ్యపడతాయన్నారు. మన దేశంలో ఐదేళ్లకాలంలో జరిగే ఎన్నికల్లో రూ.1,00,000 కోట్లు ఖర్చు పెడుతున్నారని, ఇందులో చాలామేర లెక్కలు చూపని సొమ్మేనన్నారు. ఎన్నికల నుంచి రాజకీయ పార్టీ నిర్వహణ వరకూ అన్నీ ఖరీదైన వ్యవహారంగా మారిపోయాయన్నారు. ధనప్రవాహాన్ని తగ్గించకపోతే అవినీతి, అక్రమాలు మరింత పెచ్చరిల్లుతాయని, ప్రజాస్వామ్యం మరింత బలహీనపడుతుందని అన్నారు.

దేశంలో పెచ్చరిల్లిన ధనరాజకీయాల ప్రభావం యూనివర్సిటీ క్యాంపస్ ఎన్నికల్లో కూడా కనిపిస్తోందని, విద్యార్థి సంఘాల ఎన్నికల్లో కూడా డబ్బు, ప్రలోభాల పంపిణీ జరుగుతోందని హెచ్‌సీయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి. అప్పారావు అన్నారు. విశ్వవిద్యాలయాల ఎన్నికల స్థాయి నుంచే ఎన్నికల్ని సక్రమంగా నిర్వహించటం మొదలైతే ముస్ముందు దేశంలో కూడా ఎన్నికలు సక్రమంగా జరిగేలా చూసే నాయకత్వం తయారవుతుందన్నారు. వర్సిటీ క్యాంపస్‌లు సంస్కరణల ల్యాబొరేటరీలుగా మారాలన్నారు. ఇది దేశ ప్రజాస్వామ్య రాజకీయాన్ని బలోపేతం చేస్తుందన్నారు.

బిజినెస్ స్కూల్స్‌లో పబ్లిక్ పాలసీ విభాగం (భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ) ఉన్నది ఒక్క ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌కు మాత్రమేనని ఐఎస్‌బీ డీన్ రాజేంద్ర శ్రీవాస్తవ ఓట్ ఆఫ్ థ్యాంక్స్ చెబుతూ అన్నారు. ఇది సమాజం, దేశం పట్ల తమ బాధ్యతగా భావిస్తున్నామన్నారు.

రాజకీయాల్లో డబ్బు ప్రభావంపై ఎఫ్‌డీఆర్ యువపరిశోధనా బృందం రూపొందించిన యానిమేషన్ లఘుచిత్రం సభను బాగా ఆకట్టుకుంది. సదస్సుకు రిజిస్టర్ చేసుకున్న వారందరికీ మనీ పవర్ ఇన్ పాలిటిక్స్ సదస్సు, ఐడీఏడబ్ల్యూ కాన్సెప్ట్‌ల సమాచారంతో కూడిన ప్రత్యేక కిట్‌ను అందజేశారు.

❖

# 'మనీ పవర్ ఇన్ పాలిటిక్స్'
# రెండు రోజుల సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

గౌరవ ఉప రాష్ట్రపతి శ్రీ వెంకయ్య నాయుడు జనవరి 9న ప్రారంభించిన ఈ రెండు రోజుల సదస్సులో..

## రాజకీయ పార్టీల నుంచి:

రాం మాధవ్ (జాతీయ కార్యదర్శి, బీజేపీ), అసదుద్దీన్ ఒవైసీ (ఎంపీ, ఎంఐఎంఐఎం), కె. లక్ష్మణ్ (బీజేపీ తెలంగాణ అధ్యక్షులు), రాజీవ్ గౌడ (ఎంపీ, రాజ్యసభ, కాంగ్రెస్), బి. వినోద్ కుమార్ (ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం), ప్రియాంక చతుర్వేది (రాజకీయ నేత, శివసేన), జె.సి దివాకర్ రెడ్డి (మాజీ ఎంపీ, టీడీపీ), శ్రవణ్ దాసోజు (జాతీయ అధికార ప్రతినిధి, కాంగ్రెస్), కొండా విశ్వేశ్వరరెడ్డి (మాజీ ఎంపీ, కాంగ్రెస్), కుమార్ కేట్కర్ (ఎంపీ, రాజ్యసభ)

ఎన్నికల సంఘం, పాలనా అనుభవం:

అశోక్ లావాస (కేంద్ర ఎన్నికల కమిషనర్), రజత్ కుమార్ (ప్రధాన ఎలక్టొరల్ అధికారి, తెలంగాణ), టీఎస్ కృష్ణమూర్తి (కేంద్ర మాజీ ఎన్నికల ప్రధానాధికారి), కాకి మాధవరావు (ఏపీ మాజీ ఎన్నికల కమిషనర్), సి. ఆంజనేయ రెడ్డి (రిటైర్డ్ ఐపీఎస్)

## న్యాయకోవిదులు:

జస్టిస్ జాస్తి చలమేశ్వర్ (సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి)

## పాలసీ అధ్యయనం:

షెల్లీ మహాజన్ (అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్), యామిని అయ్యర్ (ప్రెసిడెంట్, చీఫ్ ఎగ్జిక్యూటివ్, సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్), నటాషా జోగ్ (ఎలక్షన్ ఇంటిగ్రిటీ లీడ్, ఇండియా, దక్షిణాసియా, ఫేస్‌బుక్), మిలన్ వైష్ణవ్ (డైరెక్టర్, దక్షిణాసియా కార్యక్రమం, కార్నెజీ ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్), జస్వంత్ బి. మెహతా (వ్యవస్థాపకులు, ఫోరం ఫర్ ప్రెసిడెన్షియల్ డెమోక్రసీ), రాహుల్ వర్మ (ఫెలో, సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్),నిరంజన్ సాహూ (సీనియర్ ఫెలో, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్), రాఘవేంద్ర ప్రసాద్ (వ్యవస్థాపకులు, ఎన్ఆర్ఐ థింక్‌ట్యాంక్), డీగో మయోరానో (విజిటింగ్ రీసెర్చ్ ఫెలో, ఎన్‌యుఎస్ దక్షిణాసియా అధ్యయన సంస్థ),

## దేశీయ విశ్వవిద్యాలయాలు:

నీలాంజన్ సిర్కార్ (అసిస్టెంట్ ప్రొఫెసర్, అశోక యూనివర్సిటీ), ప్రొఫెసర్ కె.సి సూరి (యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్), అశ్విని ఛత్రే (అసోసియేట్ ప్రొఫెసర్, ఐఎస్‌బీ), అజిత్ ఫడ్నిస్ (అసిస్టెంట్ ప్రొఫెసర్, ఐఐఎం, ఇండోర్), రాజేంద్ర శ్రీవాస్తవ (డీన్, ఐఎస్‌బీ), అప్పారావు పొదిలి (వైస్




ఛాన్సలర్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్), ధన్మంజరి సాథే (ప్రొఫెసర్, సావిత్రీబాయి ఫూలే యూనివర్సిటీ), సార్థక్ బాగ్చి (అసిస్టెంట్ ప్రొఫెసర్, అహ్మదాబాద్ యూనివర్సిటీ), షబానా మిత్ర (అసిస్టెంట్ ప్రొఫెసర్, ఐఐఎం బెంగళూరు), సవ్యసాచి దాస్ (అసిస్టెంట్ ప్రొఫెసర్, అశోక యూనివర్సిటీ), గిల్లిస్ వెర్నిస్ (అసిస్టెంట్ ప్రొఫెసర్, అశోక యూనివర్సిటీ), అభిరూప్ ముఖోపాధ్యాయ (ప్రొఫెసర్, ఎకనామిక్స్ అండ్ ప్లానింగ్, ఐఎస్ఐ)

## మీడియా:

ఆర్. జగన్నాథన్ (ఎడిటోరియల్ డైరెక్టర్, స్వరాజ్య), ఎన్. భాస్కరరావు (ఛైర్మన్, సెంటర్ ఫర్ మీడియా స్టడీస్), అమిత్ వర్మ (రచయిత, జర్నలిస్టు, పాడ్‌కాస్టర్)

## విదేశీ విశ్వవిద్యాలయాల నుంచి:

స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ, కన్సాస్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, యూనివర్సిటీ ఆఫ్ వెర్మాంట్, యూనివర్సిటీ ఆఫ్ అడిలైడ్, జాన్స్ హాప్‌కిన్స్ యూనివర్సిటీ, జార్జిటౌన్ యూనివర్సిటీ, బ్రౌన్, మాంచెస్టర్ వర్సిటీల నుంచి అధ్యయనకారులు

డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ (ఎఫ్‌డీఆర్ ప్రధాన కార్యదర్శి) తదితరులు పాల్గొన్నారు. ❖

# అధ్యక్ష తరహా, దామాషా ఎన్నికల పద్ధతిపై చర్చ జరగాలి..

## అధికారాన్ని వికేంద్రీకరించి రాజకీయాల పట్ల ఆకర్షణని తగ్గించాలి, చట్టవిరుద్ధ డబ్బు కట్టడికి మార్గాల్ని ప్రతిపాదించిన జాతీయ చర్చా వేదిక




భారత్‌లో అధికారాన్ని పైనుంచి ప్రజలుండే పునాదిస్థాయికి దించాలని, స్థానిక, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రభుత్వాధినేతల పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు జరగాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అధ్యక్షతన జరిగిన చర్చలో వక్తలు అభిప్రాయపడ్డారు. అధ్యక్ష తరహా విధానం, దామాషా ఎన్నికల పద్ధతిపై దేశవ్యాప్త చర్చ జరగాలన్నారు. వికేంద్రీకరణ, చట్టసభ–ప్రభుత్వం మధ్య అధికారాల విభజన వల్ల.. రాజకీయాల పట్ల మితిమీరిన ఆకర్షణ తగ్గి చట్టవిరుద్ధ డబ్బు ఖర్చు అదుపులోకి వస్తుందన్నారు.

'రాజకీయాల్లో డబ్బు ప్రాబల్యం'పై ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ)తో కలిసి హైదరాబాద్ ఐఎస్‌బీలో ఎఫ్‌డీఆర్ నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సులో భాగంగా రెండోరోజు ఉదయం (జనవరి 10) సెషన్‌లో జేపీ ఆధ్వర్యంలో ప్యానల్ చర్చ జరిగింది. 'భారత రాజకీయాల్లో చట్టవిరుద్ధ డబ్బు వ్యయం–నిరోధించే మార్గాలు'పై జరిగిన ఈ చర్చలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాం మాధవ్, కేంద్ర ఎన్నికల కమిషనర్ అశోక్ లావాసా, శివసేన ప్రతినిధి ప్రియాంక చతుర్వేది, 'స్వరాజ్య' పత్రిక ఎడిటోరియల్ డైరెక్టర్ ఆర్. జగన్నాథన్, భారత్‌లో రాజకీయ, పాలనా విధానాలపై పరిశోధనలు చేసిన యూనివర్సిటీ ఆఫ్ వెర్మాంట్ రిటైర్డ్ విద్యావేత్త కారొలిన్ ఇలియట్ పాల్గొన్నారు.

రాం మాధవ్ మాట్లాడుతూ, స్థానికంగా మేయర్‌ను, రాష్ట్రంలో ముఖ్యమంత్రిని, అధ్యక్ష తరహాలో ప్రధానమంత్రిని ప్రత్యక్షంగా ఎన్నుకోవాలనే ప్రతిపాదనకు సూత్రప్రాయంగా తాము సానుకూలమేనని, అయితే ఇతర దేశాల్లోని అధ్యక్ష తరహా ప్రభుత్వ వ్యవస్థలను అనుకరించకుండా మన దేశ పరిస్థితులకనుగుణంగా ఎలా ఉండోలా చర్చ జరగాలని అన్నారు. అధ్యక్ష తరహా, దామాషా ఎన్నికల వంటి మార్పుల కోసం ప్రయత్నిస్తూనే.. ఇప్పటికే ఉన్న వ్యవస్థను సరిదిద్దే పని చేయాలన్నారు. దేశంలో చిన్న ప్రభుత్వం, పెద్ద పాలన ఉండాలన్నారు. ఈ మాటను ప్రధానిగా తొలిసారి ప్రమాణస్వీకారం చేసినప్పుడే నరేంద్రమోదీ చెప్పారన్నారు. ప్రస్తుతం అధికారం ప్రజలుండే కిందిస్థాయిలో కాకుండా పైస్థాయిలోనే కేంద్రీకృతమైందన్నారు. చిన్న నియోజకవర్గాలను ఏర్పాటు చేయాలన్నారు. దీనివల్ల ఎమ్మెల్యేలు, ఎంపీల గుత్తాధిపత్యం కొంత తగ్గుతుందన్నారు. ఇప్పుడు పోలీసు కానిస్టేబుల్, స్కూల్ టీచర్, గ్యాస్ కనెక్షన్.. ఇలా ఏ పనైనా రాజకీయ నాయకుల గుప్పెట్లోనే ఉందన్నారు. అధికారం చుట్టూ ఉన్న ఈ ఆకర్షణ వల్లే ఎన్నికల్లో విపరీతంగా డబ్బు వెదజల్లి ఎలాగోలా గెలవాలని భావిస్తున్నారన్నారు. ప్రధాన రాజకీయపార్టీల్లో ఉన్న నిజాయతీపరులు కూడా పదవి కోసం డబ్బు వెదజల్లుతున్నారన్నారు. తాను ఈశాన్య రాష్ట్రాల్లో పనిచేశానని, అక్కడ ఎన్నికలు ఒక ఆర్థిక వ్యవస్థగా, జీవనోపాధిగా మారాయని అన్నారు. ఎన్నిసార్లు ప్రభుత్వాలు కూలిపోయి, ఎన్నిసార్లు ఎన్నికలు జరిగితే తమకు అంత డబ్బు వస్తుందని ఓటర్లు భావించే దుస్థితి నెలకొందన్నారు. దీనికి విరుగుడుగా.. అధికారాన్ని వికేంద్రీకరించి స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయాలని, రాజకీయాలను ఆకర్షణలేని రంగంగా మార్చాలని అన్నారు. అధికారాన్ని కిందికి వికేంద్రీకరించాలన్నారు. 90శాతం పనుల్ని ప్రజలే చేసుకోగలరని, ప్రభుత్వం అవసరం 10 శాతమేనన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో స్థానిక ప్రభుత్వాలకు అధికారాలనివ్వటం మొదలుపెట్టాక నాయకత్వం, స్థానికంగా పనులు జరగటం మొదలవటం తాను గమనించానన్నారు. గాంధీజీ గ్రామస్వరాజ్యం అంటే అధికార వికేంద్రీకరణ అనే అర్థం చేసుకోవాలన్నారు.

ఎన్నికల్లో వెదజల్లుతున్న డబ్బంతా అవసరమైన వ్యయమనుకోవాల్సిన పనిలేదని, జ్యోతిష్యాలు (సర్వేలు) వంటి వాటి పేరుతో డబ్బు వృధా చేస్తున్నారని రాం మాధవ్ అన్నారు. కానీ మొత్తంగా ఎన్నికల్లో డబ్బు వ్యయం విపరీతంగా పెరగటం ఈవేళ అంగీకరించాల్సిన వాస్తవమన్నారు. ఈ పరిస్థితి మారాలని, దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలు జరగాలన్నారు. సమాజంలో విశ్వాసాన్ని పాదుకొల్పాలని, ప్రజల్లో ఆలోచనను పెంచాలని, ఇందులో పౌర సమాజ సంస్థల పాత్ర ఎంతో ఉందని అన్నారు. జేపీ ఇందుకు కృషి చేస్తున్నారని, దేశవ్యాప్తంగా అనేకమంది జేపీలు కావాలని అన్నారు.

జయప్రకాష్ నారాయణ్ మాట్లాడుతూ, ప్రజలు కోరుకుంటున్నదల్లా అమ్మే మార్కెట్‌లా రాజకీయం తయారుకావటం వల్ల రాజకీయాల్లో డబ్బు వ్యయం విపరీతమవుతోందన్నారు. ధన రాజకీయాల సమస్యను సమష్టిగా చర్చించి సమగ్ర పరిష్కారాలను ముందుకు తీసుకెళ్లే జాతీయ వేదికగానే ఈ కార్యక్రమాన్ని

నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల జీవితాలతో సంబంధం లేని రాజకీయం, పాలన జరుగుతుంటే అధికారంలో ఎవరున్నా నిష్ప్రయోజనకరమన్నారు. మనం పరిణతి చెందిన ప్రజాస్వామ్యాలుగా భావిస్తున్న దేశాల్లో మార్పులకు అనేక శతాబ్దాలు పట్టిందని, మన దేశంలోకూడా అలా కాలక్రమంలో మార్పు వస్తుందనే ధోరణితో వ్యవహరిస్తే మాత్రం తీవ్రంగా నష్టపోతామన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రపంచీకరణ పోటీలో మనం ఉదాసీనంగా వ్యవహరిస్తే ఎప్పటికీ వెనకే ఉండాల్సి వస్తుందన్నారు. బ్రిటన్, అమెరికా దేశాలలాగా శతాబ్దాల పర్యంతం ప్రజాస్వామ్య పరిణతి కోసం వేచి ఉండటం ఈ ఆధునిక యుగంలో అసాధ్యం అన్నారు. ఒకప్పుడు బ్రిటన్‌లో 1% వృద్ధి రేటును సాధిస్తే విప్లవమన్నారని, ఇప్పుడు 1.5% వృద్ధి రేటును సాధిస్తానని అంటే మోదీలాంటి వారిని కూడా చెత్తబుట్టలో వేస్తారన్నారు. దేశంలో ఉన్న వనరుల్ని, ప్రజల్లో ఉన్న శక్తిని ఉపయోగించి మార్పులు తేగలిగేవాళ్లు చట్టసభల్లోకి రాకుండా ఎన్నికల్లో చట్టవిరుద్ధ డబ్బు పెద్ద అవరోధంగా మారిందన్నారు. ఉప రాష్ట్రపతిగా వెంకయ్య నాయుడు చాలాకాలం రాజ్యసభ సభ్యులుగా ఉన్నారని, అరుణ్ జైట్లీ, రాజీవ్‌గౌడ, మన్మోహన్ సింగ్ లాంటి ప్రతిభావంతులు, హేతుబద్ధ ఆలోచనాపరులు నేరుగా ఎన్నిక కాలేకపోతున్నారని అన్నారు. ఎన్నికల సంఘం, చట్టాలు, నైతిక ప్రవచనాల వల్ల ఈ పరిస్థితి మారదని, తగిన సంస్కరణలకు రాజకీయ వ్యవస్థ నడుం బిగిస్తేనే మారుతుందని అన్నారు. చెడు విధానాలను ఉపేక్షిస్తే క్రమంగా మంచి విధానాలను, వ్యవస్థలను కూడా ధ్వంసం చేస్తాయన్నారు. ఓట్ల కొనుగోలుకున్న ప్రోత్సాహకాలను తొలగించి.. ఓట్లు కొనకుండా విజయం సాధించే పద్ధతుల్ని ప్రవేశపెట్టాలన్నారు.

దేశవ్యాప్తంగా స్థానిక స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఒకేసారి (జమిలి) ఎన్నికలు నిర్వహించటం వల్ల పెద్ద మార్పు రాదని, ఇది కొండను తవ్వి ఎలకను పట్టటం లాంటిదేనని జేపీ అన్నారు. పార్లమెంటుతోపాటే ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, గతంలో తెలంగాణ ఎన్నికలు జరిగాయని, కానీ అక్కడ మెరుగైన రాజకీయ, పాలనా మార్పులు వచ్చాయనటానికి ఆధారాలు లేవని అన్నారు. అందువల్ల ముఖ్యమంత్రుల్ని, ప్రధానమంత్రిని ప్రత్యక్షంగా ఎన్నుకునే విధంగా ఎన్నికల వ్యవస్థను సవరించాలని, దామాషా ఎన్నికల వ్యవస్థను ప్రవేశపెట్టాలన్నారు. దామాషా ఎన్నికల పద్ధతికి రాజ్యాంగ సవరణ కూడా అక్కర్లేదని, కనీస ఓట్ల శాతాన్ని పెంచితే విభజన రాజకీయాల సమస్యను కూడా అధిగమించవచ్చన్నారు. రాజకీయ కారణాల వల్ల దామాషా ఎన్నికల పద్ధతిని జాతీయ స్థాయిలో అధికారంలో ఉన్న పార్టీ అంగీకరించకపోవచ్చుని, ప్రత్యక్ష ఎన్నికలనైతే వెంటనే ప్రవేశపెట్టవచ్చుని అన్నారు. మోదీ, కేసీఆర్, వైఎస్ జగన్మోహన్ రెడ్డిని చూసి ప్రజలు ఓట్లు వేశారని గుర్తుచేశారు. ప్రత్యక్ష ఎన్నిక వల్ల ముఖ్యమంత్రి ఎమ్మెల్యేల మీద ఆధారపడాల్సిన పని ఉండదని, సమాజంలోని నిపుణుల్ని మంత్రివర్గంలో తీసుకునే అవకాశం కూడా ఉంటుందని అన్నారు. మరోపక్క ఎమ్మెల్యేల ఆధిపత్యం కూడా తగ్గి స్థానిక ప్రభుత్వాలు ఊపిరి పీల్చుకుంటాయన్నారు. ప్రత్యక్ష ఎన్నికతో సహజంగానే జమిలి ఎన్నికలు జరుగుతాయన్నారు. స్థానిక స్థాయికి అధికార వికేంద్రీకరణ, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక తదితర మార్పుల్ని చేపట్టే అవకాశం, శక్తి మోదీ ప్రభుత్వానికి ఉన్నాయని, రాం మాధవ్ ఇందుకు చొరవ తీసుకోవాలని కోరారు.

అశోక్ లావాసా మాట్లాడుతూ, జేపీ అడవిని, చెట్టును, పక్షిని, పక్షి కన్నును కూడా చూశారని, కానీ తాను కేవలం కంటికి మాత్రమే పరిమితమవుతానని అన్నారు. రాజకీయాలకు డబ్బు అవసరమేనని, అయితే అది చట్టవిరుద్ధం కాకూడదని అన్నారు. అలాగే చట్టవిరుద్ధ ఎన్నికల వ్యయం అంటే నిర్వచనంపై స్పష్టత కూడా అవసరమన్నారు. ఇటీవల ఎన్నికలు జరిగిన ఒక రాష్ట్రంలో ఎన్నికలకు కొన్ని నెలల ముందు కాంట్రాక్టులు పొందినవారు ఎన్నికల విరాళాలు ఎక్కువగా ఇచ్చినట్లు తేలిందన్నారు. అలాగే సెలబ్రిటీల ప్రచారం, పార్టీలకు సొంత మీడియా దగ్గర్నుంచి అనేక కోణాల్లో ఎన్నికల్లో వ్యయంపై చర్చ జరగాలన్నారు. కానీ మొత్తంగా చూస్తే కోటీశ్వరులు తప్ప ఎన్నికల్లో గెలవలేని పరిస్థితి ఉందన్నారు. గెలిచిన ఎంపీల్లో కరోడ్‌పతిలు గతసారి 37 శాతం ఉంటే, ఇప్పుడు 87 శాతం ఉన్నారన్నారు. ముఖ్యమంత్రులు ఎప్పుడూ ఎన్నికల సంస్కరణల గురించిన మాట్లాడినట్లు తాను చూడలేదని, ఎన్నికల్లో నమోదైన కేసుల గురించి హోంమంత్రులు పట్టించుకోవటం లేదని అన్నారు. వీటిపై దృష్టి సారించాలని, కానీ ఒక పరిధి దాటి ఎన్నికల్లో డబ్బు వ్యయాన్ని కట్టడి చేసే శక్తి ఈసీకి లేదన్నారు. ప్రభుత్వాలు, రాజకీయ వ్యవస్థే ఇందుకు చొరవ చూపాలని, ప్రజలు సామాజిక విలువల్ని పాటిస్తే మార్పు త్వరగా వస్తుందని అన్నారు.

ప్రియాంక చతుర్వేది స్పందిస్తూ, రాజకీయాల్లో కోటీశ్వరుల ప్రాబల్యం వల్ల తనలాంటి యువతకు అవకాశాలు తగ్గిపోతున్నాయని అన్నారు. రాజకీయ విరాళాల సేకరణకు ప్రవేశపెట్టిన బాండ్‌ల విధానం సమస్యను ఇంకా పెంచుతోందని, కార్పొరేట్లు, అజ్ఞాత శక్తులు విరాళాలను, అది కూడా అధికార పార్టీకి ఇస్తున్నాయని అన్నారు. రాజకీయాలంటే ఎన్నికలు, అధికారం మాత్రమే కాదని, పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థలతో సత్సంబంధాలతో ప్రభుత్వాలు కలిసి పనిచేస్తేనే ప్రజాస్వామ్యం విజయవంతమవుతుందని అన్నారు.

ఆర్. జగన్నాథన్ చర్చలో పాల్గొంటూ, సమస్య ఒకచోట ఉంటే మరోచోట పరిష్కారాల్ని వెతుకుతూ దశాబ్దాల పాటు సమయాన్ని వృధా చేయటం మన దేశ రాజకీయాల్లో పరిపాటిగా మారిందన్నారు. వ్యవసాయంలో అసలు సమస్యని వదిలేసి రైతుల ఆత్మహత్యల చుట్టూ తిప్పినట్లు.. ఎన్నికల్లో వ్యవస్థలో వైఫల్యం ఒకచోట ఉంటే జమిలి ఎన్నికలు వంటి చిన్న అంశాల గురించి మాట్లాడుతున్నారన్నారు. మాటలు వేయటంతో పని జరగదని, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, అధికారాల్ని వికేంద్రీకరించి స్థానిక ప్రభుత్వాలను పటిష్ఠం చేయటం వంటి మార్పుల్ని వేగంగా తీసుకురావాలని అన్నారు. మీడియా కూడా ఢిల్లీని వదిలి రాష్ట్రాలు, స్థానిక ప్రభుత్వాల బాట పట్టాలన్నారు.

ప్రజలు ప్రభుత్వం ఇచ్చే ఉచితాల కోసం ఎదురుచూడకుండా సొంతంగా ఎదగటంలో స్థానిక సాధికారత పాత్ర ఎంతో కీలకమని తన అధ్యయనాల సారాంశంగా కారొలిన్ ఇలియట్ తెలిపారు.

సమావేశం అనంతరం సభికులు అడిగిన పలు ప్రశ్నలకు ప్యానల్ నిపుణులు జవాబిచ్చారు. ప్రజల్ని తరలించటమే సమావేశం అనే రోజుల్లో డబ్బు లిచ్చి మరీ రిజిస్టర్ అయి వచ్చినందుకు యువతను జేపీ అభినందించారు. ❖

# సదస్సులో ఇంకా ఎవరేమన్నారు..




➲ దేశంలో ఆరోగ్యానికి కేటాయించే బడ్జెట్ కన్నా ఎన్నికల వ్యయమే ఎక్కువ. వాస్తవ వ్యయంలో 10 శాతాన్ని మాత్రమే లెక్కల్లో చూపుతున్నారు. మిగిలినదంతా చట్టవిరుద్ధం లేదా నల్లడబ్బు. అధికారంలో ఉన్న పార్టీ తప్ప మిగతావన్నీ దివాలా స్థితిలోనే ఉన్నాయి. రాజకీయాల్లో ధన ప్రభావం తగ్గించటానికి ప్రభుత్వ యంత్రాంగంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. నిజాయతీపరులు రాజకీయాల్లోకి వచ్చేలా వ్యవస్థను మార్చాలి.

**- కొండా విశ్వేశ్వర రెడ్డి,
మాజీ ఎంపీ, కాంగ్రెస్**

➲ ప్రస్తుతం ఎన్నికల్లో డబ్బు, మద్యం ఎక్కువగా ప్రభావం చూపిస్తున్నాయి. అనేక రకాలుగా చర్యలు తీసుకుంటున్నప్పటికీ వందల కోట్లు చేతులు మారుతున్నాయి. చివరి 48 గంటల్లోనే మద్యం, డబ్బు పంపిణీకి కీలకంగా మారుతోంది. అభ్యర్థుల ఖర్చుకున్న పరిమితి పార్టీల ఖర్చుకు లేకపోవటం కూడా సమస్యను తీవ్రతరం చేస్తోంది. ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థి సగటున రూ.10 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. ఎన్నికలంటేనే మద్యం పండగలా మారింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచే మద్యనిషేధం అమలు చేసే అంశంపై చర్చ జరగాలి. ఎన్నికల్లో ప్రచార వ్యయాన్ని తగ్గించేందుకు, పరిమితి మించి ఖర్చు జరగకుండా చూస్తున్నాం. క్యాంపైన్ సమయం కుదింపు గురించి కూడా ఆలోచన చేశాం. కానీ తక్కువ సమయం ఉంటే, డబ్బున్న అభ్యర్థులు, పార్టీలు భారీ బహిరంగ సభలు వంటి పెద్ద కార్యక్రమాలను వరుసగా చేస్తున్నారు. దీనివల్ల సాధారణ అభ్యర్థులు, చిన్న పార్టీలు పోటీలోనే నిలువలేకపోతున్నారు. పార్టీలు ఎన్నికల సమయంలో పెద్దమొత్తంలో చేస్తున్న ఖర్చు, మీడియా ప్రచారం వంటి అంశాలపై సహేతుక చర్చ జరగాల్సి ఉంది.

**- రజత్ కుమార్, తెలంగాణ చీఫ్ ఎలక్టొరల్ అధికారి**

➲ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచార గడువు రెండు మూడు రోజులకు తగ్గించాలి. అప్పుడే డబ్బు ప్రభావం తగ్గుతుంది. ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులు చేతులు ఎత్తండి, దించండి అంటే ఎమ్మెల్యేలు, ఎంపీలు తలలూపే సంస్కృతి పోవాలి. నా ఒంటి నిండా నల్లమచ్చలే. నేను చెబితే ఎవరు వింటారు? జయప్రకాష్ నారాయణ్, ఆంజనేయరెడ్డి వంటి వారు చెబితే ప్రజలు వారి మాట వింటారు.

**- జేసీ దివాకర్ రెడ్డి,
మాజీ ఎంపీ, తెలుగుదేశం**

➲ ఎన్నికల్లో అభ్యర్థులు చేసే వ్యయం రోజురోజుకీ పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశం. ఎన్నికల్లో ఒక్కో ఎంపీ అభ్యర్థి సుమారు రూ.50 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు మూడేళ్ల క్రితం ఢిల్లీలో జరిగిన ఓ సదస్సులో భారత ఎన్నికల మాజీ కమిషనర్ బ్రహ్మ పేర్కొనడమే ఇందుకు నిదర్శనం. దేశచరిత్రలోనే ఎన్నడూలేని విధంగా ఎంపీల్లో ఈసారి బిలియనీర్లు ఉన్నారు. కొందరు ఎంపీల ఆస్తులు అయిదేళ్ల కాలంలో 500 రెట్లు పెరుగుతుండటం దురదృష్టకర పరిణామం. రాజకీయ పార్టీలు కేడర్ కోసం కూడా భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. రాజకీయాల్లో డబ్బు ప్రభావం తగ్గించటం ప్రభుత్వం, ప్రజలు, పార్టీలు, మేధావులు కలిసికట్టుగా చర్చించి ముందుకు సాగినప్పుడే సాధ్యమవుతుంది. ప్రజాస్వామ్యాన్ని బాగు చేసుకునేందుకు ఇలాంటి సదస్సులు ఎంతో అవసరం. మార్పు ఒక్క రోజులో అయ్యేది కాదు.

**జస్టిస్ జాస్తి చలమేశ్వర్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి**




➲ స్థానిక ప్రభుత్వాలకు పార్టీయేతర ఎన్నికలు పెడితే గ్రామీణ స్థాయిలో డబ్బు ప్రభావం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. డబ్బు రాజకీయాలపై జయప్రకాష్ నారాయణ్ గళం విప్పారు. రజత్ కుమార్ మాట్లాడుతున్నారు. ఇది చాలదు. సమాజంలో అందరూ స్పందించాలి.

**- కాకి మాధవరావు,**
**ఏపీ మాజీ ఎన్నికల కమిషనర్**

➲ రాజకీయాలు సమాజంలో ఒక భాగం. ఇప్పుడు ధనబలం వల్ల డబ్బున్నవాళ్లే చట్టసభలకు ఎన్నికవుతున్నారు, వాళ్ల ప్రయోజనాలను మాత్రమే నెరవేర్చుకుంటున్నారు.

**- ప్రొఫెసర్ ప్రదీప్ ఛిబ్బర్,**
**యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా**

➲ చట్టాన్ని గౌరవిస్తూ, నైతికతతో కూడిన రాజకీయాలు రావాలి. మన ప్రజాస్వామ్యం ధనరాజకీయాల దశను ఎంత త్వరగా అధిగమిస్తే అంత త్వరగా ఈ మార్పు సాధ్యమవుతుంది.

**- ప్రొఫెసర్ కె.సి సూరి,**
**యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్**

➲ ఎన్నికల్లో ఏ పార్టీ అయినా ఇంతింత ఖర్చులు భరించటం కష్టమే. కానీ ఇప్పటికిప్పుడు రాజకీయాల్లో ధనప్రభావం తగ్గించాలంటే కుదరని పని. డబ్బు ప్రభావాన్ని క్రమంగా తగ్గించేందుకు అన్ని పార్టీలు, ప్రభుత్వం కలిసి కృషి చేయాలి. ప్రభుత్వ వ్యవస్థల లోపాల కారణంగానే ప్రజలు తమ పనుల కోసం కేడర్‌ను ఆశ్రయిస్తారు. ఫ్రాన్స్ వంటి దేశాల్లో మాదిరిగా సగం స్థానాల్లో ప్రజలు ఎన్నుకొని, మిగతా స్థానాల కోసం రాజకీయ పార్టీలకి ఓట్లు వేసే దామాషా పద్ధతిపైన అధ్యయనం జరగాలి.

**- బి.వినోద్ కుమార్, టీఆర్ఎస్,**
**తెలంగాణ ప్రణాళికా సంఘం ఛైర్మన్**

జాతీయ పార్టీలు ఎన్నికల్లో చేస్తున్న అధిక వ్యయం వల్ల ప్రాంతీయ, చిన్న పార్టీలపై భారం పడుతోంది. ప్రాంతీయ పార్టీలను నడపటం చాలా కష్టమైన పని. ఎన్నికల్లో పోటీ కూడా ఇప్పుడు అంత ఆషామాషీ వ్యవహారం కాదు. రాజకీయ పార్టీలను నడపటానికి కేవలం ఓటర్లను ఆకట్టుకుంటే సరిపోదు, డబ్బున్న వ్యాపారవేత్తలను, కార్పొరేట్ సంస్థలను మచ్చిక చేసుకోవాలి. ఇలాంటి సంపన్నుల దన్నుతో ఉన్న పార్టీలను ఎదుర్కోవటం సాధారణ ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పార్టీలకు కష్టం. ఇది అసమతుల్యమైన పోటీ. మనం బ్రిటిష్ కాలం నాటి అన్యాయాన్ని కొనసాగిస్తున్నాం. జాతీయ పార్టీకి 7 గురు ఎంపీలున్నా సరే, ఢిల్లీలో కార్యాలయ నిర్మాణానికి సబ్సిడీ లభిస్తుంది. స్టార్ క్యాంపయినర్లు 40 మంది వరకూ అయ్యే ఖర్చును పార్టీ ఎన్నికల వ్యయంలో కలపరు. ఇలాంటివన్నీ పెద్ద పార్టీలకు అనుకూలంగా ఉండి, చిన్న పార్టీల విజయావకాశాల్ని దెబ్బతీస్తుంటాయి. 2019 పార్లమెంటు ఎన్నికల్లో వ్యయం రూ.60,000 కోట్లు దాటిందట. ఈ పరిస్థితి ప్రజాస్వామ్యానికి మంచిది కాదు.

**- అసదుద్దీన్ ఒవైసీ, ఎఐఎంఐఎం అధ్యక్షుడు**

రాజకీయాల్లోకి ప్రాంతీయ పార్టీలు వచ్చిన తరవాతే ఎన్నికల ఖర్చులు భారీగా పెరిగాయి. 1980 ప్రాంతంలో ఈ పార్టీలు వచ్చాయి. ఇవన్నీ కుటుంబ పార్టీలే. వీటికి ప్రపంచీకరణ తోడైంది. అంతకుముందు వరకు ఎన్నికల ఖర్చులు అంతగా లేవు. ప్రాంతీయ పార్టీలు వచ్చాక కులం, వర్గం, విభజన రాజకీయాలు కూడా పెరిగిపోయాయి. ఓట్ల కొనుగోలును పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్న ప్రస్తుత ఎఫ్.పి.టి.పి ఎన్నికల విధానం స్థానంలో దామాషా ఎన్నికల విధానం రావాలన్న ప్రతిపాదనను స్వాగతిస్తున్నాం.

**- డాక్టర్ కె.లక్ష్మణ్,**
**బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు**

ఎన్నికల వ్యవస్థ కలుషితమైంది. నల్లడబ్బుతో రాజకీయాలు చేసేవారు అధికమయ్యారు. డబ్బు లేకుండా ఎన్నికల ప్రచారం నడవదు. డీమానిటైజేషన్ (నోట్ల రద్దు) వల్ల రూ.వెయ్యికి బదులు రెండు వేల నోటు ఇవ్వాల్సి వస్తోంది. శేషన్ వంటి ఎన్నికల అధికారి రావాలి. ఒకేఒక్కడు ఎన్నికల్లో కొత్త ట్రెండ్ చూపాడు. ఎన్నికల అధికారులు నిష్పాక్షికంగా ఉంటూ వారి ఉన్న అధికారాల్ని సక్రమంగా ఉపయోగించగలగాలి. ఒకప్పుడు డబ్బుంటేనే క్రికెట్.. ఇప్పుడు ఓటు కూడా. ఇది పోవాలంటే పెద్దఎత్తున సంస్కరణలు రావాలి. లేనిపక్షంలో ప్రజాస్వామ్యం అపహాస్యమవుతుంది.

**- శ్రవణ్ దాసోజు,**
**కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి**

ఎన్నికల్లో ధన ప్రాబల్యానికి చెక్ పెట్టేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీలు సోషల్ ఆడిట్ పరిధిలోకి రావాలి. కార్పొరేట్ ఫండింగ్‌తోనే క్విడ్‌ప్రోకో పెచ్చుమీరుతోంది.

**- ఎన్.భాస్కరరావు, చైర్మన్,**
**సెంటర్ ఫర్ మీడియా స్టడీస్**



➲ ఎన్నికల్లో డిజిటల్ ప్రచారానికి ప్రాధాన్యత విపరీతంగా పెరుగుతున్నందున, తప్పుడు ప్రచారాన్ని నియంత్రించే చర్యల్లో భాగంగా 220 కోట్ల నకిలీ ఎఫ్‌బీ అకౌంట్లను తొలగించాం. తప్పుడు సమాచారంపై నిఘా వేసే సిబ్బందిని 2016 నుంచి మూడు రెట్లు పెంచాం. రాజకీయ ప్రకటనలకు సంబంధించి పారదర్శకత తెచ్చేందుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నాం. రాజకీయ పార్టీలు చేసే ప్రకటనలను ప్రజలు ఎప్పుడైనా పరిశీలించేందుకు వీలుగా ఒక గ్రంథాలయాన్ని కూడా ప్రారంభించాం.

**- నటాషా జోగ్, ఎలక్షన్ ఇంటిగ్రిటీ లీడ్, ఇండియా, దక్షిణాసియా ఫేస్‌బుక్**

➲ ధన ప్రభావంతో రాజకీయాలు కలుషితం కావటంతోపాటు విధ్వంసకరంగా మారాయి. గతంలో ఎన్నికల తేదీని దేశ ప్రధాని ఒకరు ప్రకటించారు. అప్పటి ఎన్నికల కమిషనర్ శేషన్ మరునాడు ఎన్నికల తేదీలను వెల్లడించాల్సింది ఎన్నికల సంఘం అని ప్రకటించారు. కానీ ఎన్నికల సంఘంతోనే సంస్కరణలు సాధ్యం కావు. ఎన్నికల ఖర్చు చట్ట పరిమితి దాటకుండా చేయటం ఎన్నికల సంఘానికి సాధ్యం కావటం లేదు. అభ్యర్థులు నిర్దేశిత పరిమితికన్నా 20 రెట్లు దాకా ఎక్కువ ఖర్చు చేస్తున్నారు. సంస్కరణలకు రాజకీయ పార్టీలు కలిసిరావాలి, ప్రజలు చైతన్యవంతులు కావాలి. అవినీతికి అవకాశాలు పుష్కలంగా ఉండటంతో ఎక్కువమంది ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. డబ్బు ప్రభావ బాధితుల్లో జయప్రకాష్ నారాయణ్ ఒకరు. ఎన్నికల్లో నిధులు అందరికీ అందుబాటులో ఉండేందుకు 100 శాతం పన్ను రాయితీతో 'జాతీయ ఎన్నికల నిధి'ని ఏర్పాటు చేయాలి. రాజకీయ పార్టీలు యధాతథస్థితిని కోరుకుంటుండటం వల్ల సంస్కరణలు రావటం లేదు. కానీ రాజకీయాల్లో డబ్బు వ్యయానికి కళ్లెం వేయకపోతే దేశంలో ప్రజాస్వామ్యం విజయవంతమవదు.

**- టి.ఎస్ కృష్ణమూర్తి, భారత ఎన్నికల సంఘం మాజీ ప్రధానాధికారి**

రాజకీయాల్లో పారదర్శకత తప్పుడు పదంలా మారింది. **- ప్రియాంక చతుర్వేది, శివసేన**

➲ ఎన్నికల్లో డబ్బు ప్రధాన పాత్ర పోషిస్తుందనటంలో సందేహం లేదు. పార్టీల విషయంలో డబ్బొక్కటే ప్రధానం కాదు. కానీ అభ్యర్థుల కోణంలో మాత్రం డబ్బు ప్రధానాంశమవుతోంది. పైగా ఒక ఎన్నికకు, ఇంకో ఎన్నికకు పెట్టే ఖర్చు పెరుగుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో రూ.30-50 కోట్లు, అసెంబ్లీ ఎన్నికల్లో రూ.10-15 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు నాయకులే చెబుతున్నారు. ఎన్నికలు ప్రస్తుతం చాలా ఖరీదుగా మారాయి. సిద్ధాంతాల మీద ఆధారపడి ఎదిగినవారికి, కిందిస్థాయి నుంచి పార్టీలలో పనిచేసిన వారికి టికెట్లు దక్కటం లేదు. డబ్బున్నవాళ్లు ముఖ్యులకు తక్కువకాలంలో దగ్గరవుతున్నారు. పార్టీలు ఎన్నికల్లో డబ్బు, నేరచరిత్ర కలిగిన వారి మీద ఆధారపడటం పెరగటం దీనికి మరో కారణం. ఇవన్నీ రాజకీయాల్లో విలువలు దిగజారేలా చేస్తున్నాయి. ఇది కొనసాగితే ప్రజాస్వామ్య వ్యవస్థలను సరిదిద్దుకోవడం కష్టసాధ్యమే. ఇండియాలో 1950-70 మధ్యకాలంలో ధన, నేర రాజకీయాలు లేవు. 80వ దశకంలో మొదలై 1990 తర్వాత తీవ్రరూపం దాల్చాయి. ప్రపంచంలోని అనేక దేశాల్లోనూ ఇలాంటి పరిస్థితి ఎందుకు వచ్చిందనే దానిపై చాలా వాదనలు ఉన్నాయి. పాత ప్రజాస్వామ్య విధానాలు, విలువలను కొనసాగిస్తే తమకు ఎప్పటికీ అవకాశాలు రావనే భావన ఉన్నవారు ఇలాంటి పద్ధతులను అనుసరించడం ప్రారంభించారు. దాన్ని పార్టీలు ఆహ్వానించడంతో ఈ సంస్కృతి క్రమంగా వేళ్లూనుకుని, చివరకు ప్రమాదకరంగా తయారైంది. ప్రస్తుతం ఎన్నికలకు డబ్బు సమకూరుతున్న విధానాన్ని మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇది ప్రజాస్వామ్యం మరింత పటిష్ఠం కావడానికి అడ్డంకిగా ఉంది. ఎన్నికల్లో ప్రచారానికి అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించడం లేదా ప్రజల నుంచి విరాళాల రూపంలో సేకరించడం జరిగితే ప్రజాస్వామ్యానికి కచ్చితంగా మేలు జరుగుతుంది.

**- ప్రొఫెసర్ అశుతోష్ వర్షిణి, అంతర్జాతీయ అధ్యయన కేంద్రం, బ్రౌన్ విశ్వవిద్యాలయం**

➲ ప్రజాస్వామ్యంలో ఓట్ల కొనుగోలు చేసి అధికారంలోకి వచ్చే విధానాన్ని నివారించాలి. పార్టీలకిచ్చే విరాళాలను పారదర్శకంగా కొనసాగించాలి. అన్ని రకాల విరాళాలనూ డిజిటలీకరణ చేయాలి. 2004లో పార్లమెంటు ఎన్నికల్లో గెలిచినవారిలో కోటీశ్వరులు 30 శాతం మంది ఉంటే గత పార్లమెంటు ఎన్నికల్లో గెలిచినవారిలో 80 శాతం మంది ఉన్నారు. గెలిచిన ఎంపీ ఒక్కొక్కరు సగటున రూ.20.9 కోట్లు ఖర్చు చేశారంటే, సమాజంపై సంపద ప్రభావం తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఎన్నికల సంస్కరణలపై రాజకీయ పార్టీల నుంచి ఏకాభిప్రాయం రావాలి.

**- అశోక్ లావాసా, కేంద్ర ఎన్నికల కమిషనర్**

# ప్రత్యక్ష ఎన్నికే పరిష్కారం!

మన దేశంలో ప్రజాస్వామ్యం మరింతగా పరిఢవిల్లాలంటే రాజకీయాల్లో ధన ప్రాబల్యానికి చరమగీతం పాడాలని ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫామ్స్ (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ పెద్దను ప్రత్యక్ష విధానంలో ఎన్నుకోవాలని.. లేదా ఓట్ల శాతం (దామాషా) ఆధారంగా ప్రభుత్వాలు ఏర్పడాలని అభిప్రాయపడ్డారు. ఈ రెండింటిలో ఏదో ఒక విధానాన్ని భారత్ అందిపుచ్చుకుంటేనే ఫలితం ఉంటుందన్నారు. రాజకీయ పార్టీల నిర్వహణ వ్యయానికి, ఓట్ల కొనుగోలుకు ముకుతాడు పడాలని చెప్పారు. కాగితాలకు పరిమితమయ్యే చట్టాలు కాకుండా.. కార్యాచరణ సంస్కరణలు రావాలని జేపీ అభిలషించారు. 2020ని రాజకీయాల్లో ధనప్రాబల్య సంవత్సరంగా ప్రకటించిన ఎఫ్‌డీఆర్.. 'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' పేరుతో హైదరాబాద్ ఐఎస్‌బీ ప్రాంగణంలో జనవరి 9, 10 తేదీలలో సదస్సు ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా జేపీ 'ఈనాడు'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు..

లేదంటే ఓట్ల శాతం
ఆధారంగా ప్రభుత్వాలు ఏర్పడాలి

రాజకీయాల్లో ధనప్రాబల్యం తగ్గాలి

కాగితాల చట్టాలు కాదు..

కార్యాచరణ సంస్కరణలు కావాలి

ప్రస్తుతం దేశంలో బలమైన ప్రభుత్వం ఉంది

ప్రధాని తలచుకుంటే సంస్కరణలు సాధ్యమే

'ఈనాడు' ముఖాముఖిలో
డాక్టర్ జయప్రకాష్ నారాయణ్



**మీరు ప్రతిపాదిస్తున్న ప్రత్యక్ష ఎన్నికలు లేదా దామాషా పద్ధతి మన దేశ రాజకీయాల్లో సాధ్యమేనా?**

రాజకీయ పార్టీలను ఏకతాటిపైకి తీసుకొస్తే ఆచరణ సాధ్యమే. ఇందుకోసం 2005లోనే నేను విస్తృత స్థాయిలో ప్రయత్నాలు చేశా. కార్యరూపంలోకి తెచ్చేందుకు సింహభాగం నేతలను ఒప్పించాను. చివరిలో ఒకట్రెండు పార్టీలు సహకరించకపోవడంతో అమల్లోకి తీసుకురాలేకపోయాం. అయితే, చాలాకాలం తర్వాత ప్రస్తుతం దేశంలో బలమైన ప్రభుత్వం ఉంది. అంతే బలమైన నాయకుడు మోదీ ప్రధానిగా ఉన్నారు. ఆయన తలచుకుంటే ఇది పెద్ద కష్టమేమీ కాదు. అన్ని ప్రాంతీయ పార్టీలతో సంప్రదింపులు నిర్వహించి వారిని ఒప్పించగలరు. మోదీ, అమిత్ షా లాంటి బలమైన నేతలున్న ప్రస్తుత సమయంలో సంస్కరణలు తీసుకురావడం కష్టమేమీ కాదు.

**ప్రత్యక్ష ఎన్నికల ఆలోచన ఎందుకు వచ్చింది?**

ఎన్నికల్లో భారీగా పెరుగుతున్న ధన ప్రాబల్యాన్ని చూసిన తర్వాత ఈ ఆలోచన వచ్చింది. అసలు రాజకీయ పార్టీల నిర్వహణ ఖర్చులు విస్మయానికి గురిచేస్తున్నాయి. ఉదాహరణకు.. ప్రధాన పార్టీలకు ప్రతి నియోజకవర్గంలో కనీసం 200 నుంచి 400 మంది కార్యకర్తలు, నాయకులు ఉన్నారు. వీరు పార్టీపరంగా సగటున ఏడాది రూ.మూడు కోట్ల నుంచి రూ.నాలుగు కోట్ల వ్యయం చేస్తున్నారు. ఒక్కో నియోజకవర్గానికి అయిదేళ్లలో కాస్తంత అటూఇటుగా ఈ వ్యయం రూ.20 కోట్లు అవుతుంది. ఒక్క నియోజకవర్గానికే అంతుంటే.. ఇక రాష్ట్రం మొత్తం మీద ఎంత అవుతుందో లెక్కించండి. ఈ మొత్తాన్ని ఆ నాయకులు పైరవీలు, ఇసుక, పంచాయతీల ద్వారా తిరిగి సంపాదిస్తున్నారు. సదరు నేతల అవసరం లేకుండా ప్రజలు పనులు చేసుకునేలా స్థానిక ప్రభుత్వాలని బలోపేతం చేయడంతోపాటు పూర్తిస్థాయి స్వయం ప్రతిపత్తి కల్పించాలి. కార్యనిర్వాహక వ్యవస్థలో జవాబుదారీతనాన్ని తీసుకురావాలి. తద్వారా ఫలితం ఉంటుంది.

**ఇబ్బడిముబ్బడిగా పెరిగిన ఎన్నికల వ్యయంపై ఏమంటారు?**

అంచనాలకు అందని ఖర్చు అది. చట్టబద్ధతలేని అంశం. గడిచిన ఏడాదిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో వ్యయం రూ.వేల కోట్లలో ఉంది. ఎన్నికల సంఘమే వందల కోట్లను పట్టుకుంది. ఎన్నికల్లో అయ్యే వ్యయంలో పట్టుకునేది పది శాతం కూడా ఉండదు. బ్రిటన్‌లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో కన్జర్వేటివ్ పార్టీ భారీ ఆధిక్యంతో గెలుపొందింది. ఎన్నికల్లో ఈ పార్టీకైన వ్యయం అటూఇటుగా కేవలం రూ.100 కోట్లు మాత్రమే. 1989కి ముందు వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రూ.25,000 ఖర్చుతో అసెంబ్లీకి వచ్చినవారు చాలామంది ఉన్నారు. ఆ తర్వాత నుంచి ఈ సమస్య మహమ్మారిగా మారింది. మన దేశం తరహాలో ప్రపంచంలో ఎక్కడా ఓట్లు కొనడం ఉండదు. అమెరికాలో ఎన్నికల వ్యయం ఎక్కువే. అయితే, అక్కడి ఖర్చులో సింహభాగం టీవీల్లో ప్రచారానికే అవుతోంది.

**ఎన్నికల ఖర్చుపై చట్టపరమైన పరిమితులున్నాయి కదా.. ఎందుకు అమలు కావడం లేదు?**

ఆ వ్యయానికి చట్టబద్ధత ఏదీ? చట్టం ఉన్నా ఓట్లు అమ్మేవాడిని, కొనేవాడిని శిక్షించగలమా? దీన్ని అమలు చేయడం చట్టం ద్వారా సాధ్యం కాదు. ప్రజల్లో చైతన్యం రావాలి. రాజకీయ పార్టీల్లో మార్పు రావాలి. ఎన్నికల్లో గెలిచేందుకు రూ.8 కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చిందని మహారాష్ట్ర నేత గోపీనాథ్ ముండే గతంలో ప్రకటించారు. ఎన్నికల సంఘం ఆయనకు నోటీసు ఇచ్చింది కానీ, అలా ఎందుకు జరుగుతోంది? ఎలా నియంత్రించాలని ఆలోచించలేదు. గతంలో లోక్‌సత్తా ద్వారా ఎన్నికల సంస్కరణలకు కృషి చేశాం. అన్ని రాజకీయ పార్టీలు ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచారం చేసేందుకు వీలుగా సవరణ చేయించాం. అయితే, ఇప్పటి వరకు దాన్ని అమలు చేసిన నాథుడే లేదు. ❖




"సంస్కర్తకి అపారమైన సహనం ఉండాలి"
-గాంధీజీ

# ఎన్నికల ఖర్చును పెట్టుబడిగా చూస్తున్నారు

స్థానిక ప్రభుత్వాలు మొదలుకొని లోక్‌సభ ఎన్నికల వరకు విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యానికి పెనుసవాలుగా మారిందని పలువురు మేధావులు పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేశారు. గత రెండు దశాబ్దాలలో ఎన్నికల్లో పెట్టే ఖర్చు, ఓట్ల కొనుగోలు చాలా ఎక్కువగా పెరిగాయని, విధానాల రూపకల్పనలో ప్రజాప్రతినిధుల పాత్ర నామమాత్రంగా ఉంటోందని అభిప్రాయపడ్డారు. ఎన్నికల్లో చేసే ఖర్చును పెట్టుబడిగా చూస్తున్నారన్నారు. రాజకీయాల్లో, ఎన్నికల్లో గెలవడానికి భారీగా వ్యయం చేస్తున్న నేపథ్యంలో.. భారత ప్రజాస్వామ్యం ఎలా పనిచేస్తోందన్న అంశాన్ని చర్చించడానికి హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. దేశ, విదేశాల్లోని వివిధ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాల్లో రెండు, మూడు దశాబ్దాలుగా అధ్యయనం చేస్తున్న పలువురు ఇందులో పాల్గొన్నారు. ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్), హెచ్‌సీయూ, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) ఆధ్వర్యంలో జనవరి 9 నుంచి ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు, పరిశోధకులు, ఎన్నికల అధికారులు, న్యాయకోవిదులు, పరిశీలకులు, జర్నలిస్టులు తదితరులతో రెండు రోజులపాటు 'రాజకీయాల్లో ధనస్వామ్యం'పై ఐఎస్‌బీలో సదస్సు నిర్వహిస్తుండగా, దీనికి ముందుగా హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ఈ చర్చాగోష్ఠి నిర్వహించారు.

అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా ప్రొఫెసర్ ప్రదీప్ కె. ఛిబ్బర్ మాట్లాడుతూ అందరికీ ఓటు హక్కు ఉన్నా, ప్రతి ఒక్కరూ అవగాహనతో ఓటు వేసే పరిస్థితి లేదన్నారు. 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా మూడంచెల ఫెడరల్ వ్యవస్థ వచ్చినా స్థానిక ప్రభుత్వాలు బలోపేతం కాలేకపోయాయన్నారు. విధానాల రూపకల్పనలో చట్టసభ సభ్యుల పాత్ర నామమాత్రమని, ఇది యధాతథ స్థితిని కొనసాగిస్తోందని అన్నారు. ఢిల్లీలోని సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్‌కి చెందిన నీలాంజన్ సిర్కార్ మాట్లాడుతూ 1998–2019 మధ్య ఎన్నికల్లో ఖర్చు చాలా పెరిగిందన్నారు. 1998లో రూ.10,000 కోట్లు ఖర్చు చేసినట్లు అంచనా కాగా.. 2019లో అది రూ.60,000 కోట్లకు పెరిగిందన్నారు. విధానాల రూపకల్పనలో రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలు, కేంద్రంలో ఎంపీల పాత్ర నామమాత్రంగా ఉంటోందని, కొందరు మాత్రమే విధానాలను తయారుచేస్తుంటే, మిగిలినవారంతా పరిశీలన కూడా లేకుండా ఆమోదముద్ర వేసేస్తున్నారన్నారు. రాజకీయ అవినీతి పెరిగిందన్నారు.

చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలి

ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెట్టడం ప్రజాస్వామ్య పునాదులకే ప్రమాదమని సదస్సు కో ఆర్డినేటర్, కేంద్రీయ



విశ్వవిద్యాలయ ఆచార్యుడు కొండవీటి చిన్నయసూరి అభిప్రాయపడ్డారు. భారత రాజకీయాల్లో ధనప్రవాహం అంతకంతకూ పెరుగుతూనే ఉందని, వ్యాపారవేత్తలు, గుత్తేదారులు, విద్యాసంస్థల అధిపతులు ఎక్కువసంఖ్యలో పార్టీల టికెట్లు పొంది భారీగా ఖర్చు చేస్తున్నారని, దీనికి కారణం ప్రజాప్రతినిధులుగా గెలిస్తే మంత్రులు, బ్యూరోక్రసీ, పోలీసు అధికారులతో తమ పనులు సులభంగా జరుగుతాయని భావించడమేనన్నారు. పౌర చైతన్యంతోపాటు చట్టాలను పటిష్ఠంగా అమలు చేస్తే కొంతవరకు ఎన్నికల్లో ధనప్రవాహాన్ని నియంత్రించవచ్చని, ఎన్నికల వ్యవస్థలో కూడా మార్పులు రావాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఎన్నికలకు ముందు పనులు చేపట్టడం, గనులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఎన్నికలకు ముందు తవ్వకాలు తగ్గించడం ఇలా అనేక అంశాలు ఓట్లతో ముడిపడి ఉన్నాయని పలువురు పరిశోధకులు పేర్కొన్నారు. హెచ్‌సీయూ ప్రొఫెసర్ రాజశేఖర్, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ ఆచార్య అరుణ్ పట్నాయక్, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ మంజరి కట్జూ, ప్రొఫెసర్లు కైలాష్, కాంఖాన్ స్వాన్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ❖

## సమూల మార్పులు అవసరం: జేపీ

ఎఫ్‌డీఆర్ వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ్ మాట్లాడుతూ.. 73, 73 రాజ్యాంగ సవరణల్ని మంచి కోసం చేసినా ఆచరణలో ప్రయోజనం కలగలేదన్నారు. అధికారంలో ఉన్నవారు స్వల్పకాలిక ప్రయోజనాల కోసం ప్రయత్నించడం వల్ల ఆర్థికవ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతోందని, ద్రవ్యలోటు పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక, రాష్ట్ర, జాతీయ ఇలా అన్ని ఎన్నికలలో పెట్టే ఖర్చు చాలా ఎక్కువగా ఉంటోందని, బ్రిటన్ మొత్తంలో గెలిచిన పార్టీ ప్రచారం కోసం పెట్టిన ఖర్చు కంటే మన దగ్గర ఒక చోట పెట్టే ఖర్చు ఎక్కువగా ఉందన్నారు. ఎన్నికల్లో ధనస్వామ్యాన్ని అడ్డుకోవటానికి సమూల మార్పులు రావాల్సి ఉందన్నారు.

# ఓట్ల కొనుగోలును చట్టంతో అరికట్టలేం

## శిక్షిస్తే మార్పు రాదు.. వ్యవస్థనే మార్చాలి! ● 'ఆంధ్రజ్యోతి'తో జయప్రకాష్ నారాయణ్

"ఓటును కొనడం, అమ్మడం నేరం. అలా చేయని పరిస్థితులు ఏ నియోజకవర్గంలోనైనా ఉన్నాయా? ఒక్కో లోక్‌సభ నియోజకవర్గంలో నాలుగైదు లక్షల ఓట్ల కోసం డబ్బులు పంచుతున్నారు. వాళ్లందరినీ జైల్లో పెడతారా? ఓట్ల కొనుగోలును చట్టంతో అరికట్టలేం. వ్యవస్థనే మార్చాలి" అని లోక్‌సత్తా, ఫౌండేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఐఎస్‌బీ, హెచ్‌సీయూతో కలిసి ఎఫ్‌డీఆర్ జనవరి 9, 10 తేదీలలో హైదరాబాద్ ఐఎస్‌బీలో ఇండియన్ డెమొక్రసీ ఎట్ వర్క్ సదస్సు నిర్వహిస్తోంది. ఈ సదస్సు నేపథ్యంలో జేపీ 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా ముచ్చటించారు.



### ఆంధ్రజ్యోతి: సదస్సు ముఖ్య ఉద్దేశమేంటి?

**జేపీ:** దేశంలో ఎన్నికలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. మనం రాజకీయాలను తిట్టుకుంటూ.. ఇంతే అని ఊరుకుంటాం. లోతుగా ఆలోచించి సమస్యను అర్థం చేసుకోం. పరిష్కారం కోసం ఏం చేయాలో ఆలోచించం. కానీ, ఎఫ్‌డీఆర్ చివరి రెండు పనులు చేస్తుంది. అందుకే సదస్సులు నిర్వహిస్తున్నాం. ఎన్నికల్లో డబ్బు ప్రవాహాన్ని అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పార్టీల ఏకాభిప్రాయ సాధన కోసం ప్రయత్నిస్తాం.

**అధికారం కోసం, పదవుల కోసం లోక్‌సత్తా ఏనాడూ పాకులాడ లేదు. మారుతున్న పరిస్థితుల్లో అన్ని ప్రాంతాల నుంచి స్థిరంగా 10 శాతం ఓట్లు వస్తాయనుకున్నాం. కానీ, లోక్‌సత్తాకు నగర ప్రాంతాల్లో వచ్చిన ఓట్లు.. గ్రామాల్లో రాలేదు. పార్టీలను ప్రభావితం చేసే ఆ ఓట్లు రావని అనుభవంలో తేలింది. అందుకే ఎన్నికల ప్రయాస వద్దని నిర్ణయించుకుని దూరంగా ఉన్నాం.**

### ఎన్నికల్లో ధనప్రవాహానికి కారణం?

సంపన్న దేశాల్లో ఒకటైన బ్రిటన్ ఎన్నికల్లో గెలిచేందుకు కన్జర్వేటివ్ పార్టీకి భారత రూపాయి మారకంతో పోల్చితే 100 కోట్లు ఖర్చయ్యాయి. కానీ, మన దగ్గర ఒక లోక్‌సభ సభ స్థానంలోనే రూ. 30 నుంచి 70 కోట్లు ఖర్చు చేస్తున్నారు. అసెంబ్లీ స్థానం పరిధిలో రూ.30 నుంచి 50 కోట్లు ఖర్చు చేస్తున్నారు. డబ్బులు పంచకుండా ఓట్లు పడే వ్యవస్థ రావాలి. అందుకే మా ప్రయత్నం.

### వ్యవస్థలో మార్పు కోసం ఎవరు బాధ్యత తీసుకోవాలి?

తుది బాధ్యత దేశం మొత్తానిది. ఎన్నికల నిర్వహణే ఎన్నికల సంఘం బాధ్యత. రాజకీయాన్ని మార్చడం వాళ్ల బాధ్యత కాదు. వాళ్లకు ఆ అధికారం, శక్తీ లేవు. నాలుగైదు లక్షల ఓట్ల కోసం ఒక్కో లోక్‌సభ నియోజకవర్గంలో డబ్బులు పంచుతున్నారు. ఎన్నికల సంఘం అజమాయిషీతో మార్పు సాధ్యం కాదు. వ్యవస్థనే మార్చాలి. ప్రజలు ఎలాగూ అభ్యర్థులను కాకుండా.. నాయకులను చూసి ఓటు వేస్తున్నారు. ఇలాంటప్పుడు ప్రత్యక్ష ఎన్నికలు పెట్టడం మంచిది. ప్రజల కోసం ప్రభుత్వం చేయాల్సిన పనుల విషయంలో పార్టీల కార్యకర్తలు నిరంతరం శ్రమిస్తున్నారు. పనులు వదులుకుని కార్యకర్తలు వస్తున్నారు. పాలన వక్రమార్గం పట్టి అవినీతి పెరుగుతోంది. దీనిని వ్యవస్థీకృతంగా పెరుగుతున్న సమస్యగా చూడాలి.

**తెలంగాణ కొత్త మునిసిపల్ చట్టంతో కొంతమేర విభేదాలు ఉన్నా.. సిటిజన్ చార్టర్లు బాగున్నాయి. అవి అమలైతే అవినీతి తగ్గుతుంది. మునిసిపాలిటీలకు అధికారం ఇచ్చి ఊరుకోవద్దు. కలెక్టర్లను అంబుడ్స్‌మెన్‌గా ప్రకటించారు. కానీ, సరిగ్గా అమలు కావాలి. ఎన్నికల్లో ఖర్చు ఎంతగా పెరిగిందో 'ఆంధ్రజ్యోతి'లోనే కథనం వచ్చింది. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేస్తే మార్పు సాధ్యం.**

### లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ ఎంతవరకు విజయం సాధిస్తాయి?

ఒక్క ఎంపీ కూడా లేకుండా మూడు రాజ్యాంగ సవరణలు సాధించిన ఘనత లోక్‌సత్తాకు ఉంది. అందర్నీ పిలుస్తాం. కూర్చోబెట్టి చర్చిస్తాం. ఏకాభిప్రాయాన్ని సాధిస్తాం. మార్పు వచ్చేలా చేస్తాం. ఇదే మేం నమ్మిన సూత్రం. ❖

హైదరాబాద్ డిక్లరేషన్

## ఆచరణలో భారత ప్రజాస్వామ్యం:


# ధన రాజకీయాన్ని కట్టడి చేయటం

'ఆచరణలో భారత ప్రజాస్వామ్యం' పరిష్కార చర్చావేదిక 2020 కార్యక్రమంగా 'ధనరాజకీయం'పై రెండు రోజుల చర్చల అనంతరం జనవరి 10న జరిగిన ముగింపు ప్లీనరీలో 'హైదరాబాద్ డిక్లరేషన్' పేరుతో కార్యాచరణ పత్రాన్ని ప్రకటించారు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బెర్క్‌లీకి చెందిన ప్రొఫెసర్ ప్రదీప్ ఛిబ్బర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భారత ఎన్నికల ప్రధానాధికారి అశోక్ లావాసా, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాం మాధవ్, ఐఎస్‌బీ అసోసియేట్ ప్రొఫెసర్ అశ్విని ఛత్రే, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ కె.సి సూరిలతో కలిసి జయప్రకాష్ నారాయణ్ ఆవిష్కరించిన హైదరాబాద్ డిక్లరేషన్‌లోని అంశాలు:

**జనవరి 10, 2020**

మరో రెండేళ్లలో, 2022లో భారతదేశం 75 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోనుంది. ఆ తర్వాత మరో మూడేళ్లకి 75 ఏళ్ల ప్రజాస్వామ్య రిపబ్లిక్ సంబరం కూడా వస్తుంది. కులవ్యవస్థ, నియంతృత్వ పాలన, పుట్టుకను బట్టి పెత్తందారీ సౌఖ్యాలు, మత విభజనలు, వలస పాలన.. శతాబ్దాలపాటు వీటన్నిటి మధ్యా నలిగిపోయిన ప్రజానీకానికి ఈ ప్రజాస్వామ్య ప్రయాణం ఒడిదుడుకులతో సాగటం సహజం. ఈ దశాబ్దాల కాలంలో ప్రజలు బహుముఖ లక్ష్యాలను సాధించేందుకు, సవాళ్లను అధిగమించేందుకు పోరాడారు. దేశ నిర్మాణం, సామాజిక న్యాయం, ఆర్థికాభివృద్ధి వంటి లక్ష్యాల కోసం ప్రజాస్వామ్య రాజకీయం పరిధిలోనే పనిచేసి కొన్ని గొప్ప విజయాలు సాధించారు. పాశ్చాత్య ప్రజాస్వామ్య దేశాల్లో ఈ లక్ష్యాల కోసం కృషి క్రమానుగతంగా శతాబ్దాలపాటు జరిగింది. కానీ పాశ్చాత్య దేశాలకున్న ఆర్థికమైన పునాదులేవీ లేకుండానే, ఆ దేశాల కంటే ఎంతో వేగంగా ఈ పరివర్తనను సాధించాల్సిన సవాలును భారత్‌ఎదుర్కొంటోంది.

ఓపక్క సంక్లిష్ట, వైవిధ్యభరిత సమాజం, మరోపక్క బీదరికంలో మ్రగ్గుతున్న ఎక్కువ జనాభా.. అయినా కూడా భారత్ ఒక దేశంగా, స్థిరమైన ప్రజాస్వామ్యంగా




నిలదొక్కుకుందంటే అది మన దేశ ప్రజల, నాయకుల విజ్ఞత, అంకితభావం, శ్రమలకు నిదర్శనంగా నిలుస్తుంది. భారత ప్రజాస్వామ్యం ఈవేళ క్రియాశీలమైనది, వాస్తవమైనది! భారతదేశ నేలలో ఓ బోధివృక్షంలా ప్రజాస్వామ్యం వేళ్లూనుకుంది. నిర్ణీత కాలవ్యవధిలో స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరిగే ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వ నాయకుల్ని ఎన్నుకుంటున్నారు లేదా తొలగిస్తున్నారు. ప్రభుత్వ నియంత్రణలేని మార్గాల నుంచి సమాచారం ప్రజలకు అందుబాటులో ఉంది. ప్రభుత్వం తమను శిక్షిస్తుందేమోనన్న భయం లేకుండా అభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛ వారికి ఉంది. ప్రజలు సంఘటితంగా ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేసేందుకు, రాజకీయ కలాపాల్ని నిర్వహించుకు నేందుకు వారికి స్వేచ్ఛ ఉంది. తమ భావజాలాన్ని ప్రచారం చేసుకోవటానికి, ప్రజల మద్దతును

కోరటానికి రాజకీయ పార్టీలకు హక్కు ఉంది. ఎన్నికైన ప్రభుత్వాల చేతిలో నిర్ణయాధికారం ఉంది.

అయితే ఇప్పటికీ భారత ప్రజాస్వామ్యం ఒక అసంపూర్ణ నిర్మాణమే. లక్ష్యసాధనకు మనం ఇంకా చాలాదూరమే ప్రయాణించాల్సి ఉంది. కేవలం మాట్లాడే స్వేచ్ఛ, నచ్చినవారికి ఓటు వేసుకునే హక్కు మాత్రమే మనం ఆశపడుతున్న మంచి జీవితానికి సరిపోవు. భావప్రకటనా స్వేచ్ఛ, వ్యక్తి ప్రయోజనాలకు - సమష్టి ఆనందమయ జీవనానికి, సంక్షేమ డిమాండ్లకు - అభివృద్ధి అవసరాలకు, చెల్లించే పన్నులకు - అందే సేవలకు, అన్నిటినీ మించి ప్రభుత్వాల అధికారానికి - జవాబుదారీతనానికి మధ్య సంధానం ఉండేందుకు ప్రజాస్వామ్యంలో పలు రకాల పరస్పరపూరక ఏర్పాట్లు అవసరం.

స్వతంత్రం వచ్చాక ఈ ఏడు దశాబ్దాలలో భారతదేశం ఏం సాధించింది అనే ప్రశ్నతోపాటు.. ఆచరణలో మన ప్రజాస్వామ్యం పనితీరులో కూడా పలు లోపాలు కనిపిస్తాయి. ఇవన్నీ భారతదేశ పౌరులు తక్షణం గుర్తించాల్సినవి, పరిష్కరించుకోవలసినవి.

అలా గుర్తించిన ఒక పెద్ద అంశం రాజకీయాల్లో ధన ప్రవాహం, చట్టసభల్లో సంపన్నవర్గ సభ్యుల సంఖ్య అత్యధికంగా ఉండటం.

డబ్బున్నవారు రాజకీయాల్లోకి ప్రవేశించి, ప్రజాప్రయోజనాల కోసం పనిచేయాలనుకుంటే, అభ్యంతర పెట్టాల్సిందేమీ లేదు. ఆ చొరవను ఆహ్వానించాలి కూడా. సంస్థాగతంగా, రాజకీయ కార్యకలాపాలపరంగా రోజువారీ నిర్వహణకు, ఎన్నికల్లో పోటీ చేయటానికి, ప్రచారానికి పార్టీలకు కూడా డబ్బు అవసరం. కానీ ఇటీవలి దశాబ్దాల్లో మనం చూస్తున్నదేమంటే, రాజకీయ కలాపాల్లో డబ్బు ప్రభావం విపరీతమైపోయింది! వందల కోట్ల రూపాయలు విచ్చలవిడిగా ప్రవహిస్తున్నాయి. పార్టీ రాజకీయాల్లో వంశపారంపర్య రాజకీయాలు ఒక కోణమైతే.. డబ్బుండటం, అధికారాన్ని సంపాదిం చటానికి లేదా నిలబెట్టుకోవటానికి ఎంత ఖర్చుకైనా వెనుకాడక పోవటం అభ్యర్థుల ఎంపికకు కీలక ప్రాతిపదికగా మారింది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూ మాఫియా, విద్యాసంస్థల యజమానులు, పెద్ద కాంట్రాక్టర్లు ఎటువంటి ప్రజాసేవ నేపథ్యం లేకుండా రాజకీయాల్లోకి నేరుగా ప్రవేశిస్తున్నారు. సొంత లాభాలను కాపాడుకునేందుకు పెంచుకునేందుకు, అందుకు ప్రభుత్వం, అధికారులు, పోలీసు యంత్రాంగంతో సంబంధాలు నెరపటానికి వీరు రాజకీయాలను మార్గంగా ఎంచుకున్నారు.

అధికారాన్ని చెలాయించటానికి అవకాశమున్న అన్ని మార్గాలనూ రాజకీయ నాయకులు గుప్పెట్లో పెట్టుకుని తమకు, తమ కుటుంబాలకు, ఆశ్రితులకు సంపద పోగేయటానికి వీలుగా ప్రభుత్వ విధానాలను పక్కదోవ పట్టిస్తున్నారు. ఎన్నికల్లో గెలవటానికి ధన, కనక, వస్తు, మద్యం రూపంలో ఓటర్లకు బహుమతులు పంచేందుకు పెద్దఎత్తున డబ్బు పెట్టుబడి పెట్టటానికి వారు సిద్ధపడుతున్నారు. ఈ పెట్టుబడులపై పెద్దఎత్తున లాభాల్ని ఆర్జించవచ్చని వారు పసిగట్టారు. ధన రాజకీయుల ప్రవేశం వల్ల.. సమాజం కోసం ఏదైనా చేద్దామని చిత్తశుద్ధితో, మంచి భావజాలంతో వచ్చిన రాజకీయ పార్టీలు, వ్యక్తులకు, రాజకీయాల్లోకి వద్దామని ఆశపడుతున్న ఉత్సాహవంతులైన యువతకు ఆదిలోనే హంసపాదు ఎదురవుతోంది. ఈ విపరీత ధనస్వామ్యం ఇటీవలి దశాబ్దాల్లో ప్రమాదకర స్థాయికి చేరిందని, ఇది భారత గణతంత్ర వ్యవస్థ పునాదుల్నే దెబ్బతీస్తుందని, దేశానికి ప్రయోజనకరమైన అంశాలపై సమష్టిగా, లోతుగా చర్చించి శాసనం చేయగల సామర్థ్యాన్ని చట్టసభ సభ్యుల్లో కొరవడేలా చేస్తుందని, ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ పట్ల పౌరుల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని ఒక సమాజంగా కూడా మనలో చాలామంది అంగీకరిస్తున్నారు. యుద్ధప్రాతిపదికన దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన పరిస్థితి ఇది. గతంలో లా కమిషన్, ఇంద్రజిత్ గుప్తా కమిషన్, రాజ్యాంగ సమీక్షా సంఘం వంటి అనేక సంఘాలు ఈ సమస్యను వివరిస్తూ వివిధ పరిష్కార చర్యలను సిఫార్సు చేశాయి. కానీ విధానాల్లోగానీ, రాజకీయ కార్యాచరణలోగానీ ఇప్పటికీ మార్పు రాలేదు.

పార్టీపరంగా, వ్యక్తిగతంగా లబ్ధిపొందటానికి చట్టవిరుద్ధంగా, అనుచితంగా రాజకీయాల్లో విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేయటమనే పెనుజాడ్యానికి కళ్లెం వేయటానికి ఇప్పటికైనా గట్టి సంకల్పం, కార్యాచరణ కావాలి. ఒక క్రమబద్ధమైనరీతిలో రాజకీయ సంస్కర ణల కోసం పనిచేయటమే మెరుగైన పరిష్కారమని ప్రస్తుత పరిస్థి తులు మనకు విశదపరుస్తున్నాయి. సమస్య బహుముఖంగా ఉంది కాబట్టి, మన ప్రయత్నం కూడా అనేక కోణాల నుంచి ఉండాలి:

1. రాజకీయాల్లో ధన ప్రవాహం వల్ల తలెత్తుతున్న ప్రమాదకర పరిణామాలు, ఓటు కోసం డబ్బు, బహుమతులు, ఇతర ప్రలోభాలను పందేరం చేసే రాజకీయ నాయకులు ఆ తర్వాత ఎలా అక్రమ మార్గాల్లో తిరిగి మన డబ్బును అనేకరెట్లు దోచేసి పోగేసుకుంటారో తెలియజేస్తూ ప్రజల్లో చైతన్యాన్ని పెంచితే.. డబ్బు

రాజకీయాల్ని కట్టడి చేయటానికి గట్టి పునాది పడుతుంది. ఇందుకోసం సమాజాన్ని పట్టించుకునే పౌరులు, పౌర సమాజ బృందాలు, ఎన్నికల సంఘం కలసికట్టుగా పకడ్బందీగా ప్రచారం చేయాలి.

2. పార్టీలు ప్రజాస్వామ్యయుతంగా పనిచేసేలా చేయటానికి, రాజకీయాల్లోకి డబ్బు ప్రవాహాన్ని నియంత్రించటానికి చట్టపరంగా మనకు ఒక పటిష్టమైన ఏర్పాటు కావాలి. చట్టాన్ని సక్రమంగా అమలు చేసే సామర్థ్యాన్ని కూడా మనం బలోపేతం చేసుకోవాలి. పార్టీలలో పదవులను ఇష్టారీతిన కాకుండా నిర్ణీత కాలవ్యవధిలో సంస్థాగత ఎన్నికల ద్వారా భర్తీ చేయాలి. అభ్యర్థులను పారదర్శక, ప్రజాస్వామిక ప్రక్రియ ద్వారా ఎంపిక చేయాలి. పార్టీలు తమ వార్షిక ఆదాయాలు, వ్యయాలు, నిధులు ఎక్కడ నుంచి వస్తున్నదీ వగైరాలను నిర్ణీత కాలవ్యవధిలోగా సక్రమంగా ప్రకటించే చర్యలుండేలా మనం చూసుకోవాలి. రాజకీయ పార్టీలు అవసరమైన నిధుల్ని పారదర్శక పద్ధతిలో సేకరించుకోగలిగే/పొందేలా విధానపరమైన ఏర్పాట్లు ఉండాలి. దీనివల్ల అన్ని పార్టీలకూ తమ పార్టీ కార్యకలాపాలను నడుపుకోవటానికి, ఎన్నికల్లో పోటీ చేయటానికి కనీస ఆర్థిక మద్దతు లభిస్తుంది.

3. రాజకీయాల్లో చట్టవిరుద్ధ డబ్బు ప్రాబల్యాన్ని, బహుమతులు పంచుడు పాత్రను తగ్గించటానికి అత్యుత్తమ మార్గాలు:

ఎ) పదవుల ప్రాధాన్యతను, వాటి పట్ల ఆకర్షణను తగ్గించటం

బి) ప్రభుత్వ పాత్రను, అధికారాన్ని కనిష్ఠ స్థాయికి పరిమితం చేయటం

సి) ఓటర్లు తమ ఓటుకు, దాని పర్యవసానంగా తమ జీవితాల్లో వచ్చే మార్పులకు మధ్య సంబంధాన్ని గుర్తించేలా, ఎన్నికైన ప్రభుత్వాన్ని జవాబుదారీ చేస్తూ అధికార దుర్వినియోగాన్ని సామాన్య పౌరులు ప్రశ్నించగలిగేలా స్థానిక ప్రభుత్వాలకు జవాబుదారీతనంతో సాధికారతను కల్పించటం రాజ్యాంగంలోని 73, 74 సవరణల్ని మంచి ఉద్దేశంతోనే చేసినా, సాధికారత, జవాబుదారీతనం గల స్థానిక ప్రభుత్వాల ఏర్పాటును అవి సాధించలేకపోయాయని సదస్సు స్పష్టం చేస్తోంది. విగ్రహం, పటాటోపం తప్ప తగిన అధికారాలు లేని స్థానిక ప్రభుత్వాలను అవి సృష్టించాయి. స్థానిక ప్రభుత్వాలకు సాధికారత కల్పించేందుకు జాతీయ స్థాయిలోని ప్రభుత్వం, రాష్ట్ర




ప్రభుత్వాలు, అన్ని రాజకీయ పార్టీలూ యుద్ధప్రాతిపదికన స్పందించాలి. కొత్త తరహా, ఎప్పటికప్పుడు మార్పులకు అనుగుణంగా వ్యవహరించగల స్థానిక ప్రభుత్వాల ఏర్పాటును ప్రోత్సహించాలి. గ్రామీణ, పట్టణ స్థానిక ప్రభుత్వాలు అన్ని రకాల నాణ్యమైన పౌర సేవలకు ప్రధాన కేంద్రాలుగా మారాలి. సాధ్యమైనంత వరకూ ఎక్కడి పనులు అక్కడే పరిష్కారమవటమే పాలనకు గీటురాయి కావాలి. ఇలా స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేసినప్పుడు క్రమంగా ప్రజలు ఓటు విలువను గుర్తించి వ్యవహరించటం మొదలుపెడతారు, అన్నిచోట్లా క్రియాశీల నాయకత్వం తయారవుతుంది.

4. మన ప్రజాస్వామ్య రాజకీయంలో భాగమైన ఓటర్లు, అభ్యర్థులు, పార్టీలకు ప్రోత్సాహకాలను మార్చటంలో, రాజకీయ సంస్కృతి, వ్యవహారశైలిని పాదుకొల్పటంలో, ఫలితాలను మార్చటంలో ఎన్నికల వ్యవస్థలు, ప్రజాస్వామ్య పద్ధతుల నిర్మాణం కీలకపాత్ర పోషిస్తాయని మేం గుర్తించాం. అత్యుత్తమ ఎన్నికల వ్యవస్థ అంటూ ఏదీ లేదు. అన్ని ఎన్నికల నమూనాల్లోనూ బలాలు,

బలహీనతలూ ఉన్నాయి. భారతదేశ నేపథ్యంలో, ఒక్క ఓటు ఎక్కువ వచ్చిన వారిదే గెలుపు, మిగిలినవారికి ఎన్ని ఓట్లు వచ్చినా వారంతా ఓడిపోయినట్లే అనే ఎఫ్.పి.టి.పి ఎన్నికల పద్ధతి.. ఎన్నికైన శాసనసభ్యులు ప్రభుత్వ మనుగడను నిర్ణయించే పద్ధతి కలగలసి మన దేశంలో చట్టసభ సభ్యులు నియోజకవర్గాల్లో అనధికార రాజ్యాధినేతలుగా వ్యవహరించేలా చేస్తోంది. దీనివల్ల ప్రతి ఓటూ విలువైనదిగా మారి, ఓట్ల వేట పోటాపోటీ వేలంపాటలాగా మారిపోయింది. ఓటర్లను ఆకట్టుకోవటానికి బహుమతుల్ని పంచే ధోరణులు నానాటికీ ప్రబలుతున్నాయి. ఇది అవినీతి, అధికార దుర్వినియోగం, ధనస్వామ్యాలకే దారితీయటం అనివార్యం కాదా? దేశంలోని అనేక ప్రాంతాల్లో డబ్బు, బహుమతులు లేదా మద్యం రూపంలో పెద్ద మొత్తాన్ని పంచుతుంటారు. చాలా సందర్భాల్లో ఇది చట్టబద్ధంగా నిర్దేశించిన వ్యయం కంటే అనేక రెట్లు ఎక్కువగా ఉంటుంది. ఇంత భారీగా, చట్టవిరుద్ధంగా డబ్బు వెదజల్లినా గెలుపుకి గ్యారంటీ లేదు. కానీ డబ్బు ఖర్చు పెట్టకపోతే మాత్రం ఓటమి ఖాయం. ఎన్నికల్లో బలమైన, గెలవగలిన అభ్యర్థి అని భావించాలంటే, భారీగా డబ్బు ఖర్చు చేయటమనేది ఒక అవసరమైన షరతుగా, ప్రవేశ రుసుముగా మారింది.

కాబట్టి, ఎఫ్.పి.టి.పి విధానంలో మన దేశ అనుభవాలను సమీక్షించుకోవాల్సిన సమయమిది. ఒక్క ఓటు తక్కువ వచ్చినా ఓడిపోవటమే కాబట్టి.. నియోజకవర్గాలలో కాసిని ఓట్ల కోసం కూడా హోరాహోరీ పోరు జరుగుతుంటుంది. ప్రతి సీటునూ గెలవటం రాజకీయ పార్టీలు, నాయకులకు ఎంత కీలకమంటే.. ఎలాగోలా గెలవటం కోసం వాళ్లు ఆకర్షణీయ తాత్కాలిక తాయిలాల్ని, హామీల్ని, ప్రలోభపెట్టే రకరకాల బహుమతుల్ని ఓటర్లకు ఎర చూపుతుంటారు. ప్రజాస్వామ్య నిర్మాణానికి విఘాతం కలిగించే రీతిలో ఎన్నికల నిర్వహణ ఎత్తుగడలకు పాల్పడుతుంటారు. ప్రభుత్వంతో రోజువారీ సంబంధాలు కొనసాగిస్తూ, ప్రభావితం చేస్తూ తమ సొంత పనులు చక్కబెట్టుకునే అవకాశాన్ని మన పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థ కల్పించటం వల్ల.. ఎన్నికల్లో ఎంత ఖర్చు పెట్టయినా, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే ఎన్ని ప్రలోభాల్ని ప్రకటించయినా ఎన్నికల్లో గెలిస్తే అదో పెద్ద లాభసాటి బేరమని అభ్యర్థులు భావిస్తున్నారు.

కాబట్టి, ఇప్పుడున్న ఎన్నికల విధానం స్థానంలో ప్రత్యామ్నాయ పద్ధతులపై పారదర్శకంగా, సమగ్రంగా, లోతైన చర్చ దేశవ్యాప్తంగా జరగాలి. చట్టసభలు, ప్రభుత్వం మధ్య స్పష్టమైన అధికారాల విభజన.. ప్రభుత్వాధినేతలు చట్టసభ సభ్యుల మీద ఆధారపడకుండా ప్రత్యక్షంగా ఎన్నుకోవటం.. ఎఫ్.పి.టి.పి ఎన్నికల విధానం స్థానంలో దామాషా ఎన్నికల పద్ధతి వంటివి పరిశీలించవచ్చు. వీటిని అమలు చేయాలనుకుంటే, జాతీయ స్థాయిలో అన్ని ప్రాంతాలకూ విస్తృత ప్రాతినిధ్యం లభించేలా, కులం, మతం, తెగ వంటి వాటితో రాజకీయం చీలికలు పీలికలు కాకుండా నివారించేలా, ప్రభుత్వాల స్థిరత్వానికి ధోకా లేకుండా ఉండేలా భారతదేశ పరిస్థితులకనుగుణంగా మార్పులు చేర్పులు చేయాలి.

మన ముందున్న సవాలు చిన్నదేమీ కాదు. ఎందుకంటే, దేశ రాజకీయాన్ని నియంత్రించే రాజకీయ నాయకులను ఇందులో నియంత్రించాల్సి ఉంటుంది. స్వీయనియంత్రణ ఎవరికైనా పెద్దసవాలే. భారతదేశ రాజకీయ నాయకులు ఈ సవాలుకు తగ్గట్లు స్పందించాల్సిన పరిస్థితులైతే ఇప్పుడు ప్రబలంగా నెలకొన్నాయి.

భారతదేశం తనను తాను ప్రజాస్వామ్య రిపబ్లిక్‌గా ప్రకటించుకున్న తరుణంలో.. తమ కోసం, తమ భవిష్యత్ తరాల కోసం భారతీయులు నిర్దేశించుకున్న లక్ష్యాల్ని సాధించేందుకు మనమంతా కలసిరావాలి. మన ప్రజాస్వామ్యాన్ని మెరుగ్గా పని చేసే ప్రభావశీల వ్యవస్థగా తయారుచేసేందుకు సమష్టిగా పనిచేయాలి. ప్రపంచంలో ఎక్కువమంది నిరక్షరాస్యులు, పేదలు ఉన్న దేశం ఏదంటే.. ఇప్పటికీ భారతదేశం పేరే వినిపిస్తుంది. ఆరోగ్యం, పాఠశాల విద్య ప్రమాణాలు వంటి ప్రధాన మానవాభివృద్ధి సూచీల్లో మన దేశం ఇప్పటికీ ప్రపంచ దేశాలలో అట్టడుగు స్థానాల్లోనే ఉంది. కులం, మతం, ప్రాంతం వంటి అస్తిత్వాలు ప్రజల మధ్య విభజన ముప్పుగానే కొనసాగిస్తున్నాయి.

భారతదేశం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు ప్రజాస్వామ్య రాజకీయ నిర్మాణం నుంచే రావాలి. ఆరోగ్యకరంగా పనిచేసే రాజకీయ సంస్థలు, పటిష్ట రాజకీయ కార్యాచరణతోనే ఇలాంటి ప్రజాస్వామ్య రాజకీయం సాధ్యం. సామాన్య భారతీయులు ప్రజాస్వామ్యం ద్వారా మెరుగైన జీవితాన్ని కోరుకుంటున్నారు. రాజకీయ వ్యవస్థగా మన మెరుగైన భవిష్యత్తుకు ప్రజాస్వామ్యమే ఏకైక ఆశాకిరణం. ఈ ఆశను నెరవేర్చుకోవటానికి అందరం కలసి పనిచేద్దాం, ఈ కీలక సమయంలో మన ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించుకుందాం, మెరుగ్గా పనిచేసేలా చేద్దాం.

www. idaw.in

# 70 ఏళ్ళ రిపబ్లిక్ - సమాఖ్య వ్యవస్థ

## - డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

స్వతంత్ర భారతదేశం మానవ చరిత్రలోనే గతంలో ఎన్నడూ చూడనంత వైవిధ్యమున్న దేశం. ఇన్ని భాషలు, కులాలు, మతాలు, తెగలు, జాతులు, ప్రాంతాలతో ఒక దేశం మనగలగటం అసాధారణం. ఈ పరిస్థితిని గమనించిన మన రాజ్యాంగ నిర్మాతలు మన దేశాన్ని రాష్ట్రాల సమాఖ్యగా ప్రకటించారు. అయితే మనది ఇతర ఫెడరల్ దేశాల మాదిరిగా పూర్తిస్థాయి సమాఖ్య కాదు. అందుకే పండితులు మన రిపబ్లిక్‌ని అర్ధసమాఖ్య వ్యవస్థగా వర్ణించారు.

నిజమయిన సమాఖ్య వ్యవస్థలో రాష్ట్రాల ఉనికి జాతీయస్థాయిలో ఉన్న ప్రభుత్వ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉండదు. ఆ రాష్ట్రాల సరిహద్దుల మార్పుగాని, విలీనంగాని, విభజనగాని ఆ రాష్ట్ర సమ్మతి లేకుండా సమాఖ్య వ్యవస్థలో జరగవు. కాని మన రాజ్యాంగంలోని 2, 3 అధికరణల ద్వారా పార్లమెంటుకి కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేయటానికి, రాష్ట్రాల పేర్లని, సరిహద్దులని మార్చటానికి అధికారాలు సంక్రమించాయి. అయితే ఇటీవల ఒకటి, రెండు సందర్భాలలో తప్ప మన దేశంలో కొత్త రాష్ట్రాల ఏర్పాటు గాని, రాష్ట్రాల విభజన గాని ఆ రాష్ట్రాల సమ్మతితోను, దేశంలో ఏకాభిప్రాయంతోను మాత్రమే జరిగినాయి. ఆ రీతిలోనే శాంతియుతంగా, ప్రజల ఆకాంక్షల మేరకు భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి. అందువల్లనే ప్రపంచంలో ఏ దేశంలోను లేనివిధంగా, మనకి రాజ్యాంగం గుర్తించిన 22 భాషలున్నా, అన్ని భాషల ప్రజల మధ్య సుహృద్భావాన్ని, దేశంలో ఐక్యతని సాధించగలిగాం.



అలాగే అఖిల భారత సర్వీసులు మన దేశ అవసరాలరీత్యా ఫెడరల్ స్ఫూర్తికి విఘాతమయినా కొనసాగించాం. ఆ విధంగానే ప్రపంచంలో మరే ఫెడరల్ ప్రజాస్వామ్యంలోను లేనిరీతిన మన రాష్ట్రాలలోను, స్థానిక ప్రభుత్వాలలోను అమలయ్యే రాజకీయ నమూనాని, ఎన్నికల వ్యవస్థని రాజ్యాంగంలోనే పొందుపరిచారు. యూనియన్ ప్రభుత్వం రాష్ట్రాలకి రాజ్యాంగాధిపతులుగా ఎన్నికకాని గవర్నర్లని నియమించటం కూడా సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. ఇక 356వ అధికరణాన్ని ప్రయోగించి రాష్ట్రాలలో ఎన్నికయిన ప్రభుత్వాలని, చట్టసభలని రద్దుచేసి అధికారం కేంద్రానికి కట్టబెట్టటం వలస పాలననాటి అవశేషం, సమాఖ్య స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధం.

అలాగే ఏడవ షెడ్యూలులోని అధికారాల విభజనని చూస్తే ఎక్కువ అధికారాలు కేంద్రానికి ఇవ్వటమే కాకుండా, ఉమ్మడి జాబితా పేరుతో రాష్ట్రాలలో నిర్ణయాలు చేయాల్సిన అంశాలపైన కూడా కేంద్రానికి పెత్తనం ఇచ్చారు. ఆపైన రాజ్యాంగంలో పేర్కొనని ఇతర అంశాలేమయినా వస్తే, వాటన్నింటిపైనా కేంద్రానికి అధికారం ఇచ్చారు. ఇవికాక రాజ్యసభకి రాష్ట్రాల జాబితాలోని అంశాలని కేంద్రానికి బదిలీ చేసే అధికారం ఉంది. అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తే పార్లమెంటుకి అన్ని అంశాల మీద చట్టాలు చేసే అధికారం సంక్రమిస్తుంది; దేశమంతా సమాఖ్య వ్యవస్థకి బదులు యూనిటరీ వ్యవస్థగా మారిపోతుంది. రెండు, అంతకుమించి రాష్ట్రాలు కోరితే పార్లమెంటు రాష్ట్రాలకి సంబంధించిన అంశాలపైన చట్టాలు చెయ్యవచ్చు; ఒకసారి అలాంటి చట్టం అమలుకి ఒక రాష్ట్రం అంగీకరిస్తే, ఇక ఆ అంశంపయిన ఆ రాష్ట్రానికి భవిష్యత్తులో ఏ అధికారమూ ఉండదు. అంతర్జాతీయ ఒప్పందాలకి అనుగుణంగా రాష్ట్రాల జాబితాలోని ఏ అంశం మీదనయినా చట్టాన్ని చేసే అధికారం పార్లమెంటుకుంది. ఇలా వివిధ రూపాలలో రాష్ట్రాల స్వయంప్రతిపత్తికి బదులు అపరిమితమయిన కేంద్రీకరణకి రాజ్యాంగంలో ఏర్పాట్లున్నాయి.

మన రిపబ్లిక్ ఏర్పడిన తరువాత రాష్ట్రాలకి చెందిన చాలా అంశాలని ఉమ్మడి జాబితాలో చేర్చి పార్లమెంటుకి, కేంద్రానికి తుది అధికారాలను కట్టబెట్టారు. దాంతో ఎన్నో రంగాలలో స్థానిక పరిస్థితులతో సంబంధం లేకుండా దేశమంతటికి ఒకే మూసలో చట్టాలు చేయటం జరుగుతోంది. రాష్ట్రాలలో ఆర్థికాభివృద్ధికి, విధానాల రూపకల్పనకి ఈ చట్టాలు ప్రతిబంధకమవుతున్నాయి. రాష్ట్రంలో న్యాయస్థానాల ఏర్పాటు, క్రిందిస్థాయి న్యాయవ్యవస్థలో మార్పులు కూడా ఉమ్మడి జాబితాలో చేర్చటంతో సత్వర న్యాయం కోసం సంస్కరణలు చెయ్యాలన్నా కేంద్రం అనుమతి అవసరమవుతున్నది. అడవులని ఉమ్మడి జాబితాలో చేర్చటంతో ప్రత్యామ్నాయ అడవుల పెంపకానికి ఏర్పాట్లు జరిగినా మౌలిక

సదుపాయాలు, అభివృద్ధి పథకాలు ఆగిపోతున్నాయి. అలాగే వన్యమృగాలు, పక్షుల పరిరక్షణని ఉమ్మడి జాబితాలో చేర్చారు. పాఠశాల విద్యని ఉమ్మడి జాబితాలో చేర్చి రాష్ట్రాలకి విద్యాప్రమాణాలు పెంచటానికి, వ్యవస్థని సంస్కరించటానికి వెసులుబాటు లేకుండా చేశారు. పార్లమెంటు విద్యాహక్కు చట్టం చేసినా, దానిలోని లోపాల వల్ల వేలాది కోట్లు ఖర్చు చేస్తున్నా తెలుగు రాష్ట్రాలతో సహా చాలా రాష్ట్రాలలో విద్యాప్రమాణాలు క్షీణిస్తున్నాయి. అలాగే భూమికి సంబంధించిన అన్ని అంశాలు రాష్ట్రాల పరిధిలో ఉన్నా, భూసేకరణని ఉమ్మడి జాబితాలో చేర్చటంతో ప్రాజెక్టుల వ్యయం విపరీతంగా పెరిగిపోయింది. అలాగే జంతువులపై క్రూరత్వాన్ని నిరోధించే అంశాన్ని ఉమ్మడి జాబితాలో పెట్టటంతో, ఆ వంకన పాడిపశువుల వాణిజ్యం మొత్తాన్ని కఠినంగా నియంత్రిస్తూ, దాదాపు నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు గ్రామీణ ఆర్థికవ్యవస్థని అల్లకల్లోలం చేశాయి.

ఇక ఆర్థికాంశాలలోకి వస్తే, కేంద్రానికి పెరుగుతున్న ఆదాయవనరులను కట్టబెట్టారు. ఒక ఆర్థిక వ్యవస్థ ఆధునికీకరణ జరిగినప్పుడు వ్యక్తులకి, కంపెనీలకి ఆదాయాలు పెరుగుతాయి. నిజానికి చాలా అంశాల మీద కేంద్రానికి అధికారమున్నా, రోజువారిగా మౌలిక సదుపాయాలని ఏర్పరచటం, కనీస వసతులని కల్పించటం, విద్య, ఆరోగ్యాలని ప్రజలందరికి అందించటం, శాంతిభద్రతలని కాపాడటం, సత్వర న్యాయాన్నందించటం – ఈ కీలక బాధ్యతలన్నీ రాష్ట్రాలవే. అంటే కేంద్రానికి అధికారాలు ఎక్కువ, బాధ్యతలు తక్కువ, అయినా వనరులలో సింహభాగం కేంద్రానిదే! రాష్ట్రాల వనరులలో భూమి శిస్తు లాంటి సంప్రదాయ పన్నుల పాత్ర దాదాపు శూన్యమయిపోయింది. కేవలం అమ్మకపు పన్ను, సారాయి మీద పన్ను, భూమి కొనుగోళ్ళ మీద స్టాంపుడ్యూటీలు, వాహనాల పన్ను మాత్రమే రాష్ట్రాలకి చెప్పుకోదగ్గ ఆదాయాలు.

ఈ వనరుల సమస్యకి తోడుగా ఆర్థిక, సామాజిక ప్రణాళికలని ఉమ్మడి జాబితాలో చేర్చటంతో చాలా అంశాలలో నిర్ణయాధికారం కేంద్రీకృతమయింది. రాష్ట్రాల జాబితాలకి సంబంధించిన అంశాల మీద పథకాలు, ప్రాజెక్టులు కూడా కేంద్రం నిర్ణయం కోసం పడిగాపులు కాయటం, ప్రదక్షిణలు చేయటం ఆనవాయితీ అయింది. ప్రణాళికాసంఘం రద్దుతో కొంతమేరకు పరిస్థితి మారినా, నిర్ణయాలలో అధికార కేంద్రీకరణ చాలామేరకు కొనసాగుతోంది. అలాగే రాష్ట్రాల జాబితాలలోని అంశాలపైన కూడా చాలా కేంద్ర ప్రతిపాదిత పథకాలని రాష్ట్రాల మీద రుద్దుతున్నారు. ఆ పథకాలని కేంద్రం నిర్ణయించినట్లుగా అమలు చేస్తేనే రాష్ట్రాలకి నిధులు దక్కుతాయి కాబట్టి, అంతకంటే మంచి ప్రత్యామ్నాయాలున్నా కేంద్రం నిర్ణయాలని అమలు చేయాల్సి వస్తోంది.

ఇలా రాజ్యాంగ నిర్మాణంలోని ఏర్పాట్ల వల్ల, ఆ తరువాత రాష్ట్రాల అధికారాలని మరింత కుదిస్తూ చేపట్టిన సవరణల వల్ల, ఆర్థిక కేంద్రీకరణ వల్ల, కేంద్ర ప్రతిపాదిత పథకాల వల్ల కేంద్రీకరణ పెరిగి సమాఖ్య వ్యవస్థ స్ఫూర్తి దెబ్బతింది.

అయితే మన రాజ్యాంగం అమలయిన నాటి నుంచి, ముఖ్యంగా 1991 నాటి నుంచి మన సమాఖ్య వ్యవస్థ కొంతమేరకు బలపడి పరిణతి చెందిన మాట వాస్తవం. తొలినాటి నుంచి రెండు మంచి పరిణామాలు చోటుచేసుకోవటం వల్ల మన సమాఖ్య వ్యవస్థ మనగలిగింది. మొదటిది, భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు, రాష్ట్రాల విభజనని ఆ రాష్ట్ర సమ్మతితోనే చేపట్టటమనే ఆరోగ్యకర సంప్రదాయం. రెండవది, తొలి నుంచి జాతీయస్థాయిలోని ప్రభుత్వాలు క్రమంతప్పకుండా కేంద్ర–రాష్ట్ర ఆర్థిక సంబంధాలు పరిశీలించే ఆర్థిక సంఘాలని నిపుణులతో ఏర్పాటు చేయటం, ఆ సంఘాల నివేదికలని తు,చ తప్పకుండా అమలుచేయటం జరుగుతున్నది. ఈ కారణంగా సమాఖ్య వ్యవస్థలో ఆర్థిక లావాదేవీలు పద్ధతి ప్రకారం, హేతుబద్ధంగా జరుగుతూ సమాఖ్య వ్యవస్థని బలోపేతం చేశాయి.

ఇవికాక 1991 నుంచి ఉత్పన్నమయిన పరిణామాలు కొంతమేరకు సమాఖ్య వ్యవస్థని బలోపేతం చేశాయి. కాంగ్రెస్ గుత్తాధిపత్యం అంతరించి చాలా రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు బలపడటంతో జాతీయస్థాయిలో ఉన్న ప్రభుత్వాలకి విధిగా రాష్ట్రాల ప్రయోజనాలని, హక్కులని పరిగణలోకి తీసుకోవాల్సి వచ్చింది. అలాగే బొమ్మై కేసులో 1994లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వల్ల రాష్ట్రాలలో ఎన్నికయిన ప్రభుత్వాలను బర్తరఫ్ చేసి 356వ అధికరణాన్ని దుర్వినియోగం చేయటం, రాష్ట్రపతి పాలన విధించటం చాలామేరకు ఆగిపోయింది. 1991లో ఆర్థిక సంక్షోభం తలెత్తటంతో విధిగా ఆర్థిక సంస్కరణలని చేపట్టవలసి వచ్చింది. ఆ సంస్కరణలలో భాగంగా లైసెన్సు–పర్మిట్–కోటా రాజ్యం చాలామేరకు అంతమయింది. దాంతో రాష్ట్ర ప్రభుత్వాలు, పారిశ్రామికవేత్తలు ప్రతి చిన్న నిర్ణయానికి ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేసి పడిగాపులు కాయటం తగ్గింది. రాష్ట్రాలు తమతమ పెట్టుబడులతో, విధానాలతో ఆర్థికాభివృద్ధికి, పెట్టుబడులకి మార్గాలు ఏర్పరచుకోవటం సాధ్యమయింది. అలాగే ఆర్థికవ్యవస్థలో ప్రభుత్వరంగ సంస్థల పాత్ర గతంతో పోలిస్తే తగ్గి, మార్కెట్‌లో స్వేచ్ఛ, పోటీ పెరిగాయి. దీంతో ప్రైవేటు పెట్టుబడుల ప్రాధాన్యత పెరిగింది. గతంలోలాగా తమ రాష్ట్రాలలో ప్రభుత్వరంగ సంస్థలని ఏర్పాటు చెయ్యమనో, ఫ్యాక్టరీలని నిర్మించమనో కేంద్రాన్ని ప్రాధేయపడే పరిస్థితి తొలగిపోయింది. ఇటీవల ప్రణాళికా సంఘాన్ని రద్దుచేయటంతో కొంతమేరకు ఆర్థిక నిర్ణయాలలో కేంద్రీకరణ తగ్గింది. ఇవన్నీ సమాఖ్య వ్యవస్థకి శుభసూచకాలు.

అయితే ఇటీవలికాలంలో సంభవిస్తున్న కొన్ని పరిణామాలు సమాఖ్య వ్యవస్థని బలహీనపరచి మరింత కేంద్రీకరణకి దారితీస్తున్నాయి.

మొదటిది, ప్రణాళికా సంఘం రద్దుతో వచ్చిన నీతిఆయోగ్

ఒక బలహీనమయిన సంస్థగా మారిపోయి రాష్ట్రాలకి నిష్పాక్షికంగా దీర్ఘకాల విధానాలు, పథకాల మీద సలహాలిచ్చే శక్తిని కోల్పోయింది. దాంతోపాటు గతంలో ప్రణాళికా సంఘం నిష్పాక్షికంగా, వృత్తినైపుణ్యంతో చేసిన కార్యక్రమాలు, వనరుల పంపిణీ ఇప్పుడు ప్రత్యక్షంగా కేంద్ర ప్రభుత్వ ఆర్థికశాఖకి సంక్రమించటంతో మరింత కేంద్రీకరణకి, రాజకీయ పక్షపాతాలకి తావిస్తున్నది.

రెండవది, 101వ సవరణతో దేశంలో ఏకమార్కెట్ స్థాపన కోసం వచ్చిన జి.యస్.టి పన్ను దేశ దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం అవసరమనే ఆర్థికవేత్తలు అత్యధికులు భావిస్తున్నారు. కాని అదే సమయంలో రాష్ట్రాలకి అత్యధికంగా ఆదాయాన్నిచ్చే అమ్మకంపన్ను జి.యస్.టిలో విలీనం కావటంతో వనరుల సమీకరణలో రాష్ట్రాలకు వెసులుబాటు మరింత తగ్గింది.

మూడవది, చట్టబద్ధంగా జి.యస్.టి వసూళ్ళలో రాష్ట్రాల లోటుని పూరించే బాధ్యత కేంద్రానిది. కాని దాదాపు లక్ష కోట్ల రూపాయల బకాయిలున్నా కేంద్రం నిధుల్ని విడుదల చేయకపోవటంతో చాలా రాష్ట్రాలలో ఆర్థిక సంక్షోభం మరింత ముదురుతోంది. అంతర రాష్ట్ర జలవివాదాల పరిష్కార బాధ్యత, అధికారం కేంద్రానికి ఉన్నా, రాజకీయ కారణాల వల్ల, అలసత్వం వల్ల కేంద్రం చొరవ తీసుకోకుండా సమస్యలని జటిలం కానిస్తున్నది.



నాలుగోది, కేంద్ర ప్రతిపాదిత పథకాల పాత్ర తగ్గకపోగా ఇటీవల మరింతగా పెరుగుతోంది. పథకాల అమలులో కేంద్రం పాత్ర పెరగటం, రాష్ట్రాల వెసులుబాటు తగ్గటం వల్ల సమాఖ్య వ్యవస్థ బలహీనపడుతోంది. అంతేకాక, రాష్ట్రాల జాబితాలోని అంశాలపై కూడా రాజకీయంగా తమ ముద్ర బలంగా పడేందుకు మోదీ ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేయటంతో రాష్ట్రాలకి పరిపాలనలో చొరవ తగ్గి, స్థానిక పరిస్థితులకి అనుగుణంగా స్పందించటం కష్టమవుతున్నది.

ఇక 356వ అధికరణం దుర్వినియోగం కాదని భావిస్తున్న సమయంలో అరుణాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఇటీవల మహారాష్ట్ర, జమ్ము-కాశ్మీర్‌లలో చేపట్టిన చర్యలు మరింత కేంద్రీకరణకి దారితీసి సమాఖ్య స్ఫూర్తిని దెబ్బకొడుతున్నాయి.

రాష్ట్రాలని సంప్రదించకుండానే ఏకపక్షంగా, తొందరపాటుతో, అసమగ్రంగా చేపట్టిన నోట్ల రద్దు కార్యక్రమం – ఆ అధికారం కేంద్రానిదే అయినా, రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థని అతలకుతలం చేసింది. అలాగే 15వ ఆర్థికసంఘానికి కేంద్రం ఇచ్చిన మార్గదర్శక సూత్రాలు కొన్ని సమాఖ్య వ్యవస్థని బలహీనపరిచేయిగా ఉన్నాయి. తొలిసారిగా 14వ ఆర్థికసంఘం ప్రతిపాదించిన 42 శాతం రాష్ట్రాల వాటాని పునఃపరిశీలించమని సూచించారు!

అలాగే తొలిసారిగా దేశరక్షణ, జాతీయ భద్రతల కోసం ప్రత్యేకనిధిని ప్రతిపాదించారు. నిజానికి శాంతిభద్రతలు రాష్ట్రాల పరిధిలోని అంశాలు. ఆపైన కేంద్ర బలగాలని రాష్ట్రాలలో మోహరిస్తే ఆ భారాన్ని రాష్ట్ర ఖజానాయే భరిస్తుంది. అయినా 58 శాతం విభజించే పన్నుల వాటాని, 100 శాతం సెస్సులు, సర్చార్జిలని పొందుతున్న కేంద్రం, ఇంకా రాష్ట్రాలకి వనరులు తగ్గించాలని ప్రయత్నిస్తున్నట్లు స్పష్టమవుతున్నది. అలాగే 2011 జనాభాని పరిగణలోకి తీసుకోవాలని ఇచ్చిన ఆదేశం కుటుంబ నియంత్రణని పాటించిన దక్షిణాది రాష్ట్రాలకి నష్టం చేస్తుందని ఆందోళన ఉంది.

ఇవన్నీ అలా ఉండగా, తమ ఆధీనంలో ఉన్న ఆదాయపన్ను, ఇ.డి, రెవెన్యూ నిఘా లాంటి విభాగాలని పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసం, ప్రత్యర్థులని వేధించటానికి ఉపయోగిస్తున్నారనే తీవ్ర ఆరోపణలున్నాయి. ఈ సంస్థల ఉక్కుపాదం నూటికి 90 సందర్భాలలో రాజకీయ ప్రత్యర్థుల మీదే పడటంతో ఆ ఆరోపణలకి బలం చేకూరుతున్నది. ఇవన్నీ సమాఖ్య వ్యవస్థని ఇటీవలికాలంలో బలహీన పరుస్తున్నాయి.

70 ఏళ్ళ రాజ్యాంగం అమలు నేపథ్యంలో సమాఖ్య వ్యవస్థని బలోపేతం చేయటానికి దేశవ్యాప్తంగా చర్చ అవసరం. అటు దేశ ఐక్యత, సమగ్రత, ఇటు అధికార వికేంద్రీకరణ, స్థానిక నిర్ణయాలు తీసుకునే అవకాశం, జవాబుదారితనం, ప్రజాస్వామ్య పరిణతి – వీటిని సమన్వయం చేయటం దేశ భవిష్యత్తుకి అవసరం.

చైనాలాంటి నియంతృత్వ దేశంలో కూడా మన కంటే చాలా ఎక్కువగా, విజయవంతంగా అధికార వికేంద్రీకరణ జరిగింది. చైనా గత 40 ఏళ్ళలో సాధించిన ప్రగతికి పునాది అధికార వికేంద్రీకరణ, స్థానిక ప్రభుత్వాలు, నిర్ణయాలలో వెసులుబాటు. ప్రజాస్వామ్య భారత్ ఈ పాఠాలు నేర్చుకోవటం అవసరం. సమాఖ్య వ్యవస్థని మరింత బలపరచి, అధికారాన్ని వికేంద్రీకరించి, జవాబుదారితనాన్ని, పాలనా సామర్థ్యాన్ని పెంచటం దేశ భవిష్యత్తుకి, ఆర్థిక ప్రగతికి అత్యంత కీలకం. ❖












# ఐడీఏడబ్ల్యూ 2020 ఇంకొన్ని చిత్రాలు




















RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2018-2020 Published on 10th February, 2020 Posting Date 15 &16th of every month






ఐడీపడబ్ల్యూ 2020: ధన రాజకీయం కట్టడికి...

# 'హైదరాబాద్ డిక్లరేషన్' ప్లీనరీ

**BOOK POST**

**PRINT MATTER**

*If undelivered please return to:*

*LOKSATTA UDYAMA SAMSTHA,*
*Tulips Apartments, 6-3-655,*
*Flat.No. 407,*
*Behind civil supplies office,*
*Somajiguda,*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**